3-5Pg1exHMNWJQE.qxd:3-5Pg1exHMNWJQE.qxd 01/01/01 10:47 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-5-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 91 పేజీలు: 12 వెల: 6.50

ఉగ్రవాదుల అంతానికి భారత్‌కు సహకరించండి: జెడి వ్యాన్స్

9లో

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌కు ఇడి నోటీసులు

## వికసిత్ భారత్ గ్రోత్ ఇంజన్

# 'అమరావతి'

### రాజధాని పునఃప్రారంభపనుల కార్యక్రమంలో ప్రధాని మోడీ

### 60 వేల కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

### విశాఖలో ఏక్తా మాల్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభసంకేతం

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను అధునాతనప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉంది అని, అమరావతిని వికసిత్ భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మార్చాలి అని ప్రధానమంత్రి మోడి అన్నారు. రాజధాని అమరావతి పునఃనిర్మాణ పనులను ప్రధాని మోడి ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నం అమరావతి పునఃప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి మోడి విచ్చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పలువురు మంత్రుల ప్రసంగాల అనంతరం ప్రధాని వర్చువల్‌గా పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం తెలుగులో ప్రసంగం ప్రారంభించిన ప్రధాని మోదీ దుర్గాభవానీ కొలువైన పుణ్యభూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. ఇవి కేవలం శంకుస్థాపనలు కాదు.. ఎపి ప్రగతికి, వికసిత్ భారత్‌కు నిదర్శనం. అమరావతి స్వప్నం సాకారం అవుతున్నట్లు కనిపిస్తోంది. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. అమరావతి ఒక నగరం కాదు, అమరావతి ఒక శక్తి. ఒక కొత్త అమరావతి, కొత్త ఆంధ్రప్రదేశ్. ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నా. చంద్రబాబు నా టెక్నాలజీ వాడకం గురించి చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పలువురు మంత్రుల ప్రసంగాల అనంతరం .రాష్ట్ర చరిత్రలో మరో మహోన్నత ఘట్టం ఆవిష్కృతమైంది. ఆంధ్రుల ఆశలకు, ఆకాంక్షలకు కేంద్రమైన రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ పునఃప్రారంభ సభలో హైకోర్టు, అసెంబ్లీ భవనం, సచివాలయ, హెచ్‌ఓడి టవర్ల నిర్మాణానికి, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. మొత్తం 57,962 కోట్లు విలువ గల 94 అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు చేసి జాతికి అంకితం ఇచ్చారు. అమరావతిలో రూ.49,040 కోట్లతో 74 ప్రాజెక్టు పనులకు అదనంగా రూ.5028 కోట్లతో చేపట్టే తొమ్మిది ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రూ.3680 కోట్లతో నిర్మాణం పూర్తైన 8 జాతీయ రహదారుల ప్రారంభించారు. మరో రూ.254 కోట్లతో నిర్మించిన మూడు రైల్వే ప్రాజెక్టులు జాతికి అంకితమిచ్చారు. రాజధానిలో కొత్తగా అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు భవనాలు, న్యాయమూర్తుల నివాస సముదాయ భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. విశాఖలో పీఎం ఏక్తా మాల్‌ను ప్రధాని ప్రారంభోత్సవం చేశారు. రూ.3680 కోట్లతో విలువైన నేషనల్ హైవే పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. న్యాయమూర్తుల నివాస సముదాయాలకు శంకుస్థాపన చేశారు. రూ.1459 కోట్లతో నాగాయలంకలో క్షిపణి ప్రయోగ కేంద్రం రూ.100కోట్లతో విశాఖలో డీపీఐఐటీ చేపట్టే యూనిటీమాల్‌కు రూ.293 కోట్లతో >>2



శుక్రవారం అమరావతి సభావేదిక నుంచి వర్చువల్‌గా వివిధ పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనులు చేస్తున్న ప్రధాని మోడీ. చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్



శుక్రవారం అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

## పదేళ్లలో అమరావతికి కేంద్రం అండగా నిలిచింది: ప్రధాని మోడీ

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ వికసిత ఏపీ కోసం కలగన్నారని దానిని మనందరం నిజం చేయాలి ప్రధాని మోడీ అన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచిందని అన్నారు. ఒకప్పుడు ఆంధ్రా, తెలంగాణ రైల్వే ప్రాజెక్టులకు కలిపి కేవలం 900 కోట్లలోపే అన్నారు. ఇప్పుడు కేవలం ఏపీకే 9వేల కోట్ల నిధులు ఇచ్చాం అన్నారు. గతానికంటే పది రెట్లు అధికంగా నిధులు కేటాయించామన్నారు. గత పదేళ్లలో ఏపీలో 750రైల్వే బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు నిర్మించాం అన్నారు. ఏపీలో 70కి పైగా రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు.

**ప్రధానికి ఘన సన్మానం:** అమరావతి రాజధాని పునః నిర్మాణ పనులకు విచ్చేసిన ప్రధాని నరేంద్రమోడీకి సభా వేదికపై ఘన సన్మానం జరిగింది. ఆయనకు ధర్మవరం నేసిన పట్టుకండువాను >>2



శుక్రవారం సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

## చరిత్రలో నిలిచిపోయే రోజు

### సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని పున:ప్రారంభోత్సవం జరిగిన రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత ఐదు సంవత్సరాలు రాజధాని పనులు ఆగిపోయాయని, విధ్వంసం జరిగిందని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని పున:ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఈ రోజు చాలా గొప్ప రోజు. చరిత్రలో శాశ్వతంగా లిఖించదగ్గ రోజు. ఆ రోజు అమరావతి పనులకు ప్రధాని మోదీ గారు శంకుస్థాపన చేశారు. ఐదు సంవత్సరాలు విధ్వంసం జరిగింది. పనులు నిలిచిపోయాయి. మళ్లీ ప్రధాని మోదీ గారే పున:ప్రారంభం చేస్తున్నా రంటే దీనికంటే మంచి రోజు చరిత్రలో ఇంకోటి లేదని విజ్ఞప్తి చేస్తున్నాన్న అని అన్నారు. 2014లో రాజధాని లేని పరిస్థితుల్లో మనం పాలన ప్రారంభించాం. అమరలింగేశ్వర స్వామి ఆలయం కొలువైన పుణ్యభూమిగా, శాతవాహనుల రాజధానిగా, భౌద్దుల ఆధ్యాత్మిక కేంద్రంగా, కృష్ణమ్మ తీరాన విలసిల్లిన అమరావతిని రాజధానిగా ఎంపిక చేశాం. అమరావతి కేవలం ఒక నగరం కాదు. 5 కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల సెంటిమెంట్. ప్రజల ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వానికి, ఆశలకు, >>2

## రైతుల త్యాగాలు మరువలేం

### ప్రపంచస్థాయి రాజధానిగా ఆవిర్భవించనున్న అమరావతి: పవన్ కళ్యాణ్

### ఐదేళ్లుగా నలిగిపోయిన అమరావతి రైతులు



**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి కోసం రైతులు చేసిన త్యాగం మరువలేనిదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌అన్నారు. శుక్రవారం వెలగపూడిలో అమరావతి రాజధాని పునర్ నిర్మాణ పనులను ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించడానికి ముందు పవన్ ఉద్వేగ పూరిత ప్రసంగం చేసారు. అమరావతి కోసం కేసులు పెట్టించుకున్నారు. ఆందోళనలు చేశారు. ఐదేళ్ల క్రితం మా బాధ ప్రధానికి తెలుస్తుందా? అని ఆనాడు మహిళలు అడిగారు. మీ కష్టాలు ప్రధానికి తెలియకుండా పోవన్నాను, 1237వ ఆది శంకరాచార్య జయంతి సందర్భంగా అమరావతి పునః ప్రారంభం జరుగుతుంది: అమరావతి రైతుల తరపున ప్రధానికి అభినందనలు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. దివిసీమ తుపానులా గత ప్రభుత్వం రాష్ట్ర, అమరావతి భవిష్యత్తును తుడిచిపెట్టిందన్నారు. అమరావతి అంటే పరదాలు, సెక్షన్ 144 గుర్తుకొచ్చేలా చేశారు. ధర్మం కోసం నిలిస్తే ధర్మం నిలుస్తుందని రైతులు చాటారు. ధర్మయుద్ధంలో రైతులు గెలిచారు. 34 వేల ఎకరాల భూములను రైతులు త్యాగం చేశారు. స్వచ్ఛందంగా తమ పొలాలు ఇచ్చిన రైతులకు, మీ త్యాగానికి మీ పోరాటానికి శిరస్సు వంచి నమస్కారాలు అన్నారు. అమరావతి పోరులో మహిళలు, దివ్యాంగుల లాఠీలు పడ్డాయి. గాయాల య్యాయి. శాయశక్తులా అమరావతి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పాటుపడుతుంది. అమరావతి మహిళా రైతుల పాత్ర చాలా అభినందనీయం. మగవారే ఆపేస్తే ఆడవారు బయటకొచ్చి పౌరుషం చూపారు పవన్‌కల్యాణ్ మహిళ సాహసం, సహనం అందరికీ ఆదర్శమన్నారు. గత ప్రభు త్వం అమరావతిని తుడిచిపెట్టిందన్నారు. అమరావతి సర్వశ్రేష్ట రాజధానిగా నిలుస్తుం దన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ దేశమే తన కుటుంబంగా చేసుకుంటూ దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోదీకి రాష్ట్ర ప్రజల తరపున నమస్కారాలు తెలియచేశారు ఏపీ ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్. ప్రస్తుతం దేశంలో కీలక పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఎంతో బిజీ షెడ్యూల్ మధ్య కూడా ప్రధాని అమరావతికి రావడం చాలా సంతోషకరమని పవన్ అన్నారు. ప్రధాని మోదీకి ఆ కనకదుర్గమ్మ మంచి ఆరోగ్యం, మరిన్ని విజయాలు ప్రసాదించాలని పవన్ దేవతామూర్తిని ప్రార్థించారు. అమరావతి రైతులు, రాష్ట్ర ప్రజలు ధర్మ యుద్ధంలో విజయం సాధించారని పవన్ చెప్పారు. అమరావతి పనులు పు:న ప్రారంభమవుతున్న శుభసందర్భంలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు పవన్ ధన్యవాదాలు తెలియచేశారు. గత ఐదేళ్లలో పడిన గాయాలు మనందరికీ గుర్తున్నాయి. ఎన్నో అవమానాలు, గాయాలు అమరావతి రైతులు అనుభవించారని పవన్ అన్నారు. "గత ఐదేళ్లు అమరావతి రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. లాఠీ దెబ్బలు కూడా తిన్నారు. అమరావతి రైతులు మరిచిపోలేని పోరాటం చేశారు. అమరావతే ఏపీ రాజధా నిగా ఉంటుందని ఆనాడు మాట ఇచ్చాం. ఇచ్చిన మాటకు కట్టుబడి మళ్లీ ప్రధాని నరేంద్ర మోదీతో రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభం చేసుకుంటున్నాం. గత ప్రభుత్వం అమరావతి భవిష్యత్‌ను తుడిచిపెట్టే సింది. అయితే, ధర్మయుద్ధంలో అమరావతి రైతులు విజయం సాధించారు" అని పవన్ అన్నారు. రాళ్లలో రప్పల్లో ఓ మహానగరాన్ని చూసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. సైబరా బాద్‌ను ఎలా రూపకల్పన చేశారో అలాగే అమరావతి రూపొందుతుందన్నారు. పెహల్గాం ఉగ్రవాది దాడి తర్వాత దేశం మొత్తం యుద్ధం వైపు వెళ్తోందన్నారు. గుండెల్లో ఎంతో బరువున్నా ప్రధాని అమరావతి వచ్చారు. ఉగ్రవాద బాధితుల ఆవేదనను నేను ప్రత్యక్షంగా చూశాను. ఉగ్రవాదంపై ప్రధాని కఠినమైన వైఖరి అనుసరిస్తారని పవన్ కల్యాణ్ అన్నారు. కనకదుర్గమ్మ ఆశీస్సులతో ప్రధానికి శక్తిని ఇవ్వాలి అని పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతి ప్రపంచస్థాయి రాజధానిగా ఆవిర్భవిస్తుందని పవన్ ఆకాంక్షించారు. రాజధాని రైతులు భూములు మాత్రమే ఇవ్వలేదు.. రాష్ట్రానికి ఒక భవిష్యత్ ఇచ్చారని పవన్ కల్యాణ్ కొనియాడారు.



## మోడీతో పెట్టుకుంటే మ్యాప్‌లో పాకిస్థాన్ కనుమరుగు

### సభలో మంత్రి లోకేష్

**సచివాలయం,మే 2,ప్రభాతవార్త :** రాష్ట్రంలో 2019-24నడుమ విధ్వంస పాలన నడిచింది. చంద్రబాబుపై వ్యక్తిగత కక్షతో అమరావతి చంపాలని చూశారు, ఒక్క ఇటుక పెట్టకుండా మూడు రాజధానులు అంటూ 5ఏళ్ళు గడిపేశారని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. అమరావతి పనుల పున:ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో లోకేష్ మాట్లా డుతూ 8ఏళ్ళ పిల్లాడి దగ్గర నుండి 80ఏళ్ళ వృద్ధుల వరకు జై అమరావతి అంటూ జెండా పట్టారు. జై అమరావతి అన్నందుకు ఆనాడు రైతులకు సంకెళ్ళు వేశారు. అమరావతి ఉద్యమంలో పాల్గొన్నందుకు మహిళా రైతుల్ని పోలీసుల బూటు కాలితో తన్నించారు. 1631రోజుల పాటు అమరా వతి ఉద్యమం కొనసాగింది. 270మంది రైతులు చనిపోయారు. 3వేల మంది పై అక్రమ కేసులు పెట్టారు. ఎన్ని కుట్రలు చేసినా జైఅమరావతి నినాదాన్ని మాత్రం ఆపలేకపోయారు. ఆపడానికి, పీకడానికి అమరావతి ఎవరి ఇంట్లో పెంచుకున్న పెరటి మొక్క కాదు. జనం గుండెల్లో దాచుకున్న ప్రజా రాజధాని, అమరావతికి శంకుస్థాపన చేసింది మన ప్రధాని. ఆయన శంకుస్థాపన చేసిన దాన్ని ఆపే దమ్ము ఎవడికీ లేదు. 1631రోజులు పోరాడి అమరావతిని సాధించుకున్న రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

**వరల్డ్ మ్యాప్‌లో పాకిస్థాన్ మిస్సింగ్ ఖాయం:** పాకిస్థాన్ గీత దాటింది. అమాయకుల్ని చంపి చాలా పెద్ద తప్పుచేసింది. ఒక్క పాకిస్థాన్ కాదు, వంద పాకిస్థాన్‌లు వచ్చినా భారతదేశం నేలపై మొలిచిన గడ్డి కూడా పీకలేదు. వంద పాకిస్థాన్లకు సమాధానం చెప్పే ఒక మిస్సైల్ మన దగ్గర ఉంది. ఆ మిస్సైల్ పేరు నరేం ద్రమోడీ. సింహం ముందు ఆటలు ఆడకూడదు. మన సింహం నమో కొట్టే దెబ్బకు వరల్డ్ మ్యాప్‌లో పాకిస్థాన్ మిస్సింగ్ అని రావడం ఖాయం. పాకిస్థాన్ ఆర్మీలో పనిచేసేవారు శెలవు పెట్టి పారిపోతున్నారు. కొంతమంది రాజీనామా చేస్తున్నారు. దటీజ్ నరేంద్ర మోడీ. నమో కొట్టే దెబ్బకి పాకిస్థాన్ దిమ్మతిరగడం ఖాయం. పాకిస్థాన్ కు ధీటుగా సమాధానం ఇవ్వడానికి దేశం మొత్తం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అండగా నిలుస్తుంది. పహల్గామ్ ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారికి నివాళులర్పిస్తున్నాను. ఉగ్రదాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు దేశం అండగా ఉంటుంది.

**కులగణన సంచలనాత్మక నిర్ణయం:** కేంద్రంకుల గణన చేయాలని తీసుకున్న నిర్ణయం ఒక సంచలనం. ఇతరులు దశాబ్దాలుగా సంకోచించిన ఒక కీలక అంశంపై మోడీజీ ధైర్యంగా నిర్ణయం తీసుకొని చరిత్రను తిరగ రాశారు. అణగారిన వర్గాలకు సాధికారత కల్పించాలనే నిబద్ధతకు లోబడి మోడీజీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయం >>2



## కస్టడీకి రాజ్ కసిరెడ్డి

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కెసిరెడ్డి రాజశేఖరరెడ్డిని విజయవాడ జిల్లాజైలు నుండి విచారణ నిమిత్తం సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. జిల్లా జైలు నుంచి వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం విచారణకు ఆయన్ను కార్యాలయానికి తీసుకువెళ్ళారు. వైకాప హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దల తరపున అన్నీ తానై వ్యవహరించిన కెసిరెడ్డి రాజశేఖరరెడ్డిని వారం రోజుల పాటు సిట్ కస్టడీకిస్తూ విజయవాడ >>2

### మతం మారిన రోజే..

## ఎస్సీ హోదా కోల్పోతారు

### హైకోర్టు స్పష్టీకరణ

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వ్యక్తులు క్రైస్తవంలోకి మారిన రోజే ఎస్సీ హోదాను కోల్పోతారని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎస్సీ,ఎస్టీ చట్టం నుండి రక్షణ పొందలేరని తెల్చిచెప్పింది. ఈ అంశంపై ఒక చర్చి ఫాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ క్రింద పలువురిపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని తప్పుబట్టింది. చట్టాన్ని దుర్వినియోగం చేసి తప్పుడు ఫిర్యాదు ఇచ్చారని ఆక్షేపించింది. పోలీసులు ఛార్జిషీటు వేయకుండా ఉండాల్సిందని అభిప్రాయపడింది. కేసును కొట్టేసింది. న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఈ మేరకు ఇటీవల తీర్పు ఇచ్చారు. తనను కులం పేరుతో దూషించి, దాడి చేసి గాయపరిచారని ఉమ్మడి గుంటూరు జిల్లా పిట్టలవాని పాలెం మడలం కొత్తపాలెం గ్రామానికి చెందిన ఫాస్టర్ చింతాడ ఆనంద్ 2021లో చందోలు పోలీసులకు >>2

## మీ సలహాలు ఆనందకర సేవలకు దోహదం

### భక్తుల అభిప్రాయాలకు వాట్సాప్‌తో టిటిడి నూతన ఫీడ్‌బ్యాక్

**తిరుమల,మే 2 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశం నలుమూలల నుండి తిరుమలకు విచ్చేస్తున్న భక్తులకు వసతి, దర్శనం, అన్నప్రసాదాలు ఇతరత్రా సేవలపై భక్తుల నుండి అభిప్రాయసేకరణకు టిటిడి అధికారులు వినూత్న ఆలోచన చేశారు. తిరుమలకు వచ్చిన భక్తులు అన్ని సేవలపై అందుతున్న సౌకర్యాలు ,ఇంకా మెరుగుపరచాల్సిన విషయాలు తెలుసుకునేందుకు టిటిడి కొత్త ఫీడ్‌బ్యాక్‌విధానం(అభిప్రాయసేకరణ)కు వాట్సాప్‌ద్వారా సులభంగా అభిప్రాయం చెప్పేలా రూపొందించింది. ఈ నూతన విధానం శుక్రవారం నుండి తిరుమలలో మొదలైంది. ఇందుకు పలు ప్రాంతాల్లో క్యూఆర్‌కోడ్‌ను ఏర్పాటుచేసి, భక్తులు తమ మొబైల్‌తో స్కాన్‌చేస్తే వాట్సాప్‌లో తెలియజేయాల్సిన అభిప్రాయసేకరణ కనిపిస్తుంది. తిరుమలలో గత పదినెలల కాలంలో సామాన్యభక్తుల సౌకర్యాలకు పెద్ద పీట వేస్తూ అన్నప్రసాదం, లడ్డూల నాణ్యత రుచి పెంచింది. తిరుమలలో పరిశుభ్రత కూడా కాటేజీల గదులు, అతిథిగృహాల గదుల్లో ,యాత్రికుల వసతి సముదాయాల్లో శుభ్రత, చెత్తా చెదారం తొలగిం చడం వంటి పనులు మెరుగుపడ్డాయి. టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రతిరోజూ లక్షమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో తిరుమలలో మెరుగుపరచాల్సిన సేవలపై భక్తుల నుండి సాంకేతికంగా అభిప్రాయసేకరణకు శ్రీకారం చుట్టింది.




**ఫీడ్‌బ్యాక్‌విధానం:** ఏడుకొండల వెంకన్న దర్శనార్థం తిరుమల, తిరుపతికి వస్తున్న భక్తులు తమకు ఎదురయ్యే ఇబ్బందులు, అసౌకర్యం, సూచనలు సలహాలు తెలియజేసేందుకు ప్రత్యేకంగా వాట్సాప్‌ద్వారా ఫీడ్‌బ్యాక్ విధానం అమలుచేస్తోంది. ఇందుకు భక్తులు సంచరించే పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్‌తో స్కాన్‌చేస్తే వాట్సాప్‌లో టిటిడి అభిప్రాయసేకరణ పేజీ కనిపిస్తుంది. ఈ అప్లికేషన్‌లో భక్తులు తమ పేరు, విభాగం అన్నప్రసాదం, కల్యాణకట్ట, లడ్డూకౌంటర్లు, లగేజీ, దర్శనం అను భవం, పరిశుభ్రత ,క్యూలైన్‌లు, గదులకు సంబంధించిన అంశాలు ఎంచుకోవాలి. ఆ తరువాత భక్తులు తమ అభిప్రాయం తెలియజేయడానికి టెక్స్ట్‌రూపంలోగానీ, వీడియో ఫార్మాట్‌ను >>2

## అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

### ఐబిఎం, టిసిఎస్, ఎల్‌అండ్‌టితో ఒప్పందం

**విజయవాడ,, మే2,ప్రభాతవార్తప్రతినిధి:** క్వాంటం కంప్యూటింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ముందువరుసలో నిలపాలని పట్టుదలతో అడుగులు ముందుకు వేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 2026, జనవరి 1న అమరావతి కేంద్రంగా క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. శుక్రవారం ఉండవల్లిలో సీఎం చంద్రబాబు నివాసంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐబీఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), లార్సన్ టూబ్రో సంస్థలతో ఎంవోయూ కుదుర్చుకుంది. >>2

3-5pg2exHMNWJQE.qxd:3-5pg2exHMNWJQE.qxd 01/01/01 10:43 AM Page 1





శుక్రవారం ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు



శుక్రవారం అమరావతి పనుల పునఃప్రారంభానికి హాజరైన అశేష జనవాహిని



ప్రధానికి వీడ్కోలు పలుకుతున్న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

## వికసిత్ భారత్‌కు గ్రోత్ ఇంజన్ 'అమరావతి'

>> గుంతకల్ వెస్ట్‌మల్లప్ప గేట్ ఆర్‌యూబీ నిర్మాణం 3,716 కోట్లతో ఆరు జాతీయ రహ దారుల ప్రాజెక్టులు రూ.254 కోట్లతో పూర్తి చేసిన ఖాజీపేట-విజ యవాడ మూడో లేన్‌ను ప్రారంభించారు. రూ.57,962 కోట్ల ప్రాజె క్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అధునాతనప్రదేశ్ మార్చే శక్తి అమరావతికి ఉంది. నేను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఏపీ సీఎంగా చంద్రబాబు టెక్నాలజీ వాడకాన్ని గమనించాను. ఏఐ, టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, విద్యా రంగాల్లో అమరావతి ముందు ఉంటుంది. 10 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం అమరావతికి అన్ని విధాలుగా మద్దతుగా నిలిచింది. రికార్డు స్పీడులో పనులు పూర్తి చేయడానికి కేంద్రం సహకరిస్తుంది. ఏపిలో అమరావతి నిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తుంది. ఏపిలోని ప్రతి ఒక్కరి కలలను అమరావతి సాకారం చేస్తుంది. అమరావతికి ఉన్న ఆటంకాలు తొలగిపోయి, ఇప్పుడు పనులు వేగంగా జరుగు తున్నాయి. గత పదేళ్లలో భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా నిలిచింది. ఏపిలో కనెక్టివిటీకి ఒక కొత్త అధ్యాయం మొద లవ్వబోతోంది. తక్కువ సమయంలో ... పర్యాటకం, తీర్థయాత్ర, తదితర రంగాలకు కూడా ఉపయో గపడుతుంది. హైవేల నిర్మాణం వల్ల టూరిజం అభివృద్ధి చెందు తుంది. అమరావతిని వికసిత్ భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మార్చాలి. అమృత్ భారత్ కింద చాలా రైల్వే స్టేషన్లను ఆధునీకరించాం. సాగునీరుకు ఇబ్బంది లేకుండా నదుల అనుసంధానం చేస్తున్నాం. మౌలిక సదుపాయాల కల్పన వల్ల ఉపాధి అవకాశాలు పెరుగు తాయి. పోలవరాన్ని వేగంగా పూర్తి చేయడానికి సహకారమందిస్తాం. శ్రీహరికోట నుండి జరిగే ప్రయోగాలు, దేశం మొత్తాన్ని గర్వపడేలా చేస్తున్నాయి. రోడ్ల నిర్మాణం వల్ల రైతులు, ఉద్యోగులు, సామా న్యులకు ప్రయోజనం. రైతులకు ఎలాంటి సమస్య ఉండకూడదనేది మా ఉద్దేశం 2009-14 వరకు ఉమ్మడి ఎపికి రూ.900 కోట్ల కంటె తక్కువ బడ్జెట్ ఉండేది. ఇప్పుడు ఒక్క ఎపి రైల్వే బడ్జెట్ రూ.9 వేల కోట్లపైనే ఉంది. రైల్వే ప్రాజెక్టులతో రాష్ట్రాల మధ్య అనుసంధానం పెరుగుతుందన్నారు. ఇది ఆర్థిక, పర్యాటక అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబునాయుడు మీద విశ్వాసం ఉందని, అమరావతి నగర నిర్మాణం మూడేళ్లలో పూర్తవుతుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. అమరావతిలో తలపెట్టిన అభివృద్ధి ప్రాజెక్టులన్నీ పూర్తైతే, ఆంధ్రప్రదేశ్ జీడీపీ గణనీయంగా పెరుగుతుందని ప్రధానమంత్రి అన్నారు. చంద్రబాబు ఆహ్వానం మేరకు నేను యోగా దినోత్సవం రోజున ఎపిలో పర్యటిస్తాను అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## అమరావతికి అండ

>> ఏపీ సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కప్పి సత్కరించారు. అమరావతి నగర నేపథ్యం ఉన్నకలంకారీ జ్ఞాపికను అందజేసారు. ఈ సభా వేదికపై మంత్రులు పి,నారాయణ, సత్యకు మార్ యాదవ్, నాదెండ్ల మనోహర్, కేంద్రమంత్రులు కె.రామ్మోహననాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్.శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ(సుజన) చౌదరి, తెనాలి శ్రావణ్‌కుమార్,వేదికపైకి వచ్చే ముందు మండలి బుద్ధప్రసాద్ తదితరులతో ప్రధాని కరచాలనం చేసారు.అమరావతి పునర్ నిర్మాణ పనులు అనంతరం ఆయన విజయవాడ విమానాశ్రయం చేరుకున్నారు.ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్ళారు.ఈ సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయనకు స్వయంగా వీడ్కోలు తెలిపారు. ఇక ప్రధాని సభకు భారీగా జనం తరలివచ్చారు.ప్రత్యేకంగా అమరావతి ఉద్యమంలో పాల్గొన్న మహిళలు ఈ సభలో అత్యంత ఉత్సాహంగా కన్పించారు .ప్రదాని, సీఎం,డీసీఎంలు ప్రసంగించే సందర్భంలో వారు జయహో అమరావతి అంటూ బిగ్గరగా నినాదాలు చేసారు. ప్రధాని రాక సందర్భంగా జాతీయరహదారిపై వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిం చారు. విజయవాడ మహానగరంలో వాహనాలు అడుగుపెట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.నేరుగా అమరా వతి చేరుకోవడానికి బైపాస్‌పై వాహనాలకు అనుమతినిచ్చారు.

## చరిత్రలో నిలిచిపోయే రోజు

>> ఆకాంక్షలకు ప్రతి రూపం ప్రపంచంలో ఎన్నడూ లేని విధంగా 29 వేల మంది అన్నదాతలు, 34 వేల ఎకరాలు రాజధానికిచ్చారు.అద్భుత రాజధాని నిర్మాణం తలపెడితే....తరువాత వచ్చిన ప్రభుత్వం విధ్వంసం చేసింది. నాటి ప్రభుత్వ దమనకాండ పై రైతులు, రైతు కూలీలు, మహిళలు తిరుగులేని పోరాటం చేశారు.ఈ సమయంలో జరిగిన న్యాయ పోరాటంలో న్యాయస్థానాలు అమరావతిని బతికించాయి. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా ఇచ్చిన ప్రజాతీర్పుతో అమరావతి మళ్లీ ఊపిరిపోసుకుంది. 10 నెలల్లో సవాళ్లను అధిగమించి, కేంద్ర సహకారంతో, మోదీజీ ఆశీస్సులతో అమరావతి నిర్మాణాలను పట్టాలెక్కించాం. నేడు మోదీ గారి చేతుల మీదుగా అమరావతి పనులను రీ స్టార్ట్ చేస్తున్నాం.రాష్ట్రంలో ప్రతి పౌరుడు సగర్వంగా ˊనా రాజధాని అమరావత్తి అని చెప్పుకునేలా నిర్మిస్తాం. 2015లో ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన రాజధానిని విధ్వంసం చేశారు మళ్లీ నేడు మీ చేతుల మీదుగా పనులు ప్రారంభించాం...రేపు మీరే మళ్లీ ప్రారంభోత్సవం చేయాలని కోరుతున్నాం.ఒకే రోజు రూ.49,000 కోట్ల విలువైన 74 పనులకు శంకుస్థాపన చేసుకున్నా వీటికి అదనంగా రూ.5,028 కోట్లతో చేపట్టే 9 కేంద్ర ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అలాగే, రూ.3,680 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 8 జాతీయ రహదారులను ప్రధాని ఈ రోజు ప్రారంభించారు.మరో రూ.254 కోట్లతో నిర్మించిన 3 రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. అమరావతి, కేంద్ర ప్రాజెక్టులు కలిపి మొత్తం రూ.57,962 కోట్ల విలువైన 94 ప్రాజెక్టులకు ఈరోజు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. వరల్డ్ క్లాస్ క్యాపిటల్ : బ్లూ అండ్ గ్రీన్ సిటీగా అమరావతి ఉంటుంది. 30 శాతం ప్రాంతం పచ్చదనం, జలవనరులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం. నవ నగరాలను రాజధానిలో భాగంగా ఉంటాయి. రాజధాని నిర్మాణానికి ప్రధాని మోదీ గారు పలు సూచనలు చేశారు. వాటిని అమలుచేస్తాం.ఇన్నర్ రింగ్ రోడ్, అవుటర్ రింగ్ రోడ్, భవిష్యత్ నగరంగా అమరావతి ఉంటుంది. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టుతో అన్ని ప్రపంచ దేశాలకు కనెక్టివిటీ పెంచుతాం. ప్రపంచస్థాయి సంస్థల ఏర్పాటుతో అమరావతి హెల్త్, ఎడ్యుకేషన్ హబ్ గా ఉండబోతోంది.మోదీ గారు సూచించిన జపాన్ మియావాకీ తరహా పచ్చదనం పెంచే విధానాన్ని అమలు చేస్తాం.అన్నీ వయాడక్ట్ పద్ధతిలో అందిస్తాం. గ్రీన్ ఎనర్జీతో పర్యావరణ అనుకూలంగా రాజధానిఇన్ లాండ్ వాటర్ వేస్, సైక్లింగ్ ట్రాక్స్, డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం, వాకింగ్ పాత్ తీసుకువస్తాం. బిజినెస్ స్కూల్, గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తాం.అభివృద్ధి వికేంద్రీకరణ మన సిద్ధాంతం. రాజధాని మాత్రమే కాదు26 జిల్లాల్లో ప్రతీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం. అభివృద్ధి వికేంద్రీకరణ చేపడతాం. 201419 మధ్య కేంద్ర ప్రభుత్వ సంస్థలను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేశాం. కేంద్ర సహకారంతో 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం. రాష్ట్రంలో నదుల అనుసంధానం పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీళ్లు ఇస్తామన్నారు.

**ప్రధాని మోదీకి అండగా ఉంటాం:** సీఎం చంద్రబాబు తన ప్రసంగం ప్రారంభంలోనే ఉగ్రవాదం గురించి ప్రస్తావించారు.ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. ముందుగా మీ అందరికీ ఓ విషయం చెప్పాలి. గతంలో మోదీ గారిని ఎప్పుడు కలిసినా.. చాలా ఆహ్లాదకరంగా ఉండేవారు. కానీ, మొన్న అమరావతి కార్యక్రమానికి పిలవడానికి వెళ్లాను. ఆ మీటింగ్ చాలా గంభీరంగా సాగింది. దీనికి కారణం..ˊ నా దేశ ప్రజలు ఉగ్రవాదుల దాడిలో చనిపోయార్ఠు అన్న ఆవేదన మోదీ గారిలో చూశాను. ఈ సందర్భంగా మీ అందరి తరపునా ఆయనకు నేనో విజ్ఞప్తి చేస్తున్నాను. ఉగ్రవాదాన్ని అణిచివేయడానికి మోదీ, కేంద్రం తీసుకునే నిర్ణయాలకు మేము అండగా ఉంటాṃ స్పష్టం చేశారు.

**రైట్ లీడర్ ఫర్ ది నేషన్:** నరేంద్ర మోదీ నాయకత్వం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రైట్ టైం .. రైట్ లీడర్ ఫర్ ది నేషన్.. దట్ ఈజ్.. నరేంద్ర మోదీజీ. చాలా దృఢమైన నాయకుడు.. బ్యాలెన్స్ కలిగిన నాయకుడు. ప్రపంచం నలుమూలలా ఉన్న ప్రజలందరూ మోదీ నాయకత్వాన్ని మెచ్చుకుంటున్నారు. నరేంద్ర మోదీ తన 11 ఏళ్ల పాలనలో ప్రపంచ ఎకానమీలో దేశాన్ని 10 స్థానం నుంచి 5వ స్థానానికి తీసుకువచ్చారు. ఈ సంవత్సరం జపాన్‌ను వెనక్కు నెట్టి 4వ స్థానంలోకి రాబోతోంది అని అన్నారు.

## ప్రధాని మోడీకి ఘనస్వాగతం

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు పునః ప్రారంభం సందర్భంగా వెలగపూడి చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హెలీప్యాడ్ వద్ద గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,స్వాగతం పలికారు.అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో సభా వేదిక వద్దకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేరుకున్నారు.సభావేదికపై వస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి అపూర్వస్వాగతం లభించింది.సభావేదిక వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీˇ మంత్రులు నారా లోకేష్ , నారాయణ సత్యకుమార్ కొల్లు రవీంద్ర గారు, నాదెండ్ల మనోహర్ కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడుశ్రీనివాసవర్మ , పెమ్మసాని చంద్రశేఖర్ కూటమి ఎమ్మెల్యేలు, నేతలు. స్వాగతం పలికారు. అంతకు ముందు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ప్రజా ప్రతినిధులు, ఇతర రాజకీయ ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం మధ్యాహ్నం 02:50 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న భారత ప్రధానికి ప్రజా ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు స్వాగతం పలికారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, హోంమంత్రి వంగలపూడి అనిత, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్స్, బీమా వైద్యసేవలు శాఖ, కృష్ణా జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్ (చిన్ని), బాపట్ల పార్లమెంట్ సభ్యులు కృష్ణ ప్రసాద్ తెన్నేటి, రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, కొణిదల నాగబాబు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు యలమంచిలి సుజనా చౌదరి, కైకలూరు నియోజకవర్గం శాసనసభ్యులు కామినేని శ్రీనివాసరావు, ఉత్తర విశాఖపట్నం శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు, జమ్మలమడుగు నియోజకవర్గ శాసనసభ్యులు సిహెచ్ ఆదినారాయణ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు కంభంపాటి రామ్మోహన్ రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి అనంత రాము, పోలీసు జైల్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డిజి అంజనీ కుమార్, ఇంటెలిజెన్స్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ అభిషేక్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు ప్రధానమంత్రికి ఘన స్వాగతం పలికారు.

## కేంద్రం సాయం మరువలేనిది: సీఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనుల పున:ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి మన:పూర్వకంగా స్వాగతం పలుకుతున్నట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'వేదికగా పోస్టు చేశారు. రాష్ట్ర ప్రజల కలల రాజధాని నిర్మాణాన్ని సాకారంచేసేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఏపీలో ప్రతి పౌరుడికీ ఉద్యోగ,ఉపాధి అవకాశాలు సృష్టించే ప్రజా రాజధానిగా అమరావతి ఆవిష్కృతం అవుతుందని, సంపద సృష్టితో రాష్ట్రానికి ఒక చోదక శక్తిగా నిలబడుతుందని పేర్కొన్నారు. ఇందుకు సహకరిస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

### ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపం అమరావతి - డీ.సీ.ఎం పవన్‌కళ్యాణ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులను పున:ప్రారంభించేందుకు రాష్ట్రానికి విచ్చేస్తున్న నరేంద్ర మోడీకి హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపంగా రూపుదిద్దుకుంటున్న ప్రజా రాజధాని పునర్నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నందున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.

## మోడీతో పెట్టుకుంటే మ్యాప్‌లో పాకిస్థాన్ కనుమరుగు

>> కోసం దశాబ్ధాలుగా చేస్తున్న పోరాటాలకు ఈ నిర్ణయం పరిష్కారం చూపుతుంది.

**జెట్ స్పీడ్‌తో అభివృద్ధి వికేంద్రీకరణ:** ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా అమరావతి పనులు తిరిగి ప్రారంభం అవుతున్నాయి.ఇక మనకు తిరుగులేదు.అమరావతి అన్‌స్టాపబుల్ అభివృద్ధి వికేంద్రీకరణ జెట్‌స్పీడ్‌తో జరగబోతుంది.అమరావతి,పోలవరం,విశాఖ స్టీల్ ప్లాంట్,భోగాపురం ఎయిర్ పోర్ట్ ,ప్రకాశం జిల్లాలో సిబిజి ప్లాంట్ స..ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అన్ని రకాలుగా ప్రధాని నరేంద్ర మోడీ సహకారం అందిస్తున్నారు.మనం గతాన్ని ఒకసారి గుర్తుచేసుకోవాలి.2014లో కట్టుబట్టలతో మనల్ని బయటకు గెంటేశారు.ఎక్కడినుండి పరిపాలన ప్రారంభించాలో తెలియని పరిస్థితి,చంద్రబాబుకి సంక్షోబాలు కొత్త కాదు..ఒక పక్క సంక్షేమం..మరో పక్క అభివృద్ధి చేసి చూపించారు.అందరూ ఆమోదం తెలిపిన తర్వాతే అమరావతిని రాజధానిగా ప్రకటించారు.రైతుల త్యాగాలతో అమరావతి ఏర్పడింది. ఒకే రాజధాని..అభివృద్ధి వికేంద్రీకరణ ఎజెండాతో పనిచేశాం.రాయలసీమను ఎలక్ట్రానిక్స్,ఆటోమోబైల్ హబ్‌గా తయారు చేశాం.గోదావరి జిల్లాల్లో అక్వాను ప్రోత్సహించాం,ఉత్తరాంధ్రలో ఫార్మా,ఐటి కంపెనీలను తీసుకొచ్చాం .

**ఇప్పుడు ఏపిలో డబుల్ ఇంజన్ సర్కార్:** ప్రధాని నరేంద్రమోడీజీకి ఆంధ్రప్రదేశ్ అన్నా,అమరావతి అన్నా ఎంతో ప్రేమ.ఇప్పుడు ఆయన ఢిల్లీలో ఎంత బిజిగా ఉన్నారో మనందరికీ తెలుసు,అయినా ఈ కార్యక్రమానికి వచ్చారు.2024ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయేకి 94శాతం సీట్లు ఇచ్చారు.మన ప్రధాని ఆంధ్రప్రదేశ్ కోరిన ప్రతి కోరికను తీరుస్తున్నారు.గతంలో విశాఖపట్నం వచ్చి రైలే వ్జోన్,ఎన్టీపిసీ గ్రీన్,నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేశారు.విశాఖ ఉక్కును కాపాడారు.ఇప్పుడు అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించడమే కాకుండా పనులు తిరిగి ప్రారంభిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ లోఇప్పుడు డబుల్‌ఇంజన్ సర్కార్ ఉంది.రెండూ పవర్ ఫుల్ ఇంజన్లు ఒక్క పక్క పవర్‌ఫుల్ ఇంజన్ నమో,మరోపక్క మన చంద్రబాబు అభివృద్ధి సంక్షేమం జోడెద్దుల బండి ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తూ అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నారు మన చంద్రబాబు,పవనన్న ఇక మనకు తిరుగులేదు.

**20లక్షల ఉద్యోగాల కల్పనదిశగా అడుగులు:** ప్రజాప్రభుత్వం ఏర్పడిన 10నెలల్లోనే 8లక్షల కోట్ల పెట్టుబడులు వాటి ద్వారా 5లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఒప్పందాలు కుదుర్చుకున్నాం.16347పోస్టులతో మెగా డిఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం.185000కోట్లు పెట్టుబడి,57వేల మందికి ఉద్యోగాలు కలి ్పంచే ఎన్టీపిసి గ్రీన్ ఎనర్జీ విశాఖపట్నం రాబోతుంది. 136000కోట్లు పెట్టుబడి, 55వేల మందికి ఉద్యోగాలు కల్పించే ఆర్సెల్లార్ మిట్టల్ అనకాపల్లికి రాబోతుంది.97000కోట్లు పెట్టుబడి,3వేల మందికి ఉద్యోగాలు కలి ్పంచే బిపిసిఎల్ రామాయపట్నం కి రాబోతుంది.తిరుపత్తి జిల్లాకు ఎల్జీ ఎలక్ట్రానిక్స్,కర్నూలు,కడప,అనంతపురం కు రెన్యూవబుల్ ఎనర్జీ ప్రకాశం కు రిలయన్స్ సిబిజి ఉత్తరాంధ్రకు ఫార్మా,ఐటి ఇలా అన్ని జిల్లాలను అభివృద్ధి చేయబోతున్నాం.5ఏళ్ళలో 20లక్షల ఉద్యోగాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

## కాందహార్ హైజాకర్ ఇంట్లో ఎన్ఐఏ సోదాలు

**శ్రీనగర్, మే 2:** పహల్గాం దాడి అనంతరం కశ్మీర్‌లో భద్రతా దళాలు గాలింపు చర్యలను మరింత వేగవంతం చేశాయి. ఐసీ 814 విమానాన్ని హైజాక్ చేసిన అల్ ఉమర్ ముజాహిద్దీన్ చీఫ్ ముష్తాక్ అహ్మద్ జర్గర్‌ను ఉగ్రవాదులు విడిపించారు. ఈనేపథ్యంలో అతని నివాసంలో శుక్రవారం భద్రతా దళాలు సోదాలు చేపట్టాయి. కీలక ఆధారాల కోసం ఈ సోదాలు చేపట్టారు. ఈ ఉగ్రదాడికి కర్మ, కర్త, క్రియ అంతా పాకిస్థానేనని ఇప్పటికే ఎన్ఐఏ తన ప్రాథమిక దర్యాప్తులో స్పష్టం చేసింది. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాతో పాక్ ఈ దాడి చేయించిందని పేర్కొంది. అదీకాక అల్ ఉమర్ ముజాహిద్దీన్ చీఫ్ ముష్తాక్ అహ్మద్ జర్గర్ ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంటున్నాడు.అతడికి, ఈ దాడికి ఏమైనా సంబంధాలుండే అవకాశ ముందని ఎన్ఐఏ భావిస్తోంది. అందులోభాగంగా అతడి ఇంటిలో ఈ తనిఖీలు చేపట్టింది.

## వారం - వర్జ్యం

తేది : 03-05-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
షష్ఠి ఉ.7.54
పునర్వసు మ.12.39
వర్జ్యం రా.8.45-10.22
దు.శే.5.42-ఉ.7.21
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం సంతోషం కలి గిస్తుంది. ఆకస్మిక ధన, వస్తు, లాభాలు పొందుతారు.

**వృషభం :** వ్యవహారాలు విజయం వంతంగా పూర్తిచేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో మరింత ప్రోత్సాహం పొందుతారు.

**కర్కాటకం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆలయాలు సందర్శిస్తారు.

**సింహం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**కన్య :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వృత్తి, వ్యాపారా లలో తొందరపాట వద్దు..

**తుల :** ఉద్యోగాలలో గందరగోళంగా ఉంటాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**వృశ్చికం:** ఆర్థిక ఇబ్బందులు తొలుగు తాయి. చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు.

**మకరం:** వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు ఏర్పడిన అధిగమించి ముందుకు సాగుతారు. వస్తుకొనుగోలు.

**కుంభం:** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**మీనం :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగాలలో చిన్న చికాకులు తప్పవు.


- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

>>దీంతో అమరావతిలో భారతదేశపు మొట్టమొదటి, అత్యాధునిక క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్ నిర్మాణం కానుంది. దేశంలోనే తొలిసారి ఐబీఎం అతిపెద్ద క్వాంటమ్ కంప్యూటర్ 156 క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్ కలిగినˊక్వాంటం సిస్టం 2ని అమరావతిలో నెలకొల్పనుంది.ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు.

**ఆంధ్రప్రదేశ్‌కు చారిత్రాత్మక రోజు :** 1990 దశకంలో దేశంలో ఐటీ విప్లవానికి ఆంధ్రప్రదేశ్ కీలకంగా నిలిచిందని సీఎం చంద్రబాబు అన్నారు., ఇప్పుడు దేశంలో క్వాంటమ్ విప్లవానికి కూడా నాయకత్వం వహిస్తుందని అన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీతో జరిగిన ఒప్పందంˊఈ రోజు ఆంధ్రప్రదేశ్‌కే కాదు, భారతదేశానికి కూడా చారిత్రాత్మకం అని ముఖ్యమంత్రి అన్నారు. ˊక్వాంటమ్ కంప్యూటింగ్ భవిష్యత్ పాలనకు, ఆవిష్కరణలకు పునాది అవుతుందని చెప్పారు. సాంకేతికరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కొత్త అవకాశాలు వస్తున్నాయని, అయితే వాటిని అందిపుచ్చుకోవడం ముఖ్యమని సీఎం చంద్రబాబు అన్నారు. భవిష్యత్ అవసరాలన్నీ క్వాంటం కంప్యూటింగ్‌పైనే ఆధారపడి ఉంటాయని అందుకే అమరావతిని క్వాంటం వ్యాలీ చేయాలనుకున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సిలికాన్ వ్యాలీ తరహాలో క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దాలని ఐబీఎం, టీసీఎస్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. హైటెక్ సిటీని 15 నెలల్లో నిర్మించిన అనుభవాన్ని గుర్తుచేస్తూ, క్వాంటమ్ వ్యాలీ తక్కువ సమయంలోనే నిర్మించవచ్చన్నారు. ఇప్పటికే ఎల్ టీకి స్థలాన్ని కేటాయించామని, మౌలిక వసతులను అత్యంత వేగంగా అభివృద్ధి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకోసం రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒక కమిటీ నిర్మాణం పురోగతిని పరిశీలిస్తే, మరొక కమిటీ వ్యవస్థ అభివృద్ధిపై దృష్టి సారిస్తాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి త్వరలోనే ఈ ప్రాజెక్టును సవివరంగా తెలియజేస్తామన్నారు.

**క్వాంటం ప్రయాణానికి కీలక మలుపు :** భారతదేశంలో ఐబీఎం క్వాంటం సిస్టం 2 స్థాపన, దేశ క్వాంటం ప్రయాణానికి కీలక మలుపు కానుందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టీసీఎస్‌తో కలిసి పని చేయడం వల్ల క్వాంటం అల్గోరిథం అభివృద్ధి వేగవంతం అవుతుందని ఐబీఎం క్వాంటం వైస్ ప్రెసిడెంట్ జే గాంబెట్టా అన్నారు. క్వాంటం, క్లాసికల్ సిస్టమ్‌లను కలిపిన హైబ్రిడ్ కంప్యూటింగ్ ద్వారా జీవశాస్త్రం, మెటీరియల్స్, క్రిప్టోగ్రఫీ వంటి రంగాల్లో విప్లవాత్మక ఫలితాలు సాధించవచ్చని ఇది ఒక కీలక ఘట్టమని టీసీఎస్ సీటీవో డాక్టర్ హారిక్ విన్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో టీసీఎస్ తొలిసారి రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్‌కు బీజం వేసిందని టీసీఎస్ ప్రతినిధులు వి. రాజన్న, సి.వి. శ్రీధర్ గుర్తు చేశారు. క్వాంటం వ్యాలీ ద్వారా పరిశోధన, అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని చెప్పారు. దివీఐ నెట్‌వర్క్ ద్వారా 17 రాష్ట్రాల్లో 43 కేంద్రాలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుతుందని వివరించారు. క్వాంటం కంప్యూటింగ్ అనేది రెండో క్వాంటం విప్లవమని, ఈవీ బ్యాటరీల నుంచి ఆర్థిక వ్యవస్థ వరకు దీని ఉపయోగాలు విస్తృతంగా ఉంటాయని ఐబీఎం వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రౌడర్ అన్నారు. తాజా ఒప్పందంతో అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు తొలి అడుగు పడినట్టయ్యింది. క్వాంటం కంప్యూటింగ్ పరిశోధనలకు ఆంధ్రప్రదేశ్‌ను జాతీయ కేంద్రంగా మార్చడం ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించాలనేది రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నమన్నారు.




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐబీఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), లార్సన్ టూబ్రో సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంవోయు కుదుర్చుకున్న దృశ్యం

## కస్టడీకి రాజ్ కసిరెడ్డి

>> ఎసిపి ప్రత్యేక న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఆయన్ను శుక్రవారం నుండి ఈ నెల 8వ తేదీ వరకు సిట్ కస్టడీకి అప్పగించింది. రోజూ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6గంటల మధ్య విచారించాలని పేర్కొంది. మద్యం సరఫరా కంపెనీలు,డిస్టిలరీల నుంచి కెసిరెడ్డి ప్రతి నెల రూ.50-60 కోట్ల మేర ముడుపులు వసూలు చేసి,ఆ సొమ్మంతా నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికి చేర్చేవారని సిట్ దర్యాప్తులో గుర్తించింది.

## మీ సలహాలు ఆనందకర సేవలకు దోహదం

>> ఎంచుకోవాలి. సేవలకు సంబంధించి భక్తులు అభిప్రాయాలను ఉత్తమం/సగటు, మకరింత మెరుగుదల అవసరం లేదా బాగాలేదు అనే వాటిపై తమ రేట్‌చేయాల్సి ఉంటుంది. భక్తులు తమ అభిప్రా యాన్ని గరిష్టంగా 600 అక్షరాల పరిమితిలో టైప్‌చేయవచ్చు.వీడియోగా అప్‌లోడ్ చేయవచ్చు. అభిప్రా యం పూర్తిచేసిన వెంటనే "మీ అభిప్రాయం విజయవంతంగా నమోదు చేయబడింది,మీ విలువైన ఫీడ్‌బ్యాక్‌కు ధన్యవాదాలు"అనే ధృవీకరణ సందేశం ఆ మొబైల్‌నంబర్‌కు వస్తుంది. భక్తుల నుండి అందిన అభిప్రాయాలను టిటిడి యాజమాన్యం పరిగణనలోనికి తీసుకుని సేవల ప్రమాణాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటుంది.

## ఎస్సీ హోదా కోల్పోతారు

>> ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఎ.రామిరెడ్డి మరో ఐదుగురిపై ఎస్సీ ఎస్టీ చట్టంతో పాటు ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ గుంటూరు ఎస్సీ,ఎస్టీ కోర్టులో పెండింగ్‌లో ఉంది. కేసును కొట్టేయాలంటూ నిందితులు 2022లో హైకోర్టులో పిటీషన్ వేశారు. ఫఠిర్యాదులోనే పేర్కొన్నారు. తాజాగా జరిగిన విచారణలో పిటీషనర్ల తరపు న్యాయవాది జేవీ ఫణిదత్ వాదనలు వినిపించారు. ఫిర్యాదుదారు పదేళ్ళుగా ఫాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ విషయాన్ని ఫిర్యాదులోనే పేర్కొన్నారు. క్రైస్తవంలోకి మారిన వ్యక్తికి ఎస్సీ,ఎస్టీ చట్టం వర్తించదు. రాజ్యాంగం(షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్-1950 ప్రకారం హిందువదూ మతాన్ని కాకుండా ఇతర మతాలను స్వీకరించిన వారిని ఎస్సీ,ఎస్టీ చట్టం క్రింద రక్షణ ఉండదని సుప్రీం కోర్టు తీర్పులు ఇచ్చింది. వీటిని పరిగణలోకి తీసుకొని కేసును కొట్టేయండి అని కోరారు. పాస్టర్ ఆనంద్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఫిర్యాదిదారుడు ఎస్సీ అని తహాశీల్దార ధృవపత్రం ఇచ్చారని గుర్తు చేశారు. పిటీషనర్ల తరపు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి ఎస్సీ,ఎస్టీ చట్టం క్ర ఇంద ఫిర్యాదుదారుడు రక్షణ పొందలేదని నిందితులపై ఐపీసీ కింద నమోదు చేసి సెక్షన్లు చెల్లుబాటు కావని తీర్పులో పేర్కొన్నారు.

03-05Pg3exHMNWJQEVCP.qxd:03-05Pg3exHMNWJQEVCP.qxd 01/01/01 10:28 AM Page 1



# కర్నూలు - గుంటూరు హైవేపై రోడ్డు ప్రమాదం

## శ్రీశైలం నుంచి ఆదోని వెళ్తూ చెట్టును ఢీకొన్న బొలెరో వాహనం - నలుగురు వ్యక్తులు మృతి!

### గాయపడిన క్షతగాత్రులను ఆత్మకూరు వైద్యశాలకు తరలించిన పోలీసులు

**ఆత్మకూరు,మే02,ప్రభాతవార్త:** కుటుంబంతో కలసి శ్రీశైలం పుణ్యక్షేత్రంలో వెలసిన మల్లికార్జున బ్రహ్మారాంభిక స్వామి ఆశీస్సుల కోసం ఆదోని పట్టణం నుంచి గురువారం శ్రీశైలానికి బయలు దేరి వెళ్లారు. దర్శనం చేసుకోని తిరుగు ప్రయాణంలో శుక్రవారం నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండల పరిధిలోని సిద్దాపురం చెరువు కట్ట సమీపంలోని కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై ఘోరా రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సిఐ రాము, ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి సంఘటన స్థలానికి చేరుకోని క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో ప్రవేట్ వాహనాలలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడిక్కడే నలుగురు మృతి చెందారు. మృతులలో చంద్రమ్మ (35) శశికళ(40), గిడ్డయ్య(42), లక్ష్మి(28)లు మృతి చెందారు. రామాంజి అనే వ్యక్తి పరిస్థితి తీవ్రమైన గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు మెరుగైన చికిత్స కోసం తరలించారు. చిన్నపిల్లలు, వృద్దులు, మహిళలు, పెద్దలు అందరికి తలకు, మోచేతులకు, కాళ్ళకు, మెడ, వీపుపై బలమైన గాయాలు కావడం జరిగింది. చికిత్స తీసుకుంటునగానే మరోకరు మృతి చెందారు. 16మందికి పైగా క్షతగాత్రులు తీవ్రమైన గాయాలు, రక్తం అధికంగా పోవడంతో మెరుగైన వైద్యసేవలు అందించడం జరుగుతుంది. నల్లమల అటవీ ప్రాంతంలోని ఘాట్ రోడ్డులో తీవ్రమైన ఘోర రోడ్డు ప్రమాదం జరగడం ఇదే మొదటి సారి. ఉరుములు, మెరుపులతో గాలివాన భీభత్సవం రావడంతో స్పీడ్‌గా వస్తున్న బొలెరా వాహనం ఆకస్మికంగా అతి వేగంతో వెళ్లి చెట్టుకు డీకొన్నడంతో బొలెరో వాహనంలో ఉన్న కుటుంబ సభ్యులు అందరు వాహనం తిరిగి పడడంతో నలుగురు ప్రాణాలు అక్కడే పోయాయి. వాహనదారులు ప్రాణాంతకమైన మలుపులను దృష్టిలో ఉంచుకోని నల్లమల అటవీ ప్రాంతంలో ప్రయాణం నెమ్మదిగా కొనసాగించాలని పోలీసులు వాహనదారులకు సూచిస్తున్నారు. కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘోరా రోడ్డు ప్రమాదంలో పోయిన ప్రాణాలు తిరగి రావని కుటుంబం అంతా కలసికట్టుగా దైవ దర్శనంకు వెళ్లి కొందరు తిరిగిరాని లోకంకు వెళ్లడం వంటి సంఘటనలు ఎదురవుతే ఆ కుటుంబం అంతా కన్నీమునీరు కావాల్సిందేనని పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదంపై ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి దిగ్భ్రాంతి... మండల పరిధిలని ఎస్‌ఎన్‌తాండ - బైర్లూటి మద్యలో గల సిద్దాపురం చెరువు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం ఘటనపై శ్రీశైలం ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఆదోనికి చెందిన భక్తులు శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరగడం మరవలేనిది అన్నారు. నలుగురు మృతి చెందడంతో మరో 14మంది గాయాపడడం పట్ల విచారణ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులు తెలిపారు. ప్రమాద బాదితులను ఆదుకుంటామని ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి తెలియజేశారు.



గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ రైలు మార్గంలో తాజాగా అందుబాటులో వచ్చిన పాణ్యం-బుగ్గానిపల్లె డబ్లింగ్ రైలు మార్గం

## సీమలో రూ.477 కోట్లతో రైల్వే ప్రాజెక్టులు

**గుంతకల్లు రైల్వే,మే 2,ప్రభాతవార్త** రాష్ట్రంలో రూ.477కోట్ల వ్యయంతో భారీ రైల్వే ప్రాజెక్టులకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ పచ్చజెండా ఊపారు. వీటిలో ఒకటి ప్రారంభోత్సవం కాగా, మరొకటి శంకుస్థాపనలు, రాయలసీమలోని పడమటి గుంతకల్లు నుంచి మల్లప్ప గేట్ వరకు రూ.293కోట్ల అంచనా వ్యయంతో కొత్తగా నిర్మించనున్న 10కి.మీల రైలు ఓవర్ రైలు(ఆర్ఓఆర్) నూతన రైలు మార్గాన్ని ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. అలాగే గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ రైలు మార్గంలో భాగంగా పాణ్యం-క్రిష్ణమ్మ కోన-బుగ్గానిపల్లె సిమెంట్ నగర్‌ల మద్య రూ.184కోట్ల వ్యయంతో పూర్తి చేసిన 19కి.మీ డబ్లింగ్ రైలు మార్గాన్ని ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్,సిఎం చంద్రబాబు,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు,ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి, గన్నవరం నుండి గరివిడికి 18 మంది ప్రొఫెసర్లు బదలీ

**గరివిడి ( విజయనగరం జిల్లా ) మే,2 ప్రభాతవార్త:** వాత్త నెలలో వి సి ఐ ఇన్స్ పెక్షన్ జరగనుండటం తో గరివిడి పశు వైద్య కళాశాలకు తిరుపతి, గన్నవరం పశు వైద్య కళాశాలల నుండి 18 మంది ప్రొఫెసర్ లను హడావిడిగా బదిలీ చేశారు. ఈ నెల రెండోవారం,లేదా మూడో వారం లో గరివిడి పశు వైద్య కళాశాల ను పరిశీలించేందుకు న్యూ ఢిల్లీ కి చెందిన వేటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం రానున్న నేపథ్యంలో తిరుపతి, గన్నవరం నుండి ఇక్కడి కి 18 మంది ప్రొఫెసర్ లను తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ వీర బ్రహ్మయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతం లో విసిఐ ఇన్స్ పెక్షన్ సమయంలో హడావిడి గా తిరుపతి, గన్నవరం నుండి గరివిడి పశువైద్య కళాశాలకు డెప్యుటేషన్ పై గరివిడి పశు వైద్య కళాశాల కు చెందిన 20 మంది ప్రొఫెసర్ లనుబదిలీ చేసిన అధికారులు మళ్ళీ అదే బృందం పరిశీలనకు రానుండటంతో మళ్ళీ బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా గతంలో వి సి ఐ పరిశీలన అనంతరం వెంటనే అదే ప్రొఫెసర్లు ని గరివిడి నుండి డెప్యూటేషన్ పై తిరుపతి, గన్నవరం కళాశాలకు బదిలీ చేశారు. కాగా 18 మంది ప్రొఫెసర్లులో విశాఖపట్నం, వెన్నెల వలస,వెంకట మంగన్న గూడెం,రామచంద్రాపురం ,విశాఖపట్నం లో గల కళాశాలల నుండి 6 గురు ఆచార్యులు ఉన్నారు.వి సి ఐ పరిశీలన కే ఆచార్యులను పరిమితం చేయడం వలన ఇక్కడ విద్యార్థులు కి విద్యా బోధనలో ఇబ్బంది కర పరిస్థితులు ఉత్పన్నమవు తున్నాయి. శాశ్వత పరిష్కారం లభించక పోవడం వలన ఇక్కడ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయి. యూనివర్సిటీ ఉన్నతాధికారులు, పాలకులు గరివిడి పశువైద్య కళాశాలలో బోధకులు పై దృష్టి పెట్టి శాశ్వతంగా కొనసాగేందుకు తగిన ఆదేశాలు జారీచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఆ దిశ గా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విద్యార్థులు ఆశిస్తూ ఉన్నారు.

## మోడీని ఆశ్చర్యానికి గురిచేసిన డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి మహా నగర నిర్మాణ పనుల ప్రారంభానికి వచ్చిన ప్రధాని నరేంద్రదామోదరదాస్ మోడీని ఆచ్చెరువుకు గురి చేసారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్,ఈ సభలో ప్రారంభ ఉపన్యాసం చేసిన పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ తరువాత కీలక ప్రసంగాన్ని మానవ వనరుల శాఖా మంత్రి ప్రధాని ప్రస్తావన వచ్చినప్పుడల్లా " నమో" అంటూ మాట్లాడారు.ఆయన నరేంద్ర మోడీ పేరును పొట్టిపేరుగా చేసి మాట్లాడి తన ఉపన్యాసాన్ని రక్తి కట్టిస్తే,పెద్దగా వెలుగులోకి రాని ప్రధాని మరో పేరును పవన్ వెల్లడించారు.ప్రతి అంశాన్ని క్షుణంగా అధ్యయనం చేసే అలవాటున్న పవన్ మోడీ రాజకీయాల్లో క్రియాశీలక కాక ముందు ఆయన కొంత కాలం హిమాలయాల్లో సన్యాస (ఏకాంత)జీవనం గడిపిన విషయాన్ని ప్రస్తావించారు.అప్పట్లో ఆయనను మిత్రులు ' అనివాస్" అని ముచ్చటగా పిలిచే వారు, ఎందుకంటే ఆయనకు సొంత ఇళ్ళు ఉండేది కాదు.తరువాత ఆయన మళ్ళీ ఆర్ఎస్ఎస్‌లో కీలకం కావడం అటునుంచి రాజకీయాల్లో రావడం,ఎంఎల్‌ఏ కాకుండా నేరుగా గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యారు.అనంతర పరిణామాల్లో ప్రధాని అయ్యారు.అనివాస్‌గా మోడీకి ఇళ్ళు లేక పోతే కలిగే ఇబ్బంది తెలుసునని అందుకే దేశవ్యాప్తంగా లక్షల్లో ఇళ్ళు ఇస్తున్నారని పవన్ ప్రస్తావించారు.

# జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

## - లారీ ఢీకొని మోటార్ సైకిలిస్ట్ మృతి



మృతుని ఫైల్‌ఫొటో

**కోవూరు,(నెల్లూరు) మే 2 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారి సాయిబాబా గుడి సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నెల్లూరు నుంచి కావలి వైపు వెళ్తున్న ఓ లారీ అదే మార్గంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న కాకుమూడి వెంకటరమణయ్యను వేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో తీగ్రాయాలపాలైన రమణయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కోవూరు హెడ్ కానిస్టేబుల్ రషీద్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంకటరమణయ్య బోర్లు వేసే పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నెల్లూరుకు వెళ్లి తిరిగి మానేగుంటపాడుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కొడవలూరు మండలం మానేగుంటపాడు గ్రామం, దళితవాడకు చెందిన కాకుమూడి వెంకటరమణయ్య బోరు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ అక్కడికక్కడే లారీని వదిలేసి పరారీ అయ్యాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఉదయం టిఫిన్ చేసి ఇంటి నుంచి బయలుదేరిన భర్త కాసేపటికే మృతి చెందడం పట్ల ఆ కుటుంబంలో తీరని విషాదం చోటు చేసుకుంది. ఆస్పత్రి వద్ద వారు పెట్టే రోధనలు చుట్టుపక్కల వారిని కలిచివేశాయి.

# కరువు నేలలో కృషి చేసిన ఇద్దరు విశిష్ట వ్యక్తులు

## - ఒకరు విన్సెంట్ ఫెర్రర్.. మరొకరు పుట్టపర్తి సత్య సాయిబాబా

**అనంతపురం, మే 2 ప్రభాతవార్త బ్యూరో :** కరువు నేల ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద, మధ్యతరగతి వర్గాలకు అండగా నిలబడి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు ఇద్దరు. వారిద్దరిని దేవుళ్ళుగా ప్రజలు కొలుచుకుంటున్నారు. గుడిలో దేవుడి కంటే ఎప్పుడూ మన మధ్య ఉంటూ మనకోసం విదేశాల్లో విరాళాలు తీసుకొచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. వాళ్ళిద్దరూ ప్రస్తుతం మన మధ్య లేకపోయినా వారు బతికున్నప్పుడు చేసిన అభివృద్ధి, సేవ కార్యక్రమాలు సంస్థల రూపంలో ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఆ ఇద్దరు దేవుళ్ళు ఎవరో కాదు ఒకరు భగవాన్ సత్యసాయి బాబా అయితే మరొకరు ఆర్డిటి వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్. స్పెయిన్ దేశంలో పుట్టి ఏదో సేవ చేయాలని ఒక లక్ష్యంతో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఇండియాకు వచ్చి వెనుకబడిన అనంతపురం జిల్లాలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ, సేవ కార్యక్రమాలు చేసి చరిత్ర సృష్టించారు. మన భారతదేశ ప్రభుత్వం అందించే అత్యుత్తమ పురస్కారం భారతరత్న. ఇలాంటి పురస్కారాన్ని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు చెందిన ఆర్డిటికి అందించిందంటే ఆ సంస్థకు ఎంత పేరు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. ఆర్‌డిటి సంస్థను అనంతపురంతోపాటు తెలుగు రాష్ట్రాలకు విస్తరింపచేసిన ఆర్డిటి వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 2009 జూన్ 19వ తేదీన చనిపోయారు. ఆయన మరణానంతరం కూడా ఒక సంస్థలా ముందుకు వెళ్తోంది. మిన్సెంట్ ఫెర్రర్ సతీమణి అన్నే ఫెర్రర్, ఆయన కుమారుడు మాంచో ఫెర్రర్ ఇతర డైరెక్టర్లు, సిబ్బంది ఆర్‌డిటి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తున్నారు. అదేవిధంగా భగవాన్ సత్యసాయిబాబా అనంతపురం జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దారు. అన్ని కులాలు, అన్ని మతాలు ఒక్కటే అని చాటి చెప్పడంతోపాటు నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించేందుకు భగవాన్ సత్యసాయిబాబా చేసిన సేవలు ఎన్నో ఉన్నాయి. దేశ, విదేశాల్లోని ఎందరో భక్తులు, సంస్థలు ఇచ్చిన కోట్లాది రూపాయల విరాళాలతో శ్రీసత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్య, ఇతర సేవా కార్యక్రమాలను చేపట్టారు. సాగునీళ్ళు దేవుడెరుగు గుక్కెడు మంచినీటి కోసం కూడా ప్రజలు తహతహలాడుతున్న ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు వందల కోట్ల రూపాయలతో శ్రీసత్యసాయి మంచినీటి పథకాన్ని చేపట్టి అమలు చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. ఆయన ఉన్నా లేకపోయినా శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్య రంగాల్లోను, ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగే విధంగా భగవాన్ సత్య సాయి బాబా అన్ని వనరులు పకడ్బందీగా సమకూర్చారు. 2011 సంవత్సరం ఏప్రిల్ 24వ తేదీన సత్యసాయిబాబా మన నుంచి దూరమయ్యారు. సత్యసాయిబాబా సేవలు, ఆధ్యాత్మిక, నైతిక విలువలు పెంపొందించే బోధనలు, సేవలు చూసే విదేశాల నుంచి భక్తులు, వివిధ సంస్థల ప్రతినిధులు ఇక్కడికి వచ్చి చూసిన తర్వాతే అంతర్గతంగా విరాళాలు ఇచ్చేవారు అని చెబుతుంటారు. అయితే ఆ విరాళాల గురించి శ్రీ సత్యసాయి సెంటర్ ట్రస్ట్ ఎంత గోప్యత పాటించేవారు.. ఏడాదికి ఒక సారి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ బడ్జెట్ ప్రవేశపెట్టి అభివృద్ధి కార్యక్రమాలను ఖర్చులు, నిధులు వివరాలను బహిర్గతం చేస్తూ వస్తున్నారు. అదేవిధంగా విన్సెంట్ ఫెర్రర్, ఇతర ఆర్‌డిటి సంస్థ ప్రతినిధులు అనంతపురం జిల్లా కరువు పరిస్థితులను, పేదరికాన్ని, వెనుకబడి తనాన్ని, ఇతర పరిస్థితులను నివేదికల ద్వారా విదేశీ సంస్థలకు, దాతలకు పంపుతూ వచ్చారు. ఆ మేరకు స్పెయిన్ తదితర దేశాల నుంచి ఇక్కడ పరిస్థితులు చూసేందుకు తరచూ వచ్చేవారు. వాళ్లు ఇక్కడ పరిస్థితులను కల్లారా చూసి నివేదికరిస్తూ వచ్చారు. అలాంటి విదేశ ప్రతినిధులకు అర్థమయ్యే విధంగా పరిస్థితులను వివరించేందుకు స్పెయిన్ భాషను మనవాళ్లకు నేర్పించే కోర్సులు కూడా ప్రవేశపెట్టారన్నారు. ఆ విధంగా ఆర్డీటి సంస్థ ఎంతో కృషి చేసి విదేశీ నిధులు ప్రతియేటా వచ్చే విధంగా దారులు కల్పించింది. అయితే గత రెండేళ్ల నుంచి విదేశాల నుంచి ఆర్‌డిటికి నిధులు రావడం కష్టంగా మారింది. ఎఫ్‌సిఆర్ఏ కింద విదేశీ నిధులు విరాళాలు వచ్చే ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిలుపుదల చేసింది. ఈ విషయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు ఆర్డిటికీ అండగా నిలబడ్డారు. ఈ విషయంలో బిజెపికి చెందిన రాష్ట్ర మంత్రి సత్య కుమార్ చొరవ తీసుకొని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను కలిసి పరిస్థితి గురించి ఆర్డిటిని ప్రత్యేక దృష్టితో చూసి ఆదుకోవాలని విన్నవించారు.

# శేషాచలం అడవిలో చెలరేగిన మంటలు !

## - ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో కదిలిన రెండుజిల్లాల అధికారులు

### - మధ్యాహ్నానికి అదుపుచేసిన అటవీశాఖ

**తిరుమల,మే 2 ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం కొండలు విస్తరించిన చిత్తూరు,కడపజిల్లాల పరిధిలోని అన్నమయ్య జిల్లా బాలపల్లిఅటవీ రేంజ్‌పరిధిలోని ఓ గ్రామంలోచెలరేగిన మంటలు తిరుమల తుంబురుతీర్థం, పాపవినాశనమ్ అడవికి వ్యాపించాయి. గురువారం సాయంత్రం ఈ మంటలు తుంబురుతీర్థం వద్ద పెద్ద ఎత్తున చెలరేగడంతో దట్టమైన పొగఅలముకుంది. అదే సమయంలో చిరుజల్లులు కురవడంతో మంటలు ఆరిపోయాయి. అయితే రాత్రి మళ్ళీ పాపవినాశనమ్ ప్రాంతంలో మంటలు రేగడంతో అటవీశాఖ ,టిటిడివిజిలెన్స్ సిబ్బంది,అగ్నిమాపకసిబ్బంది చీకట్లోనే అడవిలోకి చేరుకున్నారు. మంటలను అదుపుచేయడంలో గంటలతరబడి శ్రమించారు. అయితే మంటలు అదుపులోకి రాలేదు. అర్ధరాత్రి ఈ మంటలు కుమారధార,వసువుధారప్రాజెక్టులున్న అటవీప్రాంతం వైపు మళ్ళాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖమంత్రి, ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ స్వయంగా టిటిడి డిఎఫ్ఓ వివేక్‌కు ఫోన్‌చేసి మంటలను పూర్తిగా అదుపుచేయాలని, వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. దీంతో తిరుపతి జిల్లాలోని అటవీశాఖ సిబ్బంది. అన్నమయ్యజిల్లా,చిత్తూరుజిల్లాలోని అటవీశాఖ, అగ్నిమాపక సిబ్బంది రెండువందలమంది వరకు తిరుమల శేషాచలంలోని తుంబురు తీర్థం, పాపవినాశనమ్ అడవిలోకి చేరుకున్నారు. పూర్తిగా పచ్చనిచెట్ల కొమ్మలు,ఈతమండలతో మంటలను అదుపుచేశారు. అప్పటికీ అడవంతా దట్టమైన పొగ అలము కుంది. శుక్రవారం మధ్యాహ్నానికి అడవిలో మంటలను అదుపుచేశారు. కొండల్లో లోయలతో కూడిన దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో అగ్నిమాపక వాహనాలు కూడా చేరుకోలేని పరిస్థితి. టిటిడి అటవీశాఖ అధికారి వివేక్, అన్నమయ్యజిల్లా సబ్ డిఎఫ్ఓ సుబ్బరాజు ఆధ్వర్యంలో స్వయంగా రేంజ్ అధికారులు, సిబ్బంది,అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేశారు. ఎండ తీవ్రంగా ఉండటం, ఎండిన ఆకులు, కొమ్మల కారణంగా మంటలు ఎగసిపడ్డాయి. ఇదిలా ఉండగా 2014 మార్చిలోనూ ఇదే తరహాలో తిరుమల అడవిలో కాకులకొండ, మామండూరు ప్రాంతాల్లో కార్చిచ్చు రగిలి వేలాది ఎకరాలు అటవీప్రాంతం దగ్ధమవడం, ఏకంగా పదిరోజులు ఈ మంటలను అదుపుచేయలేక చివరకు హెలికాప్టర్లద్వారా నీటిని స్ప్రేచేసి మంటలు అదుపులోకి తీసుకువచ్చిన విషయం విదితమే.



టిటిడి అటవీపరిధిలో ఫైర్‌వాల్స్ పునరుద్దరణ జరగాలని, ప్రమాదవశాత్తు మంటలు వ్యాపిస్తే వేగంగా వ్యాప్తికాకుండా మరిన్ని చర్యలు తీసుకోవాలని అటవీశాఖ వన్యప్రేమికులు కోరుతున్నారు.

# మూడు కొత్త కార్యక్రమాలు చేపట్టిన ఎన్నికల సంఘం

## - రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** ఓటర్ల జాబితాల ఖచ్చితత్వాన్ని మరింతగా మెరుగుపరచడం, ఓటువేసే ప్రక్రియను పౌరులకు మరింత సులభతరం చేసే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం మూడు కొత్త కార్యక్రమాలకు నాంది పలికినట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు. ఎన్నికల కమిషనర్‌లు డా.సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిల సమక్షంలో రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో ఈ ఏడాది మార్చి నెలలో నిర్వహించిన సమావేశంలో భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈ కొత్త కార్యక్రమాలను గురించి ప్రకటించినట్లు తెలిపారు. దీనిప్రకారం జనన మరణాల రిజిస్ట్రార్ జనరల్ నుంచి నమోదైన మరణాలకు సంబంధించిన మరణ ధృవీకరణ ఎలక్ట్రానిక్ పద్ధతిలో డేటాను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ఎప్పటికప్పుడు తీసుకొనే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఫారం7లో దరఖాస్తు అందనప్పటికీ బూత్ స్థాయి అధికారులు(బి.ఎల్.ఓ)లు ఈ జాబితా ఆధారంగా క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీచేసి ఓటర్ల సమాచారాన్ని ధృవీకరిం చడానికి అవకాశం కలుగుతుం దన్నారు. ఓటరు సమాచార స్లిప్(వి.ఐ.ఎస్) లను ఓటర్ల స్నేహపూర్వకంగా రూపొందిం చడంలో భాగంగా దీని డిజైన్‌ను మార్చాలని భారత ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీనిప్రకారం క్రమ సంఖ్య, ఓటరు పార్ట్ నెంబరు పెద్దగా, ప్రముఖంగా కనిపించేలా దీనిని డిజైన్ చేశారు. తద్వారా ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాన్ని సులభంగా గుర్తించేందుకు వీలు కావడంతోపాటు ఓటర్ల జాబితాలో ఓటర్ల పేర్లను త్వరగా గుర్తించేందుకు అవకాశం కలుగుతుంది. ఓటర్ల ధృవీకరణ, ఓటర్ల నమోదు, ఇతర ఎన్నికల సంబంధిత ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టే సమయంలో బి.ఎల్.ఓ.లను ఓటర్లు సులభంగా గుర్తిం చేందుకు వీలుగా ఇ.ఆర్.ఓ.ల ద్వారా నియమితులైన బూత్ స్థాయి అధికారులకు ఇకపై ప్రామాణిక ఫోటో గుర్తింపు కార్డులను అందజేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. తద్వారా ఓటర్ల నమోదు, జాబితాల తనిఖీ వంటి కార్యక్రమాల సందర్భంగా బి.ఎల్.ఓ.లను గుర్తించి, వారితో ఓటర్లు నమ్మకంగా వారి సమచారాన్ని పంచుకొనేందుకు అవకాశం కలుగుతుంది. ఎన్నికల సంబంధ విధులకు సంబంధించి భారత ఎన్నికల సంఘం, ఓటర్ల మధ్య బి.ఎల్.ఓ.లు మొదటి స్థాయి అనుసంధాన వ్యవస్థగా వున్న నేపథ్యంలో ఇంటింటి సందర్శనలకు వెళ్లేటపుడు ప్రజలు వారిని సులువుగా గుర్తించేలా వుండాలన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి కేంద్రం భారీ నిధులు

## - కేంద్ర భారీ పరిశ్రమలు స్టీల్ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ..

**విజయవాడ మే 2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర రాజధాని అమరావతితో పాటు రాష్ట్రాభివృద్ధికి, మౌలికి వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు, ప్రాజక్టులను కేటాయిస్తున్న దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీకి కేంద్ర భారీ పరిశ్రమలు స్టీల్ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ధన్యవాదమలు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్వహించిన అభివృద్ధి పనుల పున: ప్రారంభ సభలో ఆయన మాట్లాడుతూ అమరావతిలో రూ.58 వేల కోట్లు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు వచ్చిన దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మెదీకి ధన్యవాదములు తెలిపారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోంన్నారు. రాష్ట్రంలో రైల్వే రంగంలో రూ.74 వేల కోట్లు పెట్టు బడులు పెట్టడం జరిగిందన్నారు. అమరావతి ని దేశంలోని ప్రధాన నగరాలకు అనుసంధానం చేసేందుకు దాదాపు రూ.2,245 కోట్లతో నూతన రైల్వే లైను నిర్మాణం మరియు విశాఖ రైల్వేజోన్ నిర్మాణం కేంద్ర సహాకారంతోనే సాధ్యమైందన్నారు. పోలవరం ప్రాజక్టుకు రూ.12,500 కోట్లు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కు రూ.11,500 కోట్ల మేర ఆర్థిక సహాయాన్ని అందించడమే కాకుండా పూడి మడకలో రూ.1 లక్షా 85 వేల కోట్లుతో గ్రీన్ హైడ్రోజన్ కేంద్రం, నక్కపల్లిలో బల్కు డ్రగ్ కేంద్రం ఏర్పాటతో పాటు కృష్ణపట్నాన్ని రూ.4,500 కోట్లతో పారిశ్రామికి కేంద్రంగా తీర్చిదిద్దే పనులు కేంద్ర సహకారం వల్లే సాధ్యమైందన్నారు. రూ.2,800 కోట్లతో ఓర్వకల్లును, రూ.2,200 కోట్లతో కొప్పర్తిని పారిశ్రామిక కేంద్రాలిగా తీర్చిదిద్దేందుకు నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. లక్షలాధి మంది యువతకు ఉద్యోగ అవకాశలు కల్పించే విధంగా రామాయపట్నంలో రూ.95 వేల కోట్లతో తీశిదిలి రిఫైనరీని ఏర్పాటు చేయడం జరుగుచున్నది. జాతీయ రహదారులకు వేల కోట్ల నిధులు ఖర్చు పెట్టడం జరుగుచున్నదని, నర్సాపురం నియోజకవర్గంలో గత 20 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న బీమవరం బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.2,400 కోట్లు నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. సిఆర్ఎఫ్ పథకం క్రిందం 200 కి.మి. రాష్ట్ర రహదారులు అభివృద్ధి పెద్ద ఎత్తున నిధులను కేంటాయించడం జరిగంన్నారు. ।।గి, ।।లీ, వి।గి, తి।లీళీ, పెట్రోలియం, సెంట్రల్, సెంట్రల్ ట్రైబల్ వర్సిటీలతో పాటు పలు వైద్య కళాశాలలను రాష్ట్రానికి కేటాయించినందుకు ప్రధాన మంత్రికి, రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదములు తెలిపారు.

**GOVERNMENT OF INDIA : MINISTRY OF DEFENCE**
**EX-SERVICEMEN CONTRIBUTORY HEALTH SCHEME,**
**STATION HQ (ECHS CELL), SECUNDERABAD**
**Ph.: 7382361574 | E-mail : echsstnhqsecbad@gmail.com**

**EMPLOYMENT NOTICE**

1. ECHS CELL, Headquarters Telangana and Andhra Sub Area invites applications to engage Medical, Para-Medical & Non-Medical Staff on contractual basis for a period of 12 Months for ESMs and Widows of Service Personnel and 11 Months for Civilian candidates at given locations of ECHS Polyclinics in Telangana and Andhra Pradesh.

| Appointment | Minimum Qualification | Salary (Rs) | Vacancies | Location of Vacancies (ECHS Polyclinics) |
|---|---|---|---|---|
| OIC Polyclinic | Graduate (Retired Defence Officers Drawing Pension from CDA) | 75,000/- | 02 | Eluru & Secunderabad-II |
| Medical Specialist | MD/MS in General Medicine | 1,00,000/- | 04 | Chittoor, Gidaluru, Gunturu & Secunderabad-I |
| Medical Officer | MBBS | 75,000/- | 07 | Chittoor, Eluru, Gunturu, Karimnagar, Secunderabad-I, Secunderabad-II & Vijayawada |
| Dental Officer | BDS | 75,000/- | 03 | Giddalur, Kadapa & Secunderabad-II |
| Dental Hygienist | Diploma in Dental Hyg/Class-I DH/DORA Course (Armed Forces) | 28,100/- | 12 | Anantapur, Eluru, Giddaluru, Golconda, Guntur, Kadapa, Khammam, Kurnool, Nellore, Secunderabad-I, Secunderabad-II & Sainikpuri |
| Pharmacist | B Pharmacy OR 10+2 with Science and Diploma in Pharmacy | 28,100/- | 03 | Eluru, Giddalur & Kurnool |
| Lab Technician | B Sc (Medical Lab Tech (MLT) OR 10+2 with Science and Diploma in Medical Lab Tech (DMLT) | 28,100/- | 07 | Chittoor, Eluru, Giddalur, Kadapa, Kurnool, Khammam & Nellore |
| Lab Assistant | DMLT/Class-I Lab Tech Course (Armed Forces) | 28,100/- | 03 | Giddalur, Secunderabad-I & Sainikpuri |
| Nursing Assistant | BSc Nursing, GNM/ Diploma/Class-I Nursing Assistant Course Cert from (Armed Forces) | 28,100/- | 01 | Nellore |
| Female Attendant | Literate | 16,800/- | 02 | Golconda & Secunderabad-II |
| Chowkidar | 8th Class or GD Trade for Armed Forces personnel | 16,800/- | 06 | Chittoor, Secunderabad-I, Secunderabad-II Vijayawada & Mahabubnagar |
| Driver | 8th Class/Class-I MT Driver (Armed Forces) | 19,700/- | 02 | Golconda & Sainikpuri |
| Safaiwala | Literate | 16,800/- | 04 | Guntur, Kurnool, Nellore & Vijayawada |
| Peon | 8th Class or GD Trade (Armed Forces) | 16,800/- | 01 | Vijayawada |

**PLEASE READ ALL INSTRUCTIONS CAREFULLY**

**(2) For Terms & Conditions, Application Form & Remuneration**: For qualifications, work experience and age limits, kindly see website www.echs.gov.in. Application Form can be downloaded from the website under **EMPLOYMENT OPPORTUNITIES.** For additional details, contact on Tele No 07382361574 & email ID : echsstnhqsecbad@gmail.com during working hours. Preference will be given to the Ex-Servicemen. **(3) Last Date of Receipt of Application as per Format Given at our Website.** Application as per format alongwith self attested photocopies of testimonials for educational qualification (with Mark Sheets), work experience, Registration Certificates, Discharge book & PPO) will be submitted to Officer-in-Charge, Station HQ ECHS Cell, HQ TASA, Near Rastrapati Nilayam, Secunderabad 500010, Telangana by **16 May 2025 (1800hours).** Any application received after **16 May 2025** will not be accepted. **Online applications will not be accepted.** **(4)** Interview Date, Timing & Venue : Date & Time of interview will be intimated to all Accepted applicant through email. (5) Candidates meeting the Qualitative Requirements will only be called for interview. Candidates must bring all the original educational certificates, along with work experience and discharge book, PPO, Service Records and two PP size colour photographs at the time of interview. No TA/DA is admissible.

**NOTE : CANDIDATES NOT SUBMITTING COMPLETE / INCORRECT DOCUMENT WILL NOT BE CALLED FOR INTERVIEW.**

వార్త

ధనం లేకపోయినప్పటికీ ఏవో కోర్కెలు కలవాడు, సమర్థత లేనప్పటికీ కోపించేవాడు వీరిరువురూ తమను తామే నాశనం చేసుకుంటారు.

-జి.ఇలియట్


# పునరంకితం

ఆరు కోట్ల ఆంధ్రుల కలలు సహకారమైన వేళ అమరావతికి మంచి రోజులు వచ్చాయి. ఆ ప్రాంత రైతులు ఇప్పుడు సంబరాలు చేసుకుంటున్నారు. ముక్కారు పంటలు పండే సుభిక్షమైన నేల ఎన్నో వాణిజ్య పంటలు పండుతూ పదేళ్ల క్రితం వరకు రైతుకు మంచి ఆదాయం తెచ్చిపెట్టింది. నవ్యాంధ్రను స్వర్ణాంధ్ర సంకల్పంతో 9ఏళ్లనాడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాని మోడీ చేత శంకుస్థాపన చేయించారు. ఆ రోజు ప్రధాని దేశంలోని అన్ని నదుల నుండి పవిత్ర జలాలు, సుక్షేత్రాల మట్టినీ తీసుకొచ్చి సంకల్ప బలాన్ని అందించారు. ఎన్నో శుభసంకల్ప ప్రమాణాలతో నేల నింగీతుళ్ళిపడేలా కార్యక్రమాన్ని నిర్వహించినా, ఆ తర్వాత వచ్చిన పాలకులు మూడు రాజధానుల ప్రతిపాదన చేసి అమరావతి రైతురంగాన్నిఆందోళనలో ముంచారు. ఇటురైతుకు పంటలు పండించుకునే అవకాశమూ లేదు అలాఅని అంతకుముందు సంకల్పాలను నెరవేర్చనూ లేదు. ఏమైతేనే అమరావతిని అత్యంత వైభవ నగరంగా తీర్చిదిద్దాలన్న తపనతో ఆనాడు ప్రధాని మోడీ వేసిన శంకురాయిని పట్టించుకునేవారు లేకపోయారు. అమరావతి ప్రాంత యావత్ ప్రజానీకం ముక్తకంఠంతో అమరావతి నిర్మాణం కోసం సుక్షేత్రాలనిచ్చినా తమ త్యాగఫలాన్ని ఊరికేపోరాదని 1631 రోజులు సుదీర్ఘకాలం నిరాహార దీక్షలు చేపట్టారు. ఆంధ్ర దేశప్రజలు అదృష్టం ఏమోకానీ మళ్ళీ అమరావతి కలలు నిజమయ్యే రోజు రానే వచ్చింది. శుక్రవారం సాయంత్రం ప్రధాని మోడీ అమరావతి సంకల్పానికి పునఃప్రతిష్టంగావించారు. అమరావతి నిర్మాణంలో అత్యంత కీలకమైనవిగా భావిస్తున్న కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేశారు. చారిత్రక పరంపర, ప్రగతి కలిసి ప్రయాణిస్తోందని, అమరావతి స్వప్నం సాకారమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సందర్భంగా మాట్లాడుతూ అన్నారు. ఇకపై కొత్త అమరావతిని, కొత్త ఆంధ్రప్రదేశ్‌ను చూడబోతున్నామన్న ఆశాభావాన్ని వ్యక్తం వేశారు. అమరావతి ఒక సమ్మిళిత శక్తిగాఉండడం స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి శుభ సంకేతంగా పేర్కొన్నారు. అమరావతికి ఇక ఎటువంటి ఆటంకం ఉండబోదని కేంద్రం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని, వికసిత్ భారత్‌కు అమరావతే గ్రోత్ ఇంజిన్‌గా పనిచేస్తుందని ప్రధాని భరోసా ఇచ్చారు. ఇరుగు పొరుగు దాయాది దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న తరుణంలో కూడా అమరావతి సంకల్పాన్ని ప్రధాని పక్కన పెట్టలేదు. దేశ పురోగతి అనగానే అన్ని రంగాల అభివృద్ధిగా నమ్మే ప్రధాని మోడీ ఈ ఉదయం కేరళ రాష్ట్రంలోని విలింజమ్ ఎయిర్పోర్ట్‌ను ప్రారంభించారు. దాదాపు రూ.1.07 లక్షల కోట్ల పనులకు శుక్రవారం ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వాటిలో ఒక్క అమరావతిలోనే ప్రధాన రూ.49,040 కోట్ల విలువైన పనులకు ప్రారంభం శంకుస్థాపనలు చేశారు. డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో నాగాయలంక మండలం గుల్లలమోదలో క్షిపణి టెస్టింగ్ రేంజ్‌ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు. సభావేదికపై నుంచి ఒకేసారి వర్చువల్ విధానంలో బటన్‌నొక్కి ప్రారంభించారు. జాతీయ రహదారులు రైల్వే విస్తరణ పనులు రూ.57వేల 962కోట్లతో చేపట్టారు. వీటిలో శాసనసభ, హైకోర్టు, సచివాలయం న్యాయమూర్తుల,పరిపాలన భవనాలు నిర్మిస్తారు. అంతేకాక 5200కుటుంబాలకు నివాస భవనాలు కూడా నిర్మించే ప్రతిపాదన ఉంది. వాటి నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాలు అన్నీ ఒకేసారి ఒకే వేగంతో పూర్తవుతాయని జనం విశ్వసిస్తున్నారు. తొలిసారి గతంలో 2015 అక్టోబర్ రెండో తేదీన ఉద్దండరాయునిపాలెంలో అమరావతి రాజధాని పనుల నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈసారి వెలగపూడిలో ఈ కార్యక్రమం చేపట్టటం విశేషం. ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి నిర్మించాలని సంకల్పం నెరవేరితే ఆంధ్రప్రదేశ్అగ్రభాగాన ఉన్నట్లే. ఇప్పటికే రూ.30వేల కోట్ల పెట్టుబడులను అమరావతి నిర్మాణ కోసం ఆకర్షించారు. అమరావతి పుర్నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ ద్వారా రూ.15 వేలకోట్లు ద్వారా అందింది. అప్పట్లో అమరావతి కోసం 58రోజుల్లోనే34,281 ఎకరాల భూసమీకరించారు. ఇవన్నీ ఇలా ఉండగా అమరావతికి అధీకృత గుర్తింపే లేదన్న విపక్ష ఆరోపణలను కొట్టిపారేస్తూ తాజాగా మరో ఆలోచన ఎవరికీ రానీయకుండా ఈసారి పాలకులు పకడ్బందీగా అమరావతిని శాశ్వతం చేస్తోంది. ఇక ఆంధ్రా జనానికి అమరావతిని దూరం చేసే ఏ ప్రయత్నానికి అవకాశం ఉండదు. సాక్షాత్తూ ప్రధాని నీళ్ల నిధులు ఇచ్చి పునఃప్రతిష్ట చేస్తున్న ఈ కార్యక్రమంలో అమరావతికి భూములిచ్చిన ఆయా గ్రామ సీమల రైతాంగం ఆకుపచ్చ కండువాలతో తండోపతండాలుగా వచ్చి సంఘీభావం ప్రకటించారు. శాతవాహనులు, ఇక్ష్వాకులు వంటి చారిత్రిక రాజవంశాలు పాలించిన ఈ ప్రాంత చరిత్రలో నేటి పాలకుల చిత్తశుద్ధి కూడా చిరస్థాయిగా నిలిచిపోయింది. గుంటూరు కృష్ణా జిల్లాలోని 29 గ్రామాల రైతులు తన సారవంతమైన భూములను రాజధాని నగర నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారు. అది నిజంగా వాళ్ల చేసిన త్యాగమే. 18 ప్రధాన ప్రాజెక్టులకు రెండు రైల్వేలైన్లను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపి విధ్వంసం నుంచి విజయాల బాట పడుతోందని ఆనందం వ్యక్తం చేసారు. మూడేళ్ల తర్వాత అమరావతి పూర్తి కాగానే ప్రధాని నరేంద్ర మోడీ మళ్లీ వచ్చి ప్రారంభిస్తారని చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రపంచంలోని తొలి ప్రసిద్ధ రాజధానులలో అమరావతిని ఒకటిగా తీర్చిదిద్దాలన్న పాలకుల ఆకాంక్షలు తీరితే ఆంధ్రులను అదృష్టం వరించినట్లే!

> చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందుచూపు ఎంతో అవసరం.
>
> ఐ.జాన్సన్



> జీవితంలో విజయం సాధించాలంటే మెట్లవైపు చూస్తూ ఉండక, వాటివైపు పయనం సాగించాలి.
>
> మార్షల్



# ప్రజావాక్కు



### కుల గణనకు అధినాయక జయహే

కేంద్ర అధినాయకత్వం దేశవ్యాప్త కులగణనకు ఆమోదం తెలిపింది. చాలాఏళ్లుగా బీజేపీ మినహా మిగతా పక్షాలన్నీ కులగణన చేపట్టాలని కోరుతూ వస్తున్నాయి. అయితే అధికార పక్షం అందుకు వ్యతిరేకంకావడంతో అది కార్యరూపందాల్చలేదు. తమ రాష్ట్రవిభాగాలు అందుకు సరేఅన్నా, రాష్ట్రీయ స్వయం సేవక్ కూడా సానుకూలంగా మాట్లాడినా, కేంద్రంలో బీజేపీ అధినాయకత్వం మాత్రం ఇన్నాళ్లూ ససేమిరా అంది. ఇప్పుడు అనూహ్యంగా కులగణన చేపట్టాలనికేబినెట్ నిర్ణయంతీసుకోవడంవిశేషం. రాబోయే జనగణన (సెన్సస్,జనాభా లెక్కలు) స్వాతంత్ర్యం అనంతరం జరగబోయే తొలి కులగణనగా ఉండబోతోంది. ఈ నిర్ణయం ద్వారా బీజేపీ, ప్రతీ ఎన్నికల్లో కులగణనకు హామీ ఇస్తున్న ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ చేతి నుండి బలమైన ఎన్నికల ఆయుధాన్ని తీసుకున్నట్టే.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### పెరుగుతున్న కులాల పిచ్చి

నాడు కులాలు తమతమ వృత్తులను బట్టి ఏర్పడ్డాయి. నేడు పరిస్థితులు మారడంతోపాటు ప్రజల మనస్తత్వాలు కూడా మారిపోయాయి. కులాలను స్వీకరించే సాంప్రదాయం మరుగునపడిపోయింది. దాంతో ఆనాటి ఆచార వ్యవహారాలను, సాంప్రదాయాలను విశిష్టతలను విస్మరించి ఆధునిక వాదానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారు. నేడు వృత్తుల దృష్ట్యా కులాల ప్రాధాన్యత తగ్గిపోయినా, ఇంకాకులాలను వినియోగించుకోవడం ఆత్మవంచనే అవుతుంది. అలాంటప్పుడు కొందరు ఇంకా ఈ కులాలను పట్టుకొని వేళ్లాడుతున్నారు. రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడం కోసం ఈ కులాలను వజ్రాయుధాలుగా వాడుకుంటున్నారు. కులాలపిచ్చిన రూపుమాపాలంటే, రాజకీయ పార్టీలు కులమతాలను తెరపైకి తీసుకురాకుండా ఉండాలి.

-కాయల నాగేంద్ర, హైదరాబాద్

### చక్కదిద్దాలి

జాతీయ స్థాయిలో సగటున 12 శాతం చిన్నారులు బడి చదువులకు మధ్యలోనే దూరమవుతున్నారు. కారణాలేమిటో పాలకులు గ్రహించి, పరిస్థితులు చక్కదిద్దాలి. చదువులకు దూరమవుతున్న చిన్నారులు పాఠశాలకు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

-మా. శ్రీ.రాజు, పాల్వంచ

### అవినీతిని నిరోధించలేమా?

నీతి ఎక్కడున్నదో ఎంత వెదికినా కానరాదు. కాని అవినీతి ఎందెందు వెతికి చూసినా అందందే కలదు. ఈ రోజుల్లో అవినీతి మాత్రమే రాజ్యమేలుతోంది. ప్రభుత్వాధికారులు అటు ప్రభుత్వాన్ని ఇటు ప్రజలను మోసంచేస్తున్నారు. ఇటువంటి అవినీతి తిమింగలాలుఎన్నోవలలో చిక్కుకున్నకొద్దీ మళ్ళీమళ్ళీ దొరకుతున్నాయి. కాళేశ్వరం ఇంజినీర్ఇన్ చీఫ్‌హరిరామ్ అనినీతి బరువు 200 కోట్లని తేలింది. రెండు తెలుగురాష్ట్రాల లోనూ ఈయన ఆస్తులు కూడబెట్టారట. కాళేశ్వరం పాజెక్టు వ్యయంలో దాదాపు ఏభైవేల కోట్లవిలువైన పనులు ఈయన పర్యవేక్షణలోనే జరిగాయని ప్రభుత్వం గుర్తించింది. ఈమెగా ప్రాజెక్టు బీటలు వారిందంటే నాణ్యమైన పని జరగనట్టే కదా. ఇందులో కాంట్రాక్టర్లకు కూడా భాగస్వామ్యం లేనిదే ఇంత అవినీతికి తావుండదు కదా. పూర్వ ప్రధాని రాజీవ్‌గాంధీ ఓ మాటన్నారు. ప్రజల కోసం వినియోగించమని ఇచ్చే రూపాయిలో వారికి చేరేది పది పైసలు మాత్రమేనని అన్నారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### డాక్టరేట్ ఉద్యోగులు

గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయివరకు, అటెండర్ నుండి ఐఏఎస్ అధికారి వరకు, డాక్టరేట్ పట్టా పొందిన వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆయాశాఖల పరిధిలోశాఖ అభివృద్ధికి సలహా సూచనలు స్వీకరించాలి. జిల్లావ్యాప్తంగా ఉన్న డాక్టరేట్ పట్టా పొందిన వారిని గుర్తించి ఒక టీమ్‌గా ఏర్పాటు చేసి ఆయా శాఖ పరిధిలో ఉన్నసమస్యలుఅధికారులకు తెలియజేసి పరిష్కరించే విధంగానిత్యం నివేదికలు తయారుచేయాలి. జిల్లా స్థాయి పర్యవేక్షణ చేయడానికిగాను వాహన సదుపాయాలు కల్పించాలి. ఆయాశాఖ పరిధిలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై అమలు విధానంపై అవగాహన చైతన్య కార్యక్రమాలను వీరి ద్వారా ప్రజలకు తెలియజేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

### ఉపాధి దొరకని గ్రామాలు

ఈ మధ్య కాలంలో పురపాలికల్లో ఎక్కువ గ్రామాలు విలీనం కావడంవల్ల ఉపాధిహామీ ఆపురపాలికల చుట్టూ పక్కల గ్రామాలలో ఉండడం లేదు. అయితే పట్టణాలలో కూడా పెద్ద నీటి కుంటల ఏర్పాటు చేయాలి. అలాగే ప్రభుత్వం సెర్ప్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ సెంటర్స్ ఫామ్ చేసి యువతకు అందులో శిక్షణ ఇస్తూనే రోజు వారి కూలి చెల్లించాలి.

-భారత అవినాష్, జనగామ

మన విని | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వికలాంగమో వీరస్వర్గమో!

**దేశవ్యాప్తంగా వేలాదిమంది అసువులు బాస్తుండగా, కోట్లాదిమంది అంగవైకల్యంతో జీవనాధారంకోల్పోయి జీవచ్ఛ వాలుగా బతుకీడుస్తున్నారు. చేతికి అందివస్తున్న పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల గర్భశోకం, తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారినపిల్లల పరిస్థితి వర్ణనాతీతం. ఇప్పటికైనా ఆదాయమే లక్ష్యంగా కాకుండామానవతా దృక్పథంతో నడుం కట్టాలి. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపాలి. ప్రమాదాలకు కారకులైన డ్రైవర్ల లైసెన్సులను పాశ్చాత్య దేశాల్లోగా రద్దుచేయాలి. వారు జీవితంలో మళ్లీ స్టీరింగ్ పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అవసరమైతే చట్టాన్నిసవరించాలి. త్రికరణశుద్ధిగా ఆ కోణంలో ప్రయత్నాలు జరగక్కపోతే వాహనాలు మృత్యు దేవతల్లా రోడ్లపై వీరవిహారం చేయకమానవు. వేలాది మంది జీవితాలు అర్థాంతరంగా ముగియక తప్పదు.**

దామెర్ల సాయిబాబ

మానవుడి సుఖానికి, సంతోషానికి, అభివృద్ధి దోహదం కావాలి. సుఖం కోసం అభివృద్ధి మార్గాలను అన్వేషిస్తాం. రోడ్ల అభివృద్ధికి సోపానాలు అనేది అందరికి తెలిసిందే. మరి ఆ సోపానాలు మృత్యువుమార్గాలైతే ఎవరికి చెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి? దేశవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. మరొకపక్క అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వాహనాలు తయారు చేస్తున్నారు. భద్రతకు మరెంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. అయినా దేశవ్యాప్తంగా ప్రమాదాలు ఏమాత్రం తగ్గడంలేదు. రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనిషి క్షేమంగా ఇంటికి వచ్చే గ్యారంటీ లేని పరిస్థితులు దాపురించాయి. అభద్రతాభావం రోజురోజుకు పెరిగిపోతున్నది. ఏ నిమిషానికి ఏమి జరుగునో అన్నట్లు ఎప్పుడు, ఏప్రమాదం ముంచుకొచ్చి ప్రాణాలు పోతాయో, వికలాంగులమవుతామోననే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు మరింత పటిష్టం చేస్తున్నా, జరిమానాలు భారీగా పెంచుతున్నా, ప్రమాదాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. ప్రమాదాల్లో మరణించిన వారికి సంబంధించిన సన్నిహితులు, బంధువులు, గుండెలు బాదుకొని ఏడ్చేవారిని చూసి కన్నీరు సైతం ఘనీభవించే స్థితికి చేరుకున్నదేమోననిపిస్తున్నది. మొన్న బుధవారం నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కారు రోడ్డుపక్కనున్న పూరింట్లోకి దూసుకుపోవడంతో ఐదుగురు మెరికల్లాంటి వైద్యవిద్యార్థులతో పాటు ఆ ఇంట్లో నిద్రిస్తున్న ఒక వృద్ధుడు కూడా మృత్యువాతపడ్డాడు. నెల్లూరుజిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం ఈ విషాద సంఘటన చోటు చేసుకున్నది. ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో రెండో సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న ఈ విద్యార్థి బృందం ఒక నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా కారు అదుపుతప్పి పక్కనున్న పూరింట్లోకి దూసుకువెళ్లింది. ఇంట్లో మంచంపై పడుకొని ఉన్న అరవైఐదేళ్ల వృద్ధుడిపైకి కారు దూసుకుపోవడంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. కారులో ఉన్న ఐదుగురు మెడికోలను గ్రామస్తుల సహాయంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఐదుగురు మరణించారు. మొన్న తెలంగాణలో ఒకే రోజు జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో పదకొండు మందికిపైగా మరణించారు. ఇందులో ఇద్దరు నర్సింగ్ విద్యార్థులున్నారు. అంతకు ముందు జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు అసువులుబాశారు. అన్నెంపున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు ఈ రోడ్డు ప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది విక లాంగులుగా మారి కుటుంబానికి భారమై జీవితాంతంనరకం అనుభవిస్తున్నారు. ఒకరుకాదు, ఇద్దరు కాదు, ఒక రోజుకాదు, రెండు రోజులు కాదు నిత్యం ప్రమాదాల పరంపర కొనసాగుతూనే ఉన్నది. ఇలా ప్రమాదాలకు గురై అసువుల బాస్తున్న వారిలో అధికశాతం ముప్పై, ముప్పైఐదేండ్ల లోపు యువకులే. దేశవ్యాప్తంగా 2001 నుండి 2020 వరకు తొంభైఆరు లక్షల, అరవైరెండు వేల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే ఇరవైమూడు లక్షల ఇరవైఐదువేల మందికిపైగా మృత్యువాతపడ్డట్టు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. క్షతగాత్రులైన వారి సంఖ్యకోట్లలో ఉంది. రోడ్లపై ఏర్పడిన గుంతలు కారణంగా గతనాలుగేళ్లలో దాదాపు ఇరవైతొమ్మిదివేలకుపైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అంతేకాదు ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందక మృత్యువుతో పోరాడి రోడ్లపైనే ప్రాణాలు వదులుతున్నవారు వేల సంఖ్యలో ఉన్నారు. అమెరికాలో రోడ్డు ప్రమాదాలకు గురైన ప్రతి రెండు వందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్‌లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. అభివృద్ధికి సోపానాలైన రోడ్లే మృత్యువు మార్గాలై మానవాళిని కబళిస్తుంటే ఈ ప్రమాదాలను నివారించలేమా? ఇందుకు ఎవరు బాధ్యులు? లోపం ఎక్కడు న్నదనే ప్రశ్నలకు జవాబు అందరికి తెలిసినా ఆ కోణంలో చర్యలు తీసుకోలేకపోతున్నారు. సమావేశాలకు, సమీక్షలకు కొదవలేకపోయినా ఆచరణకు వచ్చేసరికి ప్రశ్నార్థకంగా మారిపోతున్నది. రోడ్డు భద్రతా వారోత్సవాలు ఘనంగానే నిర్వహించుకుంటుంటారు. ఒకపక్క ఈ కార్యక్రమాలు జరుగుతుంటేనే మరొక పక్క ప్రమాదాలు యధేచ్ఛగా జరుగుతుంటాయి. చట్టంలో కూడా మార్పులు తీసుకువస్తున్నారు. నిబం ధనలను అత్రికమించినవారిపై భారీ జరిమానాలు విధిస్తు న్నారు. అంతేకాదు ప్రమాదాలకు గల కారణాలు, కారకులు ఎవరు అనే విషయంలో అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని కూడా నియమించారు. ఎంతో మంది నిపుణులుఎన్నో వ్యయప్రయాసలకోర్చి క్షేత్రస్థాయిలోఅధ్యయనాలు చేసి నివేదిక రూపొందించారు. ఆ నివేదికలను అటకెక్కించారు. ఎవరు ఎలా పోయినా, ఎంత మంది ప్రాణాలు అర్థాంతరంగా గాలిలో కలిసిపోయినా ఎన్ని లక్షల కుటుంబాలు వీధిన పడినా ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదనే విమర్శలను కొట్టివేయలేం. ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టని ప్రభుత్వం నిర్లక్ష్యంగానో, మద్యం మత్తులోనో వాహనాలు నడిపి అమాయకులను బలితీసుకుంటున్నా, జరిమానాలు వసూలు చేయాలని లక్ష్యాలుగా నిర్ణయించడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ప్రభుత్వ ఖజానాకు రాబడి ఇబ్బడి, ముబ్బడిగా పెంచడమే నిర్దేశంగా ప్రభుత్వం అడుగులు వేయాలనుకోవడం దురదృష్టకరం. నెలనెలా ఎన్ని కేసులుపెట్టాలో, ఎంత వసూలు చేయాలి? లక్ష్యాలు నిర్ణయిస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు కొందరు అధికారులు ఈ పేరుతో సొంత ఖజానాలు నింపుకుంటున్నారు. వాహనాల కట్టడి అనే లక్ష్యం నీరుగారిపోగా కాలంచెల్లిన వాహనాలకుపర్మిట్లు, లైసెన్సులు ఇష్టానుసారంగా జారీ అవుతున్నాయి. అధిక శాతం ప్రమాదాలు చోదకుల నిర్లక్ష్యం, తప్పిదం వల్లనే జరుగుతున్నాయని నిపుణుల అధ్యయనంలో తేలింది. ఇక మద్యపానం కూడా ఈ ప్రమాదాలను పెంచుతున్నదనే విషయం జగమెరిగిన సత్యం. కొందరు డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండడం వల్ల ప్రమాదాల సంఖ్య పెరిగిపోతున్నది. మద్యాదాయమే మహాప్రసాదం అన్నట్లు పాలకులు జాతీయ రహదారిపైకూడా మద్యం విక్రయకేంద్రాలకు అనుమతులు ఇవ్వడం ఈ ప్రమాదాలకు మరింత ఊతం ఇస్తున్నాయి. మద్యంతో ఆదాయం వస్తుండవచ్చు. కానీ జరుగుతున్న అనర్థాలను పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఇదిలావుంటే రోజురోజుకు వాహనాల సంఖ్య పెరిగిపోతున్నది. అందుకు తగినట్లుగా రోడ్లను విస్తరించలేకపోతున్నారు. ఏవో కమిటీలు, సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు అంటూ కాలం గడుపుతున్నారే తప్ప నిర్దిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అంతెందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదాలను నివారించడం కోసం మూడు దశాబ్దాల క్రితమే రోడ్ సేఫ్టీ ఆథారిటీని ఏర్పాటు చేసినా ఆ విభాగానికి నిధులు, విధులు అప్పగించకుండా మూలన కూర్చోబెట్టారు. చివరకు పరిస్థితి ఎలావచ్చిందంటే తమ మాట వినని, తమకు నచ్చని సీనియర్ అధికారులను అక్కడ పనిష్మెంట్ కింద పోస్టింగ్ఇచ్చి పనిలేకుండా కూర్చోబెట్టి నెలనెలా జీతభత్యాలు ఇస్తున్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండు రోడ్ సేఫ్టీ ఆథారిటీలు ఏర్పడ్డాయి. దీంతో ఆ ఆథారిటీ అలంకరప్రాయంగా నిలిచిపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆదాయం పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధాశక్తులు ప్రమాదాలు నివారించడంలో చూపించలేకపోతున్నారు. ఫలితంగా నిత్యం రహదారులు రక్తసిక్తం అవుతున్నాయి. దేశవ్యాప్తంగా వేలాదిమంది అసువులు బాస్తుండగా, కోట్లాదిమంది అంగవైకల్యంతో జీవనాధారంకోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకీడుస్తున్నారు. చేతికి అందివస్తున్న పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల గర్భశోకం, తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారినపిల్లల పరిస్థితి వర్ణనాతీతం. ఇప్పటికైనా ఆదాయమే లక్ష్యంగా కాకుండామానవతా దృక్పథంతో నడుం కట్టాలి. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపాలి. ప్రమాదాలకు కారకులైన డ్రైవర్ల లైసెన్సులను పాశ్చాత్య దేశాల్లోగా రద్దుచేయాలి. వారు జీవితంలో మళ్లీ స్టీరింగ్ పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అవసరమైతే చట్టాన్నిసవరించాలి. త్రికరణశుద్ధిగా ఆ కోణంలో ప్రయత్నాలు జరగక్కపోతే వాహనాలు మృత్యు దేవతల్లా రోడ్లపై వీరవిహారం చేయకమానవు. వేలాది మంది జీవితాలు అర్థాంతరంగా ముగియక తప్పదు.

# ఒక్క మాట

# పత్రికా మర్యాదలతోనే స్వేచ్ఛకు నెలవు

రామ కిష్టయ్య సంగన భట్ల


జర్నలిస్టుల నిరసనగా గుర్తుగా మే 3వ తేదీని ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవంగా జరుపుకుంటాము. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19 ఆర్టికల్‌కు అనుగుణంగా పాలకులు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, వారికి పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఐక్యరాజ్య సమితి 1993లో అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినంగా మే 3వ తేదీని ప్రకటించింది. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మే 3వ తేదీన పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు, పత్రికా స్వేచ్ఛపై అవగాహన కల్పించటానికి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవంను జరుపుకుంటున్నారు. భారత స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పనిచేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణపడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చుకొనేవి. తరువాత దేశ మీడియాలో ఆ గీత చెరిగిపోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారికి అనుకూలంగా, పెట్టుబడిపై లాభాలను ఆర్జించే వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చి వేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను పణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు, చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకోవడం తెలిసిందే. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటంలేదు. ప్రకటనలే పత్రికలను గటెక్కిస్తాయనడంలో సందేహంలేదు. వార్తా ప్రచురణ, ప్రసారం లాభదాయకమా కాదా? అన్నది అటుంచితే ఎందుకోకానీ నేడు నూటికి తొంభై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయనే అపప్రద ఉంది. అలాంటి వాటికి భావప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడిదారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండాపోతోంది. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్కమాట కూడా రాయలేని నిస్సహాయత నేడు మనం చూస్తున్నాం. ఫోర్త్ ఎస్టేట్‌గా మన్ననలను పొందిన మీడియా రియలెస్టేట్‌గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సివస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగిపోయింది. ఒకరిప్రయోజనాలను ఇంకొకరు కాపాడుకుంటున్నారు. లేదా వారే వీరవుతున్నారు. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించటంతో పత్రికా స్వేచ్ఛ హరించుకుపోతున్నది. పాలక పక్షాలు స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నాయన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్‌షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బిజెపి వాటితో జట్టు కట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సార్‌ను అమలు జరుపుతున్నాయి. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనావార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తుతున్నాయి. హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్నగోబెల్స్ ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమైకూర్చుంటుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటులోకి రావటంతో గోబెల్స్‌లు వికటాట్టహాసంచేస్తున్నారు. నిజమైనవార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ విషయంలో జనం కూడా గందరగోళానికి గురవుతున్నారు. మన దేశంలో 1956లో ఏర్పాటు చేసిన తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబరు 16న ప్రెస్‌కౌన్సిల్ ఏర్పడింది. ఆరోజును జాతీయ పత్రికాదినంగా పాటిస్తూ 1997నుంచి ప్రెస్‌కౌన్సిల్ ప్రతిఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. భారతదేశంలోనే కాకుండా చాలా ప్రపంచ దేశాలలో ప్రెస్‌కౌన్సిళ్లు ఉన్నాయి. అయితే భారతదేశకౌన్సిల్‌కు ఉన్న ప్రత్యే కత, గుర్తింపు ఏమంటే ప్రభుత్వ శాఖలపై కూడా తన అధికారాన్ని వినియోగించేఅవకాశంలభించడమే. స్వేచ్ఛాయుత, జవాబుదారీమీడియా కోసం జనం పరితపిస్తున్నారు. మీడియా సంస్థలనూ సరైనదారిలో పెట్టే సంకల్పంతో ప్రెస్‌కౌన్సిల్ ముందుకు సాగాలని కోరుకుందాం.

# కులగణన బడుగు జనహితమే!



డాక్టర్
సంగని మల్లేశ్వర్

దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినప్పటికీ బిసిల విషయంలో మేముసగం, మాకుసగం అనే నినాదంఎండమావిగానే నిలిచింది. ఓబీసీల సంక్షేమం కోసం పాటు పడినపాలకులు బహుఅరుదు. అలాంటి వారిలో వీపీ సింగ్, బిపి. మండల్, కరుణానిధి, కర్పూరి ఠాకూర్, ఆ తరువాత తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వారి సరసన నిలుస్తారు. అనేక ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఊదరగొట్టి 50శాతం పైగా ఉన్న బిసి జనాభాకు కులగణన చేయని కారణంగా ఏరంగంలో కూడా న్యాయం జరగలేదు. రాష్ట్రప్రభుత్వం చారిత్రాత్మకంగా తెచ్చిన రిజర్వేషన్ల బిల్లు మోడీ కోర్టులో వేయడం, దేశంలో కులగణన దిశగా 80 కోట్ల ప్రజలు మొగ్గడం, రాహుల్ నాయకత్వంలోనిఇండియా కూటమి దూకుడుగా వ్యవహరించడంవల్ల అపవాదు మూట గట్టుకుంటామనే భయంతో ఎన్డీఏ ప్రభుత్వం కులగణనకు పచ్చజెండా ఊపడం చరిత్రలో లిఖించదగ్గరోజు. దేశంలో రెండు పార్టీలు ఓబీసీలను ఇన్నాళ్లు నయవంచనకు గురిచేసినారనేది బడుగుల ఆర్థిక విధ్వంసానికి కారణమనే భావించాలి. బ్రిటిష్ కాలంలో 1931లో జరిగిన కులగణన దిక్కు అయింది. తర్వాత 1951లో నిర్వహించిన కులగణనను అంటరానిదిగా ముట్టుకోలేదు. ఈరోజు ప్రధానిగా బీసీ మోడీ ఉండడం వల్లనే తన వర్గానికి జరిగిన అన్యాయాన్ని ఆలస్యంగా అయిన గుర్తించడం వల్ల కాంగ్రెస్ ఆశలు ఆవిరి అయ్యే ప్రమాదం ఉంది. అయితే కులగణనతోనే జబ్బులు చేర్చుకుంటే సరిపోదు, సామాజిక న్యాయం జరగాలంటే ప్రభుత్వం చిత్తశుద్ధి కూడా అవసరం. ఓబీసీల తిరుగుబాటు చవిచూడక ముందే పార్లమెంట్‌లో రిజర్వేషన్ల బిల్లు రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవశ్యకత ఉంది. నాడు బీసీ కమిషన్‌కు 123వ రాజ్యాంగసవరణ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదింప చేసి రాజ్యాంగ హోదా కల్పించింది. అయితే ఇప్పుడు వచ్చే ముప్పును పసిగట్టి ముందస్తు చర్యలకు అడుగులు వేసిందనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. ఉమ్మడి పాలనలో గడిచిన 77సంవత్సరాల కాలంలో ఓబీసీల అభివృద్ధికి ఏ ప్రభుత్వం పాటు పడలేదు. నాడు వీపీ సింగ్ ప్రభుత్వం ఉండడం మూలాన 27శాతం విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లకు నోచుకుంది. నేటికీ మన సమాజంలో అనేక కులాలు ఇంకా పాలితులుగానే ఉండడం మన వెనుకబాటు తనానికి సూచిస్తున్నది. దీంతో రాజ్యాధికారం అనే భావ నను ఏ మాత్రం అనుభవించకుండా ఐదేండ్లకోసారి ఓటేసే ఓటర్లుగా మాత్రమే బతుకుతున్న జనాభాకు కులగణన ఊపిరిపోసింది. స్థానికసంస్థల ఎన్నికలకు బీసీల సామాజిక అంశమేముఖ్య అజెండాగా పోయేందుకు కాంగ్రెస్ పార్టీతోపాటు భారతీయ జనతాపార్టీ, బారాస పార్టీలు కొంగజపం కాకుండా విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల అమలుకోసం, సమన్యాయం కోసం పార్లమెంటులో రిజర్వేషన్ల బిల్లు ఆమోదించే విధంగా మేల్కొంటే అన్ని పార్టీలు బట్టకడతాయంటే అతిశయోక్తి కాదు. విద్య, ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి అన్నిపార్టీలు ఎలాం టి అరమరికాలు లేకుండా కృషి చేయవలసిన పరిస్థితులు ఏర్పడినాయి.



దేశంలో కులగణన అంశంనాయకులకు నిద్రపోనివ్వడం లేదంటే అతిశయోక్తి కాదు. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టింది కానీ, లెక్కలు బయటపెట్టలేదు. ఎన్నికల ముందు రాహుల్ హామీ ఇచ్చిన మాదిరిగానే అసెంబ్లీలో తీర్మానం చేసి యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన కులగణన రాష్ట్రప్రభుత్వాన్ని విమర్శలకు తావిచ్చింది. అందులో పిహెచ్‌డికి సరిపోయే 53 ప్రశ్నావళికి బడుగులు స్పందించలేదు. తదుపరి అవకాశం ఇచ్చినా ఆదరణకు నోచుకోలేదు. కేంద్రంచేపట్టనున్న కులగణనలో స్పష్టంగా ఒక పేజీకి మించకుండాసామాజిక, విద్య, ఉద్యోగ అంశాలపై దృష్టిసారిస్తే 100శాతం ఫలితాలు రాబట్టవచ్చుననే భావం ఏర్పడింది. ఈనేపథ్యం లో అనేక విషయాలు జవాబు లేని ప్రశ్నలుగా మనముందుంటున్నాయి. కుటుంబాలవారీగా ఆదాయ గణన ఒకశాస్త్రీయ పద్ధతిలో జరగనప్పుడు అర్హత గల పేద కుటుంబాలను ఎలాగుర్తిస్తారు? నిజానికి అందరికి ఆమోదయోగ్యమైన విధంగా దశాబ్దాలుగా శాస్త్రీయంగా పేదలను గుర్తించే అధ్యయనం జరగలేదు. అలాంటప్పుడు దుడ్డు ఉన్నోడిదే బర్రె అన్నమాదిరిగా ఇలాంటి పథకాలుతప్పుదారి పట్టడం మామూలే. ప్రభుత్వాలకు సైతం అమలు చేయడం సమస్య గా మారుతుంది. ఇంకా చెప్పాలంటే మన దేశంలో వ్యక్తిగతంగా వార్షికాదాయం లెక్కించడం మరిక్లిష్టతరమైనది. పనికి తగ్గ వేతనం లేదు. స్వయం ఉపాధి మీద ఆధారపడి జీవిస్తున్న సగటు ప్రజల వార్షికాదాయం లెక్కించడం సాధ్యమయ్యే పనికాదు. అందుకే కులగణన సమస్యాత్మకంగా మారింది. దేశంలో కులగణనకు తెలంగాణ, బీహార్ ,కర్ణాటక ఆదర్శంగా నిలిచాయని, అందులో కాంగ్రెస్‌పాలిస్తున్న రాష్ట్రాలు ముందడుగు వేయడంతో ఆలస్యంఅమృతం విషం అన్నానుడి గుర్తుకొచ్చి బీజేపీ నిర్ణయం తీసుకోవడం తప్పలేదు. సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిమితి దాటడానికి రాజమార్గంఏర్పడ్డది. ఏదిఏమైనా రాహుల్ఇచ్చిన కులగణన హామీతో బెంబేలెత్తి పచ్చజెండా ఊపడం ముదావహం.

## నాల్గవ రోజుకు చేరిన సమ్మె

**ఒంగోలు టౌన్, మే 2, ప్రభాతవార్త**



సమస్యలు పరిష్కరించాలంటూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ చేపట్టిన సమ్మె శుక్రవారంతో నాల్గవ రోజుకు చేరింది. కలెక్టరేట్ ఎదుట ఎపిఎంసిఎ రాష్ట్ర నాయకులు రాజేష్ మాట్లాడుతూ 23శాతం హైక్, ఉద్యోగ భద్రత, ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు తదితర సమస్యలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేదాకా ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిర్మల, ప్రసన్న, కో-ఆర్డినేటర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## కులగణన ఎప్పటికి పూర్తి చేస్తారో స్పష్టత ఇవ్వాలి: గౌస్ డిమాండ్

**ఒంగోలు టౌన్, మే 2, ప్రభాతవార్త**



దేశంలో కులగణన చేపడుతామని కేంద్రం ప్రకటించడం మంచిదేనని, అయితే ఎప్పటికి పూర్తి చేస్తారో స్పష్టత ఇవ్వాలని ఒంగోలు అసెంబ్లీ కాంగ్రెస్ సమన్వయకర్త బిఆర్ గౌస్ అన్నారు. స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ఒత్తిడి మేరకే కేంద్రం దిగి వచ్చి కులగణన ప్రకటన చేసిందని, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలలో మాదిరి కులగణన ప్రక్రియ ఉంటే జనం హర్షిస్తారన్నారు. బీహార్ ఎన్నికలలో లబ్ధి పొందేందుకు స్టంట్‌గా భావిస్తే జనం బుద్ధి చెబుతారని, ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తే ఫలితం అనుభవించాల్సి ఉదేనన్నారు.

## గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

**వేటపాలెం, మే 2, ప్రభాతవార్త**





గుండెపోటుతో కానిస్టేబుల్ జయరావు(44) మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన సలగల జయరావు నాదెండ్ల పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందినట్లు తెలియజేయడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. జయరావుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. గ్రామంలోని స్మశాన వాటికలో ఆర్ఎఫ్ఐ 1 ప్లస్ 4 పల్నాడు జిల్లా సిబ్బంది, అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. నాదెండ్ల ఎస్సై సిబ్బంది పాల్గొన్నారు.

## కావూరి పవన్ కుమార్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ టోర్నమెంట్స్

**చీరాల, మే 2, ప్రభాతవార్త**





హోరాహోరీగా కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు, కావూరి పవన్ కుమార్ జ్ఞాపకార్థం బాపట్ల జిల్లా చీరాల ఎన్ఆర్ ఎంపీ స్కూల్‌లో నూతలపాటి దేవదాస్ నల్లమల జిల్లా కోఆర్డినేటర్, నూతలపాటి విజయ్ కుమార్ ల ఆధ్వర్యంలో ఫ్లడ్ లైట్స్ వెలుగుల మధ్యలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్స్ హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి ఫుట్ బాల్ క్రీడాకారులు సుమారు 20 జట్లు పాల్గొన్నట్లు, ఈ టోర్న మెంట్స్ మూడు రోజులు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్స్ నూతలపాటి దేవదాస్, నూతలపాటి విజయ్‌కుమార్‌లు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన ఫుట్‌బాల్ క్రీడాకారులకు భోజన వసతి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

## పేకాటరాయుళ్లపై దాడి

**వేటపాలెం, మే 2 ,ప్రభాతవార్త**



మండలంలోని వివేకానంద కాలనీలో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు వారి బృందం మెరుపు దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.4800ల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను, జూదాలను అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్ ని ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. అంతే కాకుండా పేకాట ఆడుతున్న సమాచారం ఎవరైనా తెలిపిన యెడల వారి సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు.

## గిరిజన బాలుర గురుకుల పాఠశాల పరిశుభ్రం

**కనిగిరి, మే 2, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణంలోని శివ నగర్ కాలనీలో ఉన్న గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పారిశుధ్య కార్యక్రమాలు శుక్రవారం వేగంగా జరిగాయి. గురుకుల పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు కొబ్బరిబోండాల సుబ్బారావు చొరువతో కనిగిరి మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. శివనగర్ కాలనీలో వీధి దీపాలకు నూతన లైట్లు ఏర్పాటు చేసి స్థానికులు చీకట్లో ఇబ్బందులు పడకుండా వెలుతూరు సౌకార్యన్ని కలిగించారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరువతో వాటిలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులకు, అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## కార్యదర్శిపై విచారణ వాయిదా

**నాగులుప్పలపాడు, మే 2, ప్రభాతవార్త**



మండలంలోని మట్టిగుంట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న ఎం.బెనహర్ ఇటీవల కాలంలో ఉప్పగుండూరు పంచాయతీలో ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా పని చేశారు. ఆ సమయంలో అవినీతి జరిగినట్లు పంచాయతీ 14వ వార్డు మెంబరు కనగాల శ్రీనివాసరావు పంచాయతీ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఈదుమూడి, మట్టిగుంట, ఒమ్మెవరం తదితర పంచాయతీల నుండి కార్యదర్శి బెనహర్‌పై పలు ఆరోపణలు రావడంతో జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు శుక్రవారం డీఎల్‌పీవో పద్మావతి నాగులుప్పలపాడు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. దాంతో ఫిర్యాదు దారుడు హాజరు కాకపోవడంతో విచారణ వాయిదా వేసినట్లు డీఎల్‌పీవో పద్మావతి తెలిపారు. బెనహర్ చేసిన సమయంలో అందుకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బెనహర్‌తో పాటు ఉప్పుగుండూరు పంచాయతీ ప్రస్తుత కార్యదర్శి ఎం.కిరణ్ కుమార్, ఈదుమూడి కార్యదర్శి డీవీ రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

## నారా లోకేష్‌ను కలిసిన బిజెపి నేత కళ్యాణ్‌చక్రవర్తి



**ఒంగోలు, ప్రభాతవార్త**

రాజధాని సభలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, క్విస్ కళాశాల ఛైర్మన్ నిడమానూరు కళ్యాణ్‌చక్రవర్తి, బిజెపి జిల్లా అధ్యక్షులు సెగ్గెం శ్రీనివాసరావులు మర్యాద పూర్వకంగా కలిశారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

## క్యాంపస్ సెలక్షన్స్‌లో 13 మందికి ఉద్యోగాలు

**ఒంగోలు టౌన్, మే 2,ప్రభాతవార్త**



రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న 13 మంది విద్యార్థులు లుమినా డేటామేటిక్స్‌లో ట్రైనీ ఇంజనీర్‌లుగా ఉద్యోగాలు సాధించారు. కంపెనీ తరుపున హెచ్ఆర్ మైఖేల్ విద్యార్థులకు వ్రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ రౌండ్, హెచ్ఆర్ రౌండ్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల గౌరవ ఛైర్మన్ ఇస్కాల రంగమన్నార్, డైరెక్టర్ డాక్టర్ భాస్కర్‌రావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రఘుబాబు అభినందించారు.

# గుండెకు 'బిల్'

- తాకితే షాక్ కొడుతున్న కరెంటు బిల్లులు
- విస్తుపోతున్న వినియోగదారులు
- వేసవిలో మరీ మండుతున్న బిల్లులు

**ఒంగోలు, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వ పాలనలో విద్యుత్ బిల్లుల బాదుడు అంతకంతకు తీవ్రమవుతుంది. షాక్ కొట్టేలా బిల్లులు వస్తుండటంతో వినియోగదారులు విస్తుపోతున్నారు. ముఖ్యంగా సర్దుబాటు ఛార్జీల పేరిట అదనపు మొత్తం విధిస్తుండటంతో బిల్లులు తడిసిమోపెడవుతుందని ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రభుత్వ పాలనలో రెండు సార్లు సర్దుబాటు ఛార్జీల పేరిట బిల్లులు పెంచారని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. 9.412 కోట్ల మేర వినియోగదారుల నుంచి వసూళ్లు చేయాలని డిస్కమ్‌లకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఏపీఈఆర్సీ గతంలో ఆదేశాలు ఇవ్వడంతో బిల్లులు అమాంతంగా పెరిగిపోతాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆరు నెలల క్రితం ఇదే తరహాలో 6వేల 72 కోట్ల భారం మోపడం వలన వినియోగదారుల నుండి యూనిట్‌కు రూ.2.19 పైసలు చొప్పున అదనంగా వసూళ్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెప్తున్నారు. డిస్కంలకు నష్టాలను తగ్గించే క్రమంలో ప్రజలపై మోయలేని భారాన్ని వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా ఇదే తరహాలో బిల్లులను పెంచిందని కూటమి నాయకులు ఎదురుదాడికి దిగుతుండటం గమనార్హం.

**బిల్లులో చార్జీల వసూళ్లు ఇలాః**

నిజానికి కరెంటు బిల్లులో విద్యుత్ టారీఫ్ (బిల్డ్ యూనిట్) ప్రధానంగా ఉంటుంది. ఇది వినియోగదారుడు నెల రోజుల పాటు వాడుకున్న విద్యుత్‌కు చెల్లించే మొత్తంగా పేర్కొంటారు. అయితే దీనికి తోడు ఫిక్స్‌డ్ ఛార్జీలు, ట్రాన్స్‌ఫారం, విద్యుత్ స్తంభాలు వైర్లకు సంబంధించిన ఎస్టాబ్లిస్‌మెంట్ ఛార్జీ, నిజానికి ఒక ప్రాంతంలో కొత్త లైన్లు ఏర్పాటు చేసేటప్పుడు మాత్రమే ఈ ఛార్జీలు విధించాల్సి ఉంది. అయితే 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన లైన్లు ఉండే ప్రాంతాల్లోనూ ఈ ఛార్జీని విధిస్తుండటం వినియోగదారుడికి గుదిబండగా మారుతుంది. అదే సమయంలో కస్టమర్ ఛార్జీ పేరిట ట్రాన్స్‌ఫారం నుంచి ఇంటికి వ్యాపార సంస్థకు తీసుకునే లైన్ నిర్వహణ పేరిట ఈ ఛార్జీని వసూళ్లు చేస్తున్నారు. వాస్తవానికి మీటర్ కనెక్షన్ తీసుకునే సందర్భంలోనే ఈ మొత్తాన్ని వినియోగదారుడు చెల్లిస్తాడు. కానీ తరువాత కూడా ఇదే పేరుతో విద్యుత్ పంపిణీ సంస్థలు వినియోగదారుడిపై భారం మోపుతుండటం గమనార్హం. ఇక ఎలక్ట్రిసిటి డ్యూటీ పేరుతో విద్యుత్ వినియోగదారుడు నుంచి ప్రభుత్వం వసూళ్లు చేసే పన్ను కూడా కరెంటు బిల్లుకు అదనంగా యాడ్ అవుతుంది. ఇది యూనిట్‌కు 6 నుంచి 10 పైసల వరకు ప్రాంతాల నుంచి వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇక వ్యాపార సంస్థలకు ఇది యూనిట్‌కు ఒక రూపాయి వరకు ఉంటుంది. దీంతో పాటు ట్రూఆప్ ఛార్జీలు, ఏఎఫ్ పీపీసీఏ(ఇంధన సర్దుబాటు) ఛార్జీల పేరిట గతంలో వినియోగదారుడు చెల్లించిన విద్యుత్ ధరకు డిస్కం కొనుగోలు చేసిన విద్యుత్ ధరకు మధ్య తేడాను గుర్తించి కొంత మొత్తం అదనంగా విధిస్తున్నారు. ఉదాహరణకు ఒక వ్యక్తి 2023లో ఒక యూనిట్‌కు 1.60పైసలు చొప్పున చెల్లించి విద్యుత్ వినియోగించుకుంటే ఆ సమయంలో డిమాండ్




మేరకు విద్యుత్‌ను అందించేందుకు డిస్కంలు ఇతర సంస్థల నుంచి విద్యుత్‌ను ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేసి ఉండి ఉంటే ప్రస్తుతం ఆ మొత్తానికి సరిపడ ఛార్జీలు మొత్తం వినియోగదారుల నుంచి వసూళ్లు చేసేందుకు ప్రభుత్వం అనుమతిస్తుంది. ఒక వేళ ఎవరైనా బాడుగ ఇంట్లో ఉన్నా, ఇల్లు మారిన అప్పట్లో ఆ ఇంట్లో ఉన్న వారు వాడుకున్న విద్యుత్‌కు ఇప్పుడున్న వ్యక్తులు అదనపు ఛార్జీ చెల్లించాలన్నమాట, ఇలా వసూళ్లు చేయడం ఎంత వరకు సమంజసమో ప్రభుత్వం విద్యుత్ నియంత్రణ మండలికే ఎరుక. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఈ ట్రూఆప్ ఛార్జీలను ఏ నెలకు ఆ నెల వసూళ్లు చేయాలని ఆదేశించడంతో నెల నెల అదనపు మొత్తం వినియోగదారుడు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా వాస్తవంగా కరెంటు వినియోగించిన బిల్లు యూనిట్ల కంటే అదనంగా డిస్కంలు రకరకాల పేర్లతో వసూళ్లు చేస్తుండటంతో విద్యుత్ బిల్లులు చాంతాడంతగా పెరిగిపోతున్నాయి. ఇప్పటికైన ప్రభుత్వం అదనపు సుంకాలను తగ్గించి వాస్తవంగా వినియోగించిన విద్యుత్‌కే బిల్లు వసూళ్లు చేయాలని సగటు వినియోగదారుడు కోరుతున్నారు.

**స్మార్ట్‌గా దోపిడిః**

మీడియా వార్తకు స్పెస్ టైం ప్రైమ్ ఉంటుంది. స్పెస్ అంటే ఎక్కువ మంది చూడని సమయం అంటే ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు. ఈ టైంలో ప్రజలు జనం వారి వారి వృత్తి ఉద్యోగాల్లో బిజీగా ఉండటం. ప్రయాణాల్లో ఉండటం వల్ల టీవీ చూసే సమయం దొరకదు. అందుకే ఈ సమయంలో టీవీలో వచ్చే యాడ్స్‌కు కూడా పెద్దగా డిమాండ్ ఉండదు. వాటికి ధర చెల్లింపు కూడా తక్కువగా ఉంటుంది. ఇక సాయంత్రం 6గంటల నుంచి 9గంటల వరకు ప్రైమ్ టైమ్‌గా పేర్కొంటారు. ఈ సమయంలో ప్రజలు ఎక్కువగా ఇళ్లల్లోనే ఉండే అవకాశం ఉండటంతో టీవీల్లో అతక్కపోతారు. ఈ సమయంలో వచ్చే యాడ్స్‌కు, సీరియల్స్‌కు, వార్తలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. ఇవ్వన్నీ ఛానెళ్లలో వ్యాపార సూత్రాలు. ఇదే విధానాన్ని ప్రభుత్వం కూడా అనుసరిస్తుంది. ఉదయం వేళల్లో రోజువారి కాలకృత్యాలకు లంచ్ బాక్సులు సిద్ధం చేసుకోవడం కోసం ఎలక్ట్రానిక్ పరికరాలను జనం ఎక్కువగా వినియోగిస్తారు. అదే సమయంలో సాయంత్రం ఇళ్లకు వచ్చాక ఫ్యాన్‌లు, ఏసీలు, కూలర్లు అధికంగా వాడతారు. లైట్లు వేస్తారు. దీనిని అధికారులు ప్రైమ్ టైమ్‌గా నిర్ణయించి స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రత్యేక ఛార్జీ విధిస్తూ యూనిట్‌కు ఎక్కువ మొత్తం చొప్పున వసూళ్లు చేస్తుండటంపై కూడా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**వేసవిలో రెట్టింపుగాః**

వేసవి కాలం ప్రారంభం కావడంతో విద్యుత్ వినియోగం రాష్ట్రంలో భారీగా పెరిగింది. దీంతో ఎండలతో పాటు బిల్లులు సైతం మండిపోతున్నాయంటూ వినియోగదారులు వాపోతున్నారు. రాష్ట్రంలో సాధారణంగా రోజుకు 200 నుంచి 220 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంటుంది. అయితే వేసవి కాలం అయిన మే, జూన్‌లలో రోజువారి డిమాండ్ దాదాపు 245 నుంచి 270 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈమేరకు ఏడాదికి 64 వేల మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ అవసరం అవుతుంది. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 24 వేల మెగా వాట్ల వరకు ఉంది. దీంతో వివిధ సంస్థలతో ఒప్పందాల మేరకు డిమాండ్‌కు సరిపడా విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అదనపు ఛార్జీల పేరిట వినియోగదారుడి నుంచి అదనంగా ముక్కు పిండి వసూళ్లు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆ శాఖ అధికారులు చెప్తున్నారు. ఏదీ ఏమైనా ఛార్జీలు పెంచబోమంటూ గద్దెనెక్కిన పాలకులు వినియోగదారులపై భారం మోపడం మాత్రం సహేతుకం కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అదనపు ఛార్జీల బాదుడు వల్ల ధనవంతులు, వ్యాపారుల కంటే సామాన్యులు, మధ్య తరగతి వినియోగదారులే అత్యధికంగా నష్టపోతుండటంతో గమనార్హం. కొన్ని సందర్భాల్లో ఇది వాస్తవ బిల్ కంటే రెట్టింపు స్థాయి ఉండటం వినియోగదారులను విస్మయానికి గురి చేస్తుంది.

## కగార్ ఆపరేషన్ నిలిపివేయాలి

- మావోయిస్ట్ పార్టీతో చర్చలు జరపాలి
- సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ డిమాండ్

**ఒంగోలు టౌన్, మే 2, ప్రభాతవార్త**



కగార్ ఆపరేషన్ నిలిపివేసి కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్ట్ పార్టీతో చర్చలు జరిపి దండకారణ్యంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆర్ మోహన్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసీలు నివసిస్తున్న దండకారణ్యంలో ఇనుపఖనిజం, గ్రాఫైట్, సున్నపురాయి, యురేనియం నిక్షేపాలను కార్పొరేట్‌లకు అప్పజెప్పేందుకే కేంద్రం విధ్వంసం సృష్టిస్తోందని, బూటకపు ఎన్‌కౌంటర్‌లను సహించేదిలేదని, శాంతి నెలకొల్పకపోతే ప్రజలు తిరగబడడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఎం కొండారెడ్డి, ఎస్‌కెఎం చుండూరి రంగారావు, ఓపిడిఆర్ సుధాకర్, రెడ్‌స్టార్ సుబ్బారావు, పికెఎం కోటి, పిఓడబ్ల్యు పద్మ, ఎఐకెఎంఎస్ నాంచార్లు, పిడిఎస్‌యు రాజశేఖర్, అరుణోదయ జాలన్న తదితరులు పాల్గొన్నారు.

## ఫిరాయింపు మున్సిపల్ పీఠాలతో టీడీపీకి ఏం లాభం..?

**ఒంగోలు, ప్రభాతవార్త**

తెలుగుదేశం ఇటీవల కాలంలో పలు చోట్ల ఫిరాయింపులు, అవిశ్వాసాలకు స్థానిక సంస్థల పీఠాలను దక్కించుకుంటుంది. గుంటూరు, విశాఖ, కార్పొరేషన్లకు మేయర్లు కూడా కూటమి నుంచి వచ్చారు. కుప్పం మున్సిపల్ ఛైర్మన్‌గా వ్యక్తి రాజీనామా చేసి టీడీపీలో చేరడంతో వేరే కౌన్సిలర్‌గా టీడీపీ తరుపున నియమించారు. తాజాగా బొబ్బిలి, చీరాల మున్సిపాటీలను ఫిరాయింపులు మ్యాజిక్ చేశారు. గతంలో హిందూపురం, మాచర్ల తదితర మున్సిపాలిటీలను కూడా తెలుగుదేశం కైవసం చేసుకుంది. అయితే ఇలాంటి ఫిరాయింపుల వల్ల టీడీపీకి గాని, కూటమిలోని ఇతర పార్టీలకు గాని లాభం ఏమిటన్న దానిపై మాత్రం స్పష్టత లేదు. పదవి కాలం మరో ఏడాది లోపు మాత్రమే. వైఎస్సార్‌సీపీ హయాంలో మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. అప్పట్లో దర్శి, తాడిపత్రి, మున్సిపాలిటీల్లో తప్ప ఎక్కడ విజయం దక్కలేదు. కానీ తాము ఎలా గెలిచామో వైసీపీకి తెలుసు కాబట్టి ఓడిపోయిన మున్సిపల్ పీఠాలు తమ దగ్గర ఉండేలా అవిశ్వాసం గడువుపై చట్టాన్ని మార్చేశారు. నాలుగేళ్లు పూర్తయిన తరువాతనే అవిశ్వాసం పెట్టాలని వైసీపీ ఆర్డినెన్స్ చేసింది. ఈ కారణంగా ప్రభుత్వం వచ్చిన అవిశ్వాసాలు పెట్టడానికి పది నెలలకు పైగా పట్టింది. అవిశ్వాసాలు పెట్టి చాలా చోట్ల టీడీపీ నేతలు పీఠాల కైవసం చేసుకున్నారు. అయితే ఆ పదవి కాలం చాలా స్వల్పమే. ఏడాది లోపే ఉంటుంది. మున్సిపల్ ఛైర్మన్ పీఠాలపై అధికారికంగా లేకపోయినప్పటికి ప్రభుత్వం లేకపోతే మున్సిపల్ ఛైర్మన్‌లు చివరకు మేయర్లు కూడా ఏమి చేయలేరు. అధికారులు వారి మాట వినరు. దానికి సాక్ష్యం గుంటూరులో మేయర్‌గా పని చేయలేక రాజీనామా చేసిన కావేటి మనోహర్‌నాయుడే ఉదాహరణ. ఆయన తమ ప్రభుత్వం ఉన్నంత వరకు ఇష్టారాజ్యంగా పాలన చేశారు. తరువాత ప్రభుత్వం మారగానే తన ఛాంబర్ తాళాలు కూడా ఇవ్వడం లేదని ఫీలయ్యారు. తరువాత రాజీనామా చేశారు. మిగిలిన చోట్ల అలా ఎవరు రాజీనామాలు చేయడం లేదు గాని, వారికేమి పవర్స్ ఉండటం లేదు. కూటమి నేతలే అధికారం చెలాయిస్తున్నారు. పార్టీలోకి ఫిరాయించి వచ్చే వారు తమ పదవిని కాపాడుకోవడానికి వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీ తరుపున మరో సారి కార్పొరేటర్ లేదా కౌన్సిలర్‌గా టిక్కెట్ పొందడానికి అయి ఉంటుంది. చాలా వరకు వారి కోరికలను మన్నించాల్సి రావచ్చు. దాని వల్ల పార్టీ కోసం పని చేసిన ద్వితీయ శ్రేణి నేతలకు టిక్కెట్లు దొరకడం గగణంగా మారుతుంది. అందుకే మున్సిపల్ ఫిరాయింపులను కూటమి పార్టీలు ప్రోత్సహించకపోవడమే మంచిదన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వినిపిస్తుంది.



## అమరావతి వెళ్తున్న బస్సులను ప్రారంభించిన బెల్లం జయంతిబాబు

**టంగుటూరు, మే 2, ప్రభాతవార్త**

అమరావతి పునఃప్రారంభ కార్యక్రమానికి టంగుటూరు నుండి నాయకులు, కార్యకర్తలు, అధికారులు శుక్రవారం తరలివెళ్లారు. బస్సులు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకుని బయలుదేరి వెళ్లారు. బస్సులను మాజీ సర్పంచ్ బెల్లం జయంతి బాబు జెండా ఊపి ప్రారంభించారు. తరలివెళ్లిన వారిలో కామని విజయకుమార్, బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ దేవసేనకుమారి,, డిప్యూటీ తహశీల్దా శ్రీనాథ్, ఏపీఎం సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## రాజధాని అమరావతి సభకు హాజరైన జిల్లా నాయకులు





**ఒంగోలు, ప్రభాతవార్త**

ఆంధ్రుల కలల రాజధాని అమరావతి పనుల ప్రారంభోత్సవ సభ శుక్రవారం అమరావతిలో జరగగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ హాజరుకాగా.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌లు పాల్గొన్నారు. అయితే జిల్లా నుండి కూటమి పార్టీ నాయకులు కార్యక్రమానికి హాజరయ్యారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా స్వామి, ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బియన్ విజయ కుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి, గొట్టిపాటి లక్ష్మి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిడమానూరు కళ్యాణ్ చక్రవర్తి, బిజెపి జిల్లా అధ్యక్షులు సెగ్గెం శ్రీనివాస రావు, బొద్దులూరి ఆంజనేయులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## అంగన్వాడి కేంద్రాల పరిధిలో కిషోరి బాలికల సాధికారత



**దొనకొండ,మే 2,(ప్రభాతవార్త)**
దొనకొండ మండలం చందవరం గ్రామంలో సచివాలయం నందు మూడు అంగన్వాడి కేంద్రాల పరిధిలో కిషోరి బాలికల సాధికారత మనందరి బాధ్యత కిషోర్ వికాసం వేసవి సెలవుల్లో కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు శుక్రవారం సమావేశం ఏర్పరిచారు. ప్రకాశం జిల్లా దొనకొండలో కిషోరి వికాసం ప్రోగ్రామ్ చెందవరం సచివాలయంలో చందవరంలో మూడు అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించడం అయినది. రుద్రసముద్రం గ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ సుభాషిని ఆధ్వర్యంలో నిర్వహించారు11 నుండి 18 సంవత్సరాల కిషోరి బాలికలకు పరిచయ కార్యక్రమం నిర్వహించడం అయినది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కిషోర్ బాలికల ఎడ్యుకేషన్ గురించి తెలియజేస్తూ డ్రాప్ అవుట్ పిల్లలకు చిన్న వయసులో పెళ్లి చేయకూడదని స్కూల్లో చేర్పించాలని ట్రైనింగ్ ఇవ్వాల్సి వస్తుందని కిషోర్ బాలికలు ఈ మీటింగ్ లో అవగాహన కల్పించడం ద్వారా వారికి మేలు కలుగుతుందని అన్నారుఈ కార్యక్రమంలో వెల్ఫేర్ కొండారెడ్డి, డిఎ మణికంఠ, అగ్రికల్చర్ నరేంద్ర, ఏఎన్ఎం యశోద రాణి, వివో ఏ సుబ్బలక్ష్మి, ఆశ రాజేశ్వరి, ఏ డబ్ల్యు డబ్ల్యు డి.వెంకటలక్ష్మి కిషోర్ బాలికలు తదితరులు పాల్గొన్నారు,

## దొనకొండ మండలం ఇంచార్జి తహశీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్



**దొనకొండ,మే 2,(ప్రభాతవార్త)**
దొనకొండ మండలం అదనపు తహశీల్దార్‌గా ఎం.శ్రావణ్‌కుమార్‌ను జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆయనను నియమించారు. గతంలో దొనకొండ మండలం తహశీల్దార్‌గా పనిచేస్తున్న అధికారిణి పలు కారణాల వలన ఆమెను బదిలీ చేస్తూ దర్శి మండలం తహశీల్దార్‌గా పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్‌కు దొనకొండ మండల అదనపు తహశీల్దాగా నియమించినట్లు ఆయన శుక్రవారం దొనకొండ మండల తహశీల్దార్‌గా చార్జి తీసుకున్నారు.అనంతరం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ మండలంలోని పలుగ్రామాలకు చెందిన రైతులు,ప్రజలురెవెన్యూ సమస్యలు ఉంటే తమ కార్యాలయంలో స్వయంగా కలిసి సమస్యలను విన్నవించుకుంటే ఆ సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

### బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రంలో ఆదిశంకరాచార్యులు జయంతి వేడుకలు



**అద్దంకి ,మే 2 (ప్రభాతవార్త)**
శ్రీ ప్రసన్నాంజనేయ బ్రాహ్మణ నిత్య అన్నదాన సింగరకొండలో ఆదిశంకరాచార్యులు, మరియు రామానుజాచార్యులు స్వాముల వారి జయంతి వేడుకలు సత్రం అధ్యక్షులు ఆదిపూడి మోహనరావుఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమంలో కార్యదర్శి పమిడిఘంటం చంద్రశేఖర్, కోశాధికారి ధేనువకొండ సుబ్బారావు, పుట్టంరాజు రామకృష్ణ మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### అమరావతి పునర్‌నిర్మాణ సభకు తరలిన 4వ వార్డు టిడిపి నేతలు



**అద్దంకి ,మే 2, (ప్రభాతవార్త)**
కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో అమరావతి పునర్‌నిర్మాణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్రమోదీ,ముఖ్య అతిధిగా హాజరు అయ్యారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు, అద్దంకి నుండి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు తెలుగుతమ్ముళ్ళతో పాటు, కూటమి నేతలు, కార్యకర్తలు సభకు తరలివెళ్ళారు. అద్దంకి పట్టణంలోని 4వవార్డు కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ గోపి ఆధ్వర్యంలో కార్యకర్తలు, అధిక సంఖ్యలో తరలి వెళ్ళారు. అదే విధంగా అద్దంకి పట్టణంలోని పలు వార్డుల నుండి కూడ ఈ పునర్‌నిర్మాణ సభలో పాల్గొనేందుకు, అమరావతికి ఉత్సహంగా తరలివెళ్ళారు.

## రాజధాని పునర్నిర్మాణానికి బయలుదేరిన శ్రేణులు



**మద్దిపాడు, మే 2, (ప్రభాతవార్త)**
మద్దిపాడు మండల పరిధిలోని గ్రామాలలో శుక్రవారం ఓ పండుగ వాతావరణం కనిపరిచింది. శుక్రవారం ఉదయం మండలంలోని అన్ని గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంతిబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు కూటమిలోనే ఆయా పార్టీ శ్రేణులు రాజధాని వైపు కథం తొక్కాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా పున:ప్రారంభమవుతున్న రాజధాని అమరావతి పనులను వీక్షించడానికి మండలం నుంచి తొమ్మిది బస్సులు 28 కార్లు ర్యాలీగా బయలుదేరాయి.ఈ కార్యక్రమానికి మండవ జయంతిబాబు ఆధ్వర్యంలో ప్రతి బస్సుకు భోజనం ప్యాకెట్స్ మంచినీటి ప్యాకెట్లు మజ్జిగ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్ ఆర్ఐ రమణయ్య, ఏపీఎం సుబ్బారావు, మండల సర్వే రంజల హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, వెల్లంపల్లి ఎంపీటీసీ అద్దేపల్లి దుర్గా భవాని, మండల ప్రధాన కార్యదర్శి ముత్తనపల్లి రామలింగయ్య, మండల ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు రెబ్బవరపు ప్రభాకర్, శుద్దపల్లి అనిల్, టీడీపీ నాయకులు వడ్డంపూడి శ్రీను, కాకర్ల విజయ్ కుమార్, పోకూరు శ్రీను, రావిపాటి శేషయ్య, కడియాల రఘుబాబు, రావి నరసింహారావు, వేల్పుల నాగాజు, కాకర్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

## కిశోరి వికాసం బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది



**పొన్నలూరు, మే 2, (ప్రభాతవార్త)**
మండలంలోని ముత్తరాజుపాలెంలో శుక్రవారం కిషోర వికాసం సమ్మర క్యాంపు కార్యక్రమం సర్పంచ్ రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ 11 నుండి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత ఆర్థిక స్వావలంబన మెరుగుపరచడంలోనూ బాలికల శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు బాలికల్లో ఆత్మ రక్షణ, మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాలు, కిషోర్ బాలికలకు సరైన విజ్ఞానం అందించి జీవితంలో అన్ని విధాలుగా ఎదిగేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉందని, బాలికలు అన్ని విధాలుగా ఎదగటానికి ఉన్న అడ్డంకులను తొలగించడంలో పటిష్ట భాగస్వామ్యం ఉండాలన్నారు. అలాగే బాల్య వివాహాలను అడ్డుకోవడం, యోగ, శారీరక వ్యాయామాన్ని ప్రోత్సహించడం వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణవేణి, ఎంఎస్‌కే శాంతి, ఏఎన్ఎం నజ్మా, హేమలత, రామలక్ష్మి, సునీత, అరుణ, ఏడబ్ల్యూహెచ్ అమృత, ఏడబ్ల్యూడబ్ల్యూ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## కిశోర వికాసంపై బాలబాలికలకు అవగాహన



**కురిచేడు, మే 2, (ప్రభాతవార్త)**
కురిచేడు నుసుం బజార్ అంగన్‌వాడీ కేంద్రం నందు శుక్రవారం కిశోర బాల బాలికలకు కిశోర వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా లింగ వివక్షత, సంపూర్ణ ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, లైంగిక వేదింపుల నుండి రక్షణ, బాల్య వివాహాలను అరికట్టుట, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ నైపుణ్యం, ఉపాధి మొదలగు విషయాలపై కిశోర బాల బాలికలకు అవగాహన కల్పించారు. మే 2 నుండి జూన్ 10వ తేదీ వరకు జరుగు ఈ సమ్మర్ స్పెషల్ క్యాంపు నందు అనేక విషయాలు గురించి కిశోర బాల బాలికలకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి బి.ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్త షేక్ ఫాతిమా, ఆశా వర్కర్ యు.కొండమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో శంకర జయంతి వేడుకలు ఆదిశంకరాచార్యుల చిత్రపటంతో శోభాయాత్ర



**ఒంగోలుకల్చరల్,మే 2, (ప్రభాతవార్త)**
జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర శంకరమఠం శ్రీ కంచి కామాక్షమ్మ దేవస్థానంలో, భూదేవి శ్రీదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో, సంతపేట షిరిడి సాయిబాబా మందిరంలో, ఆలయ అర్చకులు శంకరాచార్యుల మూలవిరాటుకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో పుష్పాలంకరణ గాంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద స్మార్త ప్రవర్తక విద్వత్ పరీక్షా పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కేశవస్వామి పేటలోని లలిత ఆశ్రమంలో నుండి భక్తులు జయ జయ శంకర హర హర శంకర భజనలతో జగద్గురువు ఆదిశంకరాచార్యుల చిత్రపటంతో నగరంలోని గాంధీ రోడ్డు, పప్పు బజారు , ఏనుగు చెట్టు , తాతా బిల్డింగ్స్ మీదగా లలితాశ్రమానికి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రముఖ వేద పండితులు వంగల కృష్ణమూర్తి అవధాని,పిన్నెల్లి చంద్రశేఖర్ అవధాని, ఆధ్వర్యంలో వేదపరీక్షలకు అధికారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న వేద విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వేద పండితులకు అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నేలబోట్ల సదాశివయ్య,కార్యదర్శి మహాంకాళి వెంకట శేషయ్య, జాయింట్ సెక్రెటరీ భీమ శంకరశాస్త్రి. కోశాధికారి తొండెపి మల్లినాధుడు, సభ్యులు ఆలూరి రామారావు, భారతుల శ్రీనివాస శర్మ, మైనంపాటి సాయి కుమార్, వ్యామజాల ప్రసన్న కుమార్ ఒరుగంటి ప్రసాద్ తదితులు పాల్గొన్నారు,

## మద్దిపాడు నూతన తహశీల్దార్‌గా నారాయణరెడ్డి



**మద్దిపాడు, మే 2, (ప్రభాతవార్త)**
మద్దిపాడు మండల నూతన తహశీల్దార్ గా ఎస్.నారాయణరెడ్డి శుక్రవారం నాడు పదవి బాధ్యతలు చేపట్టారు. తహశీల్దార్ నారాయణరెడ్డి గతంలో సంతనూతలపాడు తహశీల్దార్గఆ, జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ల్యాండ్ సెటిల్‌మెంట్ అధికారిగా పని చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు,రాజకీయ నాయకులు తహశీల్దార్ కార్యాలయంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షులు మండవ జయంతిబాబు, టీడీపీ నాయకులు మండలంలోని రెవెన్యూ సమస్యలు తదితర అంశాలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ నారాయణరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు,తమ దృష్టికి తీసుకొని వస్తే త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని, మండల గ్రామ రెవెన్యూ అధికారులు తహశీల్దార్ కార్యాలయానికి అందుబాటులో ఉండాలని ఆయన రెవెన్యూ అధికారులకు సూచించారు. వీఆర్వోల సంఘం తరుపున వీఆర్వోలు బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మండవ జయంతిబాబు, గడియపూడి గ్రామ పార్టీ అధ్యక్షులు చింతల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు రెబ్బవరపు ప్రభాకర్, ఆర్ఐ పీవీ రమణయ్య, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

### అమరావతి సభకు భారీగా తరలిన పొన్నలూరు మండల నేతలు, కార్యకర్తలు



**పొన్నలూరు, మే 2, (ప్రభాతవార్త)**
ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా అమరావతి పనులు పున:ప్రారంభ కార్యక్రమానికి పొన్నలూరు మండలం నుంచి స్వచ్ఛందంగా కూటమి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మండల తహశీల్దార్ కార్యాలయం నుంచి అమరావతికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, టీడీపీ నాయకులు మండవ ప్రసాద్, బాలకృష్ణారెడ్డి, తహశీల్దార్ పుల్లారావు, వెంకటేశ్వర్లు, చల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కిశోర్ వికాస్ సమ్మర్ క్యాంపెనింగ్ ఫోగ్రాం కార్యక్రమం



**మద్దిపాడు, మే 2, (ప్రభాతవార్త)**
రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మాత, శిశు సంక్షేమ శాఖ - ఐసీడీఎస్ ప్రాజెక్టు మద్దిపాడు శాఖ ఆధ్వర్యంలో మద్దిపాడు మండలంలోని 18 సచివాలయాలలో కిశోర్ వికాస్ సమ్మర్ క్యాంపెయిన్ ఫోగ్రామం శుక్రవారం ప్రారంభించారు. ఈ నెలలో 15 నుంచి 18 సంవత్సరాల లోపు కిశోర్ బాలికలకు సమ్మర్ క్యాంపెయిన్‌భాగంగా కిశోరి బాలికలకు పర్సనల్ గురించి బాలికలను గ్రూపులుగా ఏర్పాటు చేసి బాలల హక్కుల రక్షణ చట్టాలపై ఆడ పిల్లల పట్ల లింగ వివక్షత అసమానతలు, ఉన్నత విద్య, సైబర్ నేరాల, ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు సాధికారిత, శారీరక వ్యాయామ, క్రీడలు ఆటలో ప్రాముఖ్యతను గురించి అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశం అని సూపర్‌వైజర్ పి.జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం నాడు మద్దిపాడు, రాచవారిపాలెం, వెల్లంపల్లి సచివాలయాల నందు ఈ ఫోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు జయలక్ష్మి, పద్మావతి, నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పథకం రైతులకు ఊతం

**- ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత**



**పొన్నలూరు, మే 2, (ప్రభాతవార్త)**
రైతన్నలు ఉపాధి హామీఈ పథకం కింద 100 శాతం సబ్సిడీతో రైతులకు పండ్ల తోటలు సుస్థిర ఆస్తులకు పునాదులని ఎంపీడీఓ డాక్టర్ సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండ్ల తోటలు, పూలతోటలు సాగు చేయాలనుకునే రైతులకు ఉపాధి హామీ పథకం కింద పంటల సాగుకు ప్రభుత్వం సహాయం చేయనుంది. మార్కెట్లో పండ్లకు మంచి డిమాండ్ ఉండటంతో చాలా మంది రైతులు పండ్ల తోటల సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో అటువంటి రైతులకు ప్రభుత్వం కూడా ఆసరాగా నిలుస్తుంది. ప్రభుత్వ పథకమైన ఉపాధి హామీ కింద సాగు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. ఎవరైనా రైతులు దరఖాస్తు చేసుకున్నందుకు రైతు దృవీకరణ, ఒప్పంద పత్రంతో వెలుగు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

## మండలం నుండి పది బస్సుల్లో

## అమరావతి పునర్ నిర్మాణ సభకు తరలి వెళ్లిన ప్రజలు



**సంతనూతలపాడు, మే 2, (ప్రభాతవార్త)**
సంతనూతలపాడు మండలం నుండి శుక్రవారం నాడు అమరావతి పునర్‌నిర్మాణ సభకు 10 బస్సుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ,కూటమి పార్టీల నేతలు, అభిమానులు, ప్రజలు తరలి వెళ్లారు. పేర్నమిట్ట మినహా మండలంలోని మిగిలిన గ్రామాలకు ఈ బస్సులను ఏర్పాటు చేశారు. సంతనూతలపాడు హైస్కూల్ నుండి ఈ బస్సులను తహశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబులు ఆయా గ్రామాలకు శుక్రవారం ఉదయం పంపించారు. తహశీల్దార్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో మస్సుల్లో వెళ్లే ప్రజలకు వాటర్ బాటిల్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అరటి పండ్లు, మజ్జిగ ప్యాకెట్‌ను అందించారు. మండలంలోని పలు గ్రామాలకు వచ్చిన బస్సులకు సంబంధించి అమరావతి పునర్‌నిర్మాణ సభకు తరలివెళ్లేందుకుగాను విచ్చేసిన ప్రజలకు ఆయా గ్రామాల టీడీపీ నేతలు పులిహోర, దద్దోజనం ప్యాకెట్లను ఏర్పాటు చేశారు. మడల కేంద్రమైన సంతనూతలపాడు నుండి తరలి వెళ్తున్న బస్సుకు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో పులిహోర, దద్దోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో సంతనూతపలాుడ మండలం నుండి ఈ బస్సులు తరలి వెళ్లాయి. వీఆర్వోలు, ఏఎన్ఎంలు, గ్రామాల సర్వేయర్లు, ఒక్కొక్క బస్సులో ఒకరు వంతున అమరావతి పునర్నిర్మాణ సభకు ప్రజలతో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే శాఖ అధికారి కే.గౌస్ భాష, ఎంపీడీఓ డి.సురేష్‌బాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బొడ్డపాటి చంద్రశేఖర్, నాదెండ్ల ఆంజనేయులు, వీఆర్వోలు, కార్యదర్శులు గ్రామాల సర్వేయర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, మండల పరిషత్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ ఆనందాశ్రమ ఏకాదశ వార్షిక మహోత్సవములు




**దొనకొండ,మే 2,(ప్రభాతవార్త)**
ఘనంగా దొనకొండ శ్రీ ఆనందాశ్రమ ఏకాదశ వార్షిక మహోత్సవములు ఘనంగా నిర్వహించారు ఉదయం 6 గంటల నుండి శ్రీ వీరబ్రహ్మ సుప్రభాతం ఎనిమిది గంటల నుండి ఆశ్రమంలో వేచి ఉన్న సకల దేవతలకు పంచామృత అభిషేకాలు ప్రత్యేక అలంకరణలు చేశారు తొమ్మిది గంటల నుండి శ్రీ గోవిందమాంబవీరబ్రహ్మేంద్ర స్వామివార్ల కళ్యాణ మహోత్సవములు అంగరంగ వైభవంగా నిర్వహించారు అన్నప్రసాద వితరణ చేశారు సాయంత్రం 7:00 నుండి ఒంగోలు అచలానంద స్వామివారి ప్రియ శిష్యులు శ్రీ పరిపూర్ణ సిద్ధాంత స్వామి వారి ప్రవచనములు వచ్చిన భక్తులకు నేపాల్ రుద్రాక్ష వితరణ చేయడం జరిగింది రాత్రి 8 గంటల నుండి అచల ఆనంద స్వామి వారి కోలాట బృందం వారిచే కోలాటం బ్రహ్మంగారి నాటకం నిర్వహించినట్లు ఆనందాశ్రమం స్వామీజీ శ్రీ భైరవంద స్వామి తెలియజేశారు .

### వైసీపీ ఒంగోలు పార్లమెంటు పరిశీలకులుగా బ్రహ్మనందరెడ్డిని సత్కరించిన వైసీపీ నేతలు



**సంతనూతలపాడు, మే 2, (ప్రభాతవార్త)**
వైసీపీ ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు గా నియమితులైన బత్తుల బ్రహ్మనందరెడ్డిని శుక్రవారం పేర్నమిట్ట పరిధిలోని అమరావతి నగర్ ప్రాంతంలో గల లింగారెడ్డి అపార్టుమెంట్‌లోని వారి స్వగృహంలో సంతనూతలపాడు జబ్పీటీసీ జిల్లా వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపా చెంచిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు దుంపా యల్లమందారెడ్డి, చీమకుర్తి పట్టణ వైసీపీ అధ్యక్షులు కిష్టపాటి శేఖర్‌రెడ్డి, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు రావూరి శ్రీనివాస్‌రెడ్డి, గుంజి ఏడుకొండలు, కాకి రవి, ఎన్.రాజేష్, తదితరులు పాల్గొని బ్రహ్మనందరెడ్డిని అభినందించిన వారిలో ఉన్నారు.

### కిశోర వికాసం పట్ల తగు జాగ్రత్తలపై పేర్నమిట్టలోని పలు సచివాలయాల్లో అవగాహన



**సంతనూతలపాడు, మే 2, (ప్రభాతవార్త)**
కిశోర వికాసంకు సంబంధించి కౌమర బాలికల సాధికారతపై ఐసీడీఎస్ ఆధ్వర్యం లో వేసవి కాలంలో సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని 40,41,42 సచివాలయాల్లో తగుజాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమా ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు వీటిని పర్యవేక్షించారు. కిషోర వికాసంపై జూన్ 10వ తేదీ వరకు ప్రతిమంగళ, శుక్రవారం లలో కిశోర బాలికలకు బాల్య వివాహాల నివారణ అక్రమ రవాణా, పీవోసీఎస్ఓ చట్టం విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, ఆత్మ రక్షణ, సైబర్ నేరాలు తదితర వాటిపై తగు జాగ్రత్తలకు సంబంధించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమా కిశోర బాలికలకు వివరించారు. మహిళా పోలీసులు షైనీ, సింగమ్మ, అశ్వని, ఏఎన్ఎంలు సరస్వతి, హెలీనా, రమా, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నివారణకు నడుం బిగించండి



**సంతనూతలపాడు, మే 2, (ప్రభాతవార్త)**
కిశోర బాలికలు ముఖ్యంగా బాల్య వివాహాలు నివారణకు పాటుపడాలని సంతనూతలపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.నాగలక్ష్మి కోరారు. సంతనూతపలాడు మండలం గురవారెడ్డిపాలెం సచివాలయం లో శుక్రవారం నాడు ప్రారంభించిన వేసవి ప్రత్యేక కిశోర వికాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. జూన్ 10వ తేదీ వరకు అన్ని సచివాలయం పరిధిలో కిశోర బాలికలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సంరక్షణ తదితర వాటిపై ప్రత్యేక చర్యలపై సూపర్‌వైజర్ నాగలక్ష్మి తన ప్రసంగంలో వివరించారు. ఫోక్సో చట్టం, బాలల హక్కురక్షణ, బాల్య వివాహాలు, రక్తహీనత తగు జాగ్రత్తలు, సైబర్ నేరాలు తదితర వాటిపై సూపర్‌వైజర్ నాగలక్ష్మి కిశోర బాలికలకు తెలియజేశారు. మండలంలోని ఎండ్లూరు, సంతనూతలపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర వికాసంపై కిశోర బాలికలకు తగు జాగ్రత్తలు పట్ల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

# కిషోర్ వికాసంపై అవగాహన



**సంతనూతలపాడు, మే 2, (ప్రభాతవార్త)**
సంతనూతలపాడు మండలం కామేపల్లివారిపాలెం, మంగమూరు, బొడ్డువారిపాలెం గ్రామాల్లో శుక్రవారం నాడు కిషోర్ వికాసం వేసవి కార్యక్రమాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.పార్వతి బాయ్ ప్రారంభించారు. కిషోర్ బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సంరక్షణ, తగు పౌష్టికాహారం, బాల్య వివాహాలు నివారణ, ఆన్‌లైన్ నేరాలు, తదితర వాటిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతిబాయి కిషోర్ బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచ్లు, కిషోర్ బాలికలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

**- సిడిపివో యం.పద్మవతి**



**యర్రగొండపాలెం,మే 2,(ప్రభాతవార్త)**
రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసం-వేసవి శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అందులో బాగంగా యర్రగొండపాలెం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో యర్రగొండపాలెం పట్టణంలోని ఇజ్రాయిల్‌పేటలోని ప్రబుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సిడిపివో యం.పద్మవతి అధ్యక్షతన జరిగిన కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం శుక్రవారం నుండి ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమె మాట్లాడుతూ కిశోరి వికాసం తరగతులను ప్రభుత్వ ఆదేశాలమేరకు మే02,జూన్10,వరకు నిర్వహించడం జరుగుతుందని అమె తెలిపారు.11నుండి 18 సంవత్సరాలలోపు బాలికలకు శిక్షణ తరగతు ఏర్పాటు చేయడం జరిగింది.బడిలో చదువుతన్న వారికి బడి బయట ఉన్నపిల్లలకు ఈ వేసవిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఈశిక్షణలో ప్రభుత్వం వారు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం వివిధ అంశాలలో బాలికలకు బలోపేతం చేయాడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందనిఅన్నారు.శిక్షణకార్యక్రమ వివరాలు మే02న బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం,లక్ష్యాలు నిర్ధారించుకోవడం,మే06,రుతుక్రమంపరిశుభ్రత మరియు లైంగిక విద్య,మే9, పువరుత్పత్తి ఆరోగ్యం-బాల్యవివాహాల వన కలిగే దుష్ప్రభావాలు,మే13,బాలల హక్కులు రక్షణ పిఓసిఎస్ఒ చట్టం గురించి అవగాహన,మే16,కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మే16,కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మే20 అడపిల్లల పట్ల లింగ వివక్ష మరియు అసమానతలు,మే23,ఉన్నత విద్య,నైపుణ్యాలు మరియు కెరీర్‌మార్గదర్శకత్వం, మే27,సైబర్‌నేరాలు,ఆన్లైన్ భద్రత మరియు వివిధ సమస్యలను ఎదుర్కోవడం, మే30,ఆర్థిక అంశాల నిర్వహణ మరియు పొదుపు,జూన్3,కౌమార బాలికల నాయకత్వం మరియు సాధికారత,జూన్6 శారీరకవ్యాయామం,క్రీడలు మరియు ఆటల ప్రాముఖ్యత,జూన్ 10,బాల్య వివాహాలు వలన కలిగే దష్ప్రభావాలు మరియు నివారణ వంటి ఆంశాలపై శిక్ష ఇవ్వడం జరుగుతుందని శిక్షణలో మహిళ పోలీస్,యంపిహెచ్‌డబ్యూ,ఎన్‌యం,అంగన్‌వాడీకార్యకర్తలు,వివో,వివోఎ,లు శిక్షణకార్యక్రమం లో పాల్గొంటారని అమెతెలిపారు.ఈకార్యక్రమంలో యంఇవో పి.ఆంజనేయులు,డాక్టర్ కోటనాయక్, మహిళపోలీస్,ఎఎన్‌ఎం,వివో,వివోఎలు,అంగన్‌వాడీకార్యకర్తలు,కిశోరిబాలికలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



**సంతనూతలపాడు, మే 2, (ప్రభాతవార్త)**
సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 3న శనివారం ఉదయం 10 గంటల 30 నిమిషములకు సంతనూతలపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ డి.సురేష్‌బాబు తెలిపారు. ఈ సమావేశానికి సంతనూతలపాడు ఎంపీపీ, బుడంగుంట విజయ అధ్యక్షత వహించ నున్నారు.ఈ సమావేశంలో పలు రంగాల అభ్యున్నతిపై సమీక్షించనున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలంలోని ప్రభుత్వ శాఖల అధికారులు, కార్యదర్శులు హాజరు కావాల్సిందిగా ఎంపీడీఓ సురేష్‌బాబు కోరారు.

## రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి



**యర్రగొండపాలెం,మే 2,ప్రభాతవార్త**
రైతులు తమ పోలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.వి.శేషారెడ్డి శుక్రవారం తెలిపారు. యర్రగొండపాలెం మండంలోని పందివానిపల్లె గ్రామంలో జరిగిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలంలోనిపోషక విలువలను తెలుసుకోవడం వలన పంటకు వాడవలసిన స్దూల మరియు సూక్ష్మపోషకాలు ఎంతమోతాదులో అవసరమో తెలుసుకొని తగిన మోతాదులో ఎరువులు వాడటం తక్కువ ఖర్చుతో ఎక్కువ పంట దిగుబడి పొందవచ్చని ఆయన తెలిపారు. పంట నమున సేకరించే సమయంలో ముఖ్యంగా చెట్లక్రింద, గట్ల ప్రక్కన కంచెల దగ్గర పశువుల ఎరువు మరియు కాలిబాటల దగ్గర నమూనా తీయరాదని అలాగే చౌడు భూముల్లో నమోనాలను విడిగా తీసి సాధరణ భూమి మట్టితో కలపరాదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎల్ మాలాద్రిరెడ్డి, సిబ్బంది రైతులు, పాల్గొన్నారు.

### ఆంధ్రరాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతికి బయలు దేరిన తెలుగు తమ్ముళ్లు



**యర్రగొండపాలెం,మే 2,ప్రభాతవార్త**
ఆంధ్రరాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి సభకి యర్రగొండపాలెం నియోజకవర్గం నుండి భారిగా శుక్రవారం తరలి వెళ్లినారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రం వలన గడిచిన ఐదేళ్లలో ప్రజలు ఎన్నో అవమానాలకు గురయ్యారని, తిరిగి ఈ రోజు అమరావతి పనులు ప్రారంభము కావటంతో గర్వంగా భావిస్తూనా ్నమని అందుకు పార్టీ నేతలు పెద్ద ఎత్తున బయలు దేరి వెల్తుమాన్నారు. ఈ కార్యక్రమంలో చేకూరి సుబ్బారావు, యం.మత్రునాయక్, కంచర్ల సత్యనారయణగౌడ్, శ్రీశైలపతినాయుడు, చేవుల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రేపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవం

**సింగరాయకొండ,మే 2,ప్రభాతవార్త**
పట్టణంలోని మండల కాంప్లెక్స్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆదివారం ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ప్రారంభించనున్నట్లు సింగరాయకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నెబోయిన శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటన లో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మరియు ప్రకాశం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి టి.రాజశేఖర్ రావు, హైకోర్టు న్యాయమూర్తులు డాక్టర్ జస్టిస్ కె మన్మధరావు, జి రామకృష్ణ ప్రసాద్, డాక్టర్ జస్టిస్ వై లక్ష ్మణరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి మరియు జిల్లాలోని అన్ని కోర్టుల న్యాయాధికారులు పాల్గొంటారని తెలియజేశారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో స్కాలర్ షిప్ పరీక్ష

**సింగరాయకొండ, మే 2,ప్రభాతవార్త**
మండలంలోని కనుమల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మలినేని లక్ష ్మయ్య కాలేజీ క్యాంపస్ లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో స్కాలర్షిప్ పరీక్షను ఆదివారం ఉదయం 10 నుండి 11.30 వరకు నిర్వహించనున్నట్లు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం శుక్రవారం ఓ ప్రకటన లో తెలిపింది. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కు మొదటి బహుమతి ట్యాబు, రెండవ బహుమతి మొబైల్, మూడవ బహుమతి స్మార్ట్ వాచ్ బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష లో మెరిట్ సాధించిన విద్యార్థుల కు 100!!స్కూల్ ఫీజు మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఈ పరీక్ష కు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కలదని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.


### మోడీ పర్యటన నేపద్యంలో పుట్టవారిపాలెం కూడలిలలో వాహనాల దారి మళ్ళింపు



**సంతమాగులూరు, మే 2, ప్రభాతవార్త**
రాష్ట్ర రాజదాని అమరావతి పునర్నిమాణ శంఖు స్తాపన కార్యక్రమానికి ప్రదాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటన, రాష్ట్ర ప్రభుత్వం కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ ప్రతిస్టాత్మకంగా జరిపిన నేపద్యంలో శుక్రవారం బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం పుట్టవారి పాలెం కూడలిలలో సరకు రవాణా వాహనాలను దారిమళ్ళించారు. సంతమాగులూరు సీఐ కె.వెంకట్రావు ఆద్వర్యంలో పోలీసు సిబ్బంది కర్నూలు - గుంటూరు రహదారిలో ప్రయాణించే సరకుల రవాణా వాహనాలను అద్దంకి, మేదరిమెట్ల చీరాల మీదుగా వెళ్ళేవిదంగా దారి మళ్ళించారు. ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 7.30 గంటల వరకు వాహనాలను దారి మళ్ళించారు.

## సంతమాగులూరు మండలంలో ఈదురు గాల్పుల బీభత్సం

### - పడిపోయిన విద్యుత్ స్తంభాలు- కుప్పకూలిన బొప్పాయి తోటలు





**సంతమాగులూరు మే 2 ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలంలో శుక్రవారం వేకువ జామున వీచిన ఈదురు గాల్పులు బీభత్సం సృష్టించాయి. సంతమాగులూరు, పాతమాగులూరు, పుట్టవారిపాలెం, కామేపల్లి, ఏల్చూరు, మిన్నెకల్లు ప్రాంతాలలో వీచిన గాల్పులకు పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడగా, పలు గ్రామాలలో పండ్ల తోటలు ముఖ్యంగా బొప్పాయి తోటలు నేలమట్టమయ్యాయి. ఎకరా బొప్పాయికి లక్షరూపాయలకు పైగా నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు.

## ప్రధాని సభకు భారీగా తరలివెళ్లిన కూటమి నేతలు



**తాళ్లూరు, మే 2 ,ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో అమరావతి పునః ప్రారంభోత్స వ కార్యక్రమానికి వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ సభకు తాళ్లూరు మండలం నుంచి భారీగా నాయకులు, మహిళలు తరలివెళ్లారు. దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌ల ఆధ్వర్యంలో ఐదు బస్సుల్లో మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణం నుంచి ఈ బస్సులకు మండల టీడీపీ అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఓబులరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, తదితరులు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ప్రధానమంత్రి సభకు వెళ్లడం ఆనందంగా ఉందని మహిళలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాగం కొండారెడ్డి, ఇడమకంటి శ్రీనివాస్‌రెడ్డి, గొల్లపూడి వేణుబాబు, మానం రమేష్‌బాబు, రాచకొండ వెంకట్రావు, పెద్ద కాలేషా వలి, చాట్ల దాని, క్రైపు రామకోటిరెడ్డి, కే.రామయ్య, లక్ష్మీ నారాయణ, మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### శ్రీసీతా సమేత రామచంద్రస్వామికి ఘనంగా పూజా కార్యక్రమాలు



**పొన్నలూరు, మే 2, ప్రభాతవార్త**
మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం శ్రీ సీతా రామ చంద్ర స్వామి వారికి ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు శతవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణంతో, జై శ్రీరామ్, జైజై మనుమాన్ వంటి కీర్తనలతో గుడి ప్రాంగణంలో భక్తులు భజనలతో కీర్తనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని భక్తులు, గ్రామంలోని ప్రజలు ఆలయ కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గిద్దలూరు పట్టణంలో ఆధార్ కేంద్రం ప్రారంభం



**గిద్దలూరు, మే 2, ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలోని రాచర్ల గేట్ సమీపంలో ఉన్న సెయింట్ పాల్స్ పాఠశాల ఆవరణలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సిటీ సంస్థ ఆధ్వర్యంలో ఆధార్ సేవా కేంద్రాన్ని శుక్రవారం మండల విద్యాశాఖ అధికారులు కావడి వెంకటేశ్వర్లు, నాగభూషణ్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిటీ సంస్థ ప్రజల సౌకర్యార్థం ఆధార్‌సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అమరావతికి భారీగా తరలిన మహాకూటమి కార్యకర్తలు



**బల్లికురవ, మే 2, ప్రభాతవార్త**
అమరావతి పునర్నిర్మాణ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుండి భారీగా మహాకూటమి కార్యకర్తలు తరలి వెళ్లారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సు లు కాకుండా స్వచ్ఛందంగా వాహనాలు ఏర్పాటు చేసుకుని కార్లు, మినీ వ్యాన్లలో భారీగా తరలి వెళ్లారు. ఉదయం 9గంటల నుండి గ్రామాల్లోని కార్యకర్తలు బస్సులో బయలు దేరి వెళ్లారు. బస్సులలో వారికి ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో ముందుకు సాగగా, స్వచ్ఛందంగా తరలిన వారికి కార్యకర్తలే వాలంటీర్లుగా సేవలందిస్తూ ముందుకు సాగారు. బస్సు తరలి వెళ్లే వరకు ఎంపీడీఓ కుసుమకుమారి, తహశీల్దార్ రవి నాయక్, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేస్తూనే ఉన్నారు. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఏర్పాటు చేసిన ఆహార సదుపాయాలు కార్యకర్తలకు ఎంతగానో ఉపకరించాయి.

## వస్త్రాలంకరణ కార్యక్రమానికి హాజరైన కరణం



**బల్లికురవ, మే 2, ప్రభాతవార్త**
ఒంగోలులోని ఐటీఏ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి చీరాల వైకాపా ఇన్‌ఛార్జీ కరణం వెంకటేష్‌బాబు హజరయ్యారు. పోతినేని కిరణ్ కుమార్, రమ్య శ్వేత కుమారుడు కార్తికేయ చౌదరి, కుమార్తె వేదశ్రీ సాయిలను సందర్భంగా వెంకటేష్‌బాబు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక నేతలు ఉన్నారు.

# అన్ని దారులు అమరావతి వైపే

### - సంతమాగులూరు మండలం నుండి భారీగా తరలిన కూటమి కార్యకర్తలు



**సంతమాగులూరు, మే 2, ప్రభాతవార్త**
రాష్ట్ర రాజదాని అమరావతి పునర్నిమాణ శంఖు స్తాపన కార్యక్రమానికి ప్రదాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటన, రాష్ట్ర ప్రభుత్వం కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ ప్రతిస్టాత్మకంగా జరిపిన నేపద్యంలో శుక్రవారం బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం నుండి కూటమి కార్యకర్తలు బారీగా తరలి వెళ్ళారు. అదికారులు ముందస్తు ప్రణాళిక ప్రకారం మండల పరిషత్ అబివృద్ది అదికారి జ్యోతిర్మయి సిబ్బందికి గ్రామాల వారిగా బాద్యతలు అప్పగించడంతో సకాలంలో ఏర్పాట్లు పూర్తికావడంతో యువకులు, మహిళలు సైతం తరలి వెళ్ళారు. సంతమాగులూరు వ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షులు తేలప్రోలు రమేష్, సంతమాగులూరు మండల నాయకులు చేవూరి వాసురెడ్డి, అట్లా పెద్ద వెంకటరెడ్డి, దుద్దేల చిన్నగాలయ్య, మండల సర్పంచుల సంఘ అద్యక్షులు సన్నెబొయిన గురుబ్రహ్మం, ఆలూరి శ్రీనివాసరావు, చింతారామారావు, చింతా శ్రీదర్‌బాబు, డీసీ అద్యక్షులు కామాను శ్రీనివాసరావు, కంచేటి మురళి, తేలప్రోలు వెంకట్రావు, మండల పార్టీ అద్యక్షులు గాడిపర్తి వెంకట్రావు, గుండపునేని సురేష్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూపాటి ఏసోబు, మాజీ ఎంపీపీ సన్నెబొయిన ఏడుకొండలు, బోతాదు భాషా, అఫీజ్ , పసుపులేటి కోటేశ్వరరావు, వంకాయల పాటి హరిబాబు, ముప్పాళ్ల శ్రీనుబాబు, మర్లపాటి రాజశేఖర్ ,కందిమళ్ల శ్రీను, పెరుమాళ్ల వీరయ్య, మక్కెన జగదీష్, మక్కెన శ్రీనివాసరవు, గొట్టిపాటి చౌదరిబాబు, గంద్రు వీరబ్రహ్మం, మాగులూరి సోమేశ్వరరావు, నిడమానూరి కోటేవ్వరరావు, చావా వెంకటేశ్వర్లు, పరిటాల వెంకయ్య, రావిరేకల కాశీవిశ్వనాదం, షేక్ బోడే, చల్లా కోటేశ్వరరావు, చల్లా వెంకట కృష్ణ, జిర్రా విజయబాబు, ప్రత్తి పాటి వీరయ్య , జనసేన నాయకులు చల్లా వెవకట కృష్ణ ల ఆద్వర్యంలో కూటమి కార్యకర్తలు బారీగా తరలి వెళ్ళారు.

## పునర్నిర్మాణ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి



**బల్లికురవ, మే 2, ప్రభాతవార్త**
అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభలో సహచర మంత్రులు, ప్రజా ప్రతినిధులతో కలిసి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సందడి చేశారు. అంతే కాకుండా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి మయలుదేరిన కార్యకర్తల క్షేమ సమాచారాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ స్వీయ పర్యవేక్షణ కొనసాగించారు. వ్యక్తిగత సహాయకులు సారధి, శ్రీనివాసరావులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ, సభకు వచ్చే వారికి ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



**కొనకనమిట్ల, మే 2, ప్రభాతవార్త**
పొదిలి మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో దాసరిగడ్డలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జి.కృష్ణ పర్యవేక్షించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటి ఇంటికి తిరిగి నీటి తొట్లు, డ్రమ్ములను, నీటి పాత్రలను పరిశీలించారు. నీరు నిల్వలు ఎక్కువ కాలం ఉండకుండా వారానికి ఒక సారి శుభ్రం చేసి ఆరబెట్టుకోవాల్సిందిగా తెలియజేశారు. ఇంటి ఆవరణలో పనికి రాని టైర్లు, కుండలు, రోలు, తాగి పడేసిన కొబ్బరిబోండాలు ఉంటే తొలగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు కే.విజయ, ఎన్.రాణి, ఆశాలు, ప్రజలు పాల్గొన్నారు.

## కిశోర్ బాలికలు వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి



**కొనకనమిట్ల, మే 2, ప్రభాతవార్త**
కిశోర్ బాలికలు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి ఎస్పీ బాలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఏఏ ప్రాథమిక పాఠశాలలో పొదిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిశోర్ వికాసం వేసవి శిబిర ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, శరీర మార్పులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పొదిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సుధా మారుతి మాట్లాడుతూ శుక్రవారం నుంచి ప్రారంభమైన కిశోర్ వికాసం శిబిరాలు జూన్ 10వ తేదీ వరకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో జరుగుతాయన్నారు. బాలికల్లో విద్య నైపుణ్యం, పోటీతత్వం వ్యక్తిగత పరిశుభ్రత, విజ్ఞానం పెంపొందింపు తదితర 12 అంశాలపై అవగాహన కలిగించడం జరుగుతుందని మహిళా పోలీసు కన్వీనరుగా, ఆశా అంగన్‌వాడీ ఆరోగ్య కార్యకర్తలు సభ్యులుగా ఉంటారన్నారు. తొలుత కిశోర్ వికాసం వేసవి శిబిరాల కరపత్రాలు, గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీదేవి, అంగన్‌వాడీసూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఏఎన్ఎంలు భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతికి బయలు దేరిన బస్సులు



**మార్టూరు, మే 2, ప్రభాతవార్త**
మార్టూరు మండల వ్యాప్తంగా శుక్రవారం అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి వెళ్లారు. పార్టీ నాయకులు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. జై అమరావతి అంటూ నినాదాలు చేస్తూ యువత, డ్వాక్రా సంఘాల మహిళలు తరలి వెళ్లారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

### కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి : సిడిపిఓ బి జ్యోతి



**గిద్దలూరు, మే 2 ,ప్రభాతవార్త**
కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకొని మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని ఐసిడిఎస్ ఇన్చార్జి సిడిపిఒ బి జ్యోతి అన్నారు. గిద్దలూరు ప్రాజెక్టు పరిధిలోని కోటగడ్డ సచివాలయం పరిధిలోని కిషోర బాలికలకు ఇన్చార్జి సిడిపిఒ బి జ్యోతి అధ్యక్షతన కిషోర వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్చార్జి సిడిపిఒ బి జ్యోతి మాట్లాడుతూ ఈ కార్యక్రమం మూడు మండలాలలోని అన్ని సచివాలయాల్లో ఉన్న బాలికలకు స్పెషల్ క్యాంపులు మీటింగ్‌లు ప్రతి వారంలో రెండు రోజులు (మంగళవారం, శుక్రవారం) నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కిషోర బాలికలకు లింగ వివక్షత, సంపూర్ణ ఆహారము, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత రుతుస్రావు, పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుండి రక్షణ, బాల్య వివాహాలను అరికట్టుట, మానవ అవగాహన కల్పించడం కోసం ఈ సమ్మర్ స్పెషల్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి, ఏఎన్ఎం, ఆర్‌పిలు, అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు, పిల్లలు పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం

### వార్షిక బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా



**కంభం రూరల్, మే 2, ప్రభాతవార్త**
కంభం పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్స వ కార్యక్రమంలో గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం వైఎస్సార్ కాంగ్రేస్ పార్టీ ఇన్చార్జి అన్నా వెంకట రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు అన్నారాంబాబుకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అన్నా రాంబాబుకు అందజేశారు. హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. అన్నా రాంబాబు వెంట పలువురు నాయకులు ఉన్నారు.

## కొత్తూరు అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం

### - భయాందోళనలో గ్రామాల ప్రజలు







**అర్ధవీడు, మే 2, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం కొత్తూరు, వీరభద్రాపురం గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం కలకలం రేపుతుంది. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు పెద్దపులి సంచార ప్రదేశాన్ని శుక్రవారం సందర్శించి పెద్దపులి కాలి ముద్రలను పరిశీలించారు. పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించి త్వరలోనే వార్ప్ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పెద్దపులి సంచరిస్తున్నట్లు తెలుసుకున్న కొత్తూరు, వీరభద్రాపురం గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామాలలోని పశువుల కాపరులు, ప్రజలు పొలాలకు వెళ్ళాలంటే భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు నిఘా ఏర్పాటు చేసి పెద్దపులి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత




**రాచర్ల, మే 2 ,ప్రభాతవార్త**
మండలంలోని అనుములవీడు గ్రామానికి చెందిన కె.అనూఫ్ ఏప్రిల్ 30వ తేదీన రాచర్ల అనుములవీడు గ్రామాల మధ్య తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. మొబైల్ పోగొట్టుకున్న విషయాన్ని రాచర్ల పోలీస్ స్టేషన్‌లో మే 1వ తేదీన ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఎస్సై పి.కోటేశ్వరరావు సాంకేతిక పరిజ్ఞానంతో మిస్ అయిన మొబైల్‌ను కనుగొని శుక్రవారం బాధితునికి అందజేశారు. మొబైల్ ఫోన్ మిస్ అయిన విషయాన్ని తెలియజేసిన వెంటనే స్పందించి ఒక్కరోజులోనే మొబైల్ ఫోన్ కనుగొని తనకు అప్పగించిన ఎస్సై కోటేశ్వరరావుకు స్థానిక పోలీసులకు బాధితుడు అనూఫ్ కృతజ్ఞతలు తెలిపారు.

## బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరిత్యా నేరం



**కొండపి, మే 2, ప్రభాతవార్త**
బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరిత్యా నేరమని, బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిడిపిఓ మాధవీలత తెలిపారు. శుక్రవారం కొండపి గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు, బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ సూపర్ వైజర్ విక్టోరియా రాణి మాట్లాడుతూ బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కిశోర బాలికలకు 15సంవత్సరాల నుండి 18సంవత్సరాల బాలికలు సమ్మర్ క్యాంపులు ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిలో భాంగంగా గ్రామాలలో ఎంఎస్‌కె కన్వీనర్‌గా కమిటీ ఏర్పాటు చేసి ఆ గ్రామాలలో ఉన్న 15 నుంచి 18సంవత్సరాలలోపు బాలికలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మే 2వ తేదీ నుంచి ప్రతి మంగళవారం, ప్రతి శుక్రవారం బాలికలను పిలిచి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. శుక్రవారం అన్ని గ్రామాలలోఓ ఎంఎస్‌కెలు అంగన్ వాడీ కార్యకర్తలు సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. జూన్ 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు



**కొండపి, మే 2 ,ప్రభాతవార్త**
మండలంలోని కె ఉప్పలపాడు శివాలయంలో ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను శుక్రవారం అర్చకుడు రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు రాఘవేంద్ర శర్మ మాట్లాడుతూ శ్రౌత, స్మార్తక కర్మలను పునరుద్ధరించి వైదిక మతాన్ని పునఃస్థాపితం చేయడానికి స్వయంగా శంకరుడే భూమిపై అవతరించారన్నారు. ఆ వైదిక ధర్మాన్ని ప్రతిష్టించి నిరంతరంగా కొనసాగడానికి అసేతుహిమాచలం వరకు కాలినడకన మూడు పర్యాయాలు పర్యటించి దేశానికి నలువైపులా నాలుగు పీఠాలను స్థాపించిన మహనీయుడు శంకరాచార్యులు అని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ న్యాయవాది వాకా వెంకట నరసింహారెడ్డి, మాజీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్ష - మట్టి నమూనా సేకరణ కార్యక్రమం



**త్రిపురాంతకం, మే 2 ప్రభాతవార్త**
మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారిణి కె నీరజ ఆధ్వర్యంలో భూసార పరీక్ష - మట్టి నమూనా సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారిణి కె నీరజ మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్షల యొక్క ఆవశ్యకత గురించి తెలియజేశారు. "సాయిల్ హెల్త్ కార్డ్ (ఎస్‌హెచ్‌సి)" ఫలితాల ఆధారంగా రైతులు తమ పొలాలలోని స్థూల మరియు సూక్ష్మ పోషక విలువలతో పాటుగా సేంద్రీయ కార్బనం ఎంత మోతాదులో ఉన్నాయో, ఎంత మోతాదులో వాడాలో తెలుసుకుని అనువైన పంట ఎంచుకొని తక్కువ పెట్టుబడితో అవసరమైన మోతాదులో ఎరువులు వాడి పెట్టుబడి ఖర్చు తగ్గించుకొని అధిక దిగుబడుటు పొందవచ్చని తెలియజేశారు. 2025-26 సంవత్సరానికి ఒకొక్క రైతు సేవా కేంద్రం పరిధిలో 56చొప్పున 1,169మట్టి నమూనాలు మండల లక్ష్యంగా కేటాయించారని తెలిపారు. రైతు సోదరులు ఈ అవకాశంను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం క్షేత్రస్థాయిలో మట్టి నమూనా తీయు విధానము గురించి సిబ్బందికి మరియు రైతులకు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ డి ధనేశ్వర్ నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు అచ్యుతరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## అమరావతి పునః ప్రారంభ సభ ఘనవిజయానికి

### కృషి చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు

### - ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు, మే 2 ,ప్రభాతవార్త**
దేశ ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతిలో శుక్రవారం నిర్వహించబడిన పునఃప్రారంభ సభ అఖండ విజయవంతంగా ముగిసిందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు నియోజకవర్గం నుండి కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ పునఃప్రారంభ సభను విజయవంతం చేశారని, ఈ సందర్భంగా సభలో పాల్గొన్న ప్రతిఒక్క నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పునఃప్రారంభ సభకు మద్దతు తెలిపి విజయవంతానికి సహకరించిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు, అభిమానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం

### - ప్రిన్సిపాల్ పెద్దిరాజు



**యర్రగొండపాలెం రూరల్,మే 2,ప్రభాతవార్త**
2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి, గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 3వ తరగతి,నుండి 9వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ,బి పెద్దిరాజు తెలిపారు .ఏపి గిరిజన సంక్షేమ పాఠశాల పిటిజి బాలుర యర్రగొండపాలెం పాఠశాలలో 3వ తరగతి నుంచి 9వ తరగతి ప్రవేశాలకు ధరఖాస్తులను ప్రిన్సిపాల్ పెద్దిరాజు కోరుతున్నారు ...3వతరగతిలో 80 సీట్లు ,4 వతరగతిలో 27 సీట్లు ,5 వతరగతిలో 26 సీట్లు, 6 వతరగతిలో 27 సీట్లు,7 వతరగతిలో 34 సీట్లు,8 వతరగతిలో 22 సీట్లు,9 వతరగతిలో 22 సీట్లుఖాళీగా ఉన్నాయని ఖాళీ సీట్లకు అర్హులైన విద్యార్థుల నుంచిదరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. మరిన్ని వివరాల కోసం గురుకుల పాఠశాలల పనిదినాల్లో సంబంధిత సిబ్బందిని సంప్రదించవచ్చునని డాక్టర్ పెద్దిరాజు తెలిపారు.

## వధూవరులను ఆశీర్వదించిన వైసీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల



**కనిగిరి, మే 2, ప్రభాతవార్త**
కనిగిరిలోని షాదీఖానాలో జరిగిన సయ్యద్ ఇస్మాయిల్- సహనాజ్ బేగం కుమారుడు మహమ్మద్ ఫయాజ్,సాజిద వివాహ మహోత్సవంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం పాల్గొని వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దద్దాల రాములు, వెలిగండ్ల కో ఆప్షన్ సభ్యులు డాక్టర్ ఎస్‌ఎస్ హమీద్, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సైకం ఏడుకొండలరెడ్డి, చింతం శ్రీను, సుందర్, కలికాయ నారాయణ, దేవిరెడ్డి వెంకట స్వామిరెడ్డి, మున్నా తదితరులు పాల్గొని కొత్త దంపతులకు ఆశీర్వాదాలు అందజేశారు. వివాహ వేడుక ఘనంగా జరగగా, స్థానికులు, బంధువులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## వర్ష ప్రభావిత బాధితుల సమస్యలు తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



**కనిగిరి, మే2, ప్రభాతవార్త**
కనిగిరిలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని బోయపాలెంలో వర్షపు నీరు రహదారుల పైకి, ఇళ్లల్లోకి ప్రవహించడంతో ఇబ్బందులు పడ్డ స్థానిక ప్రజలు, మున్సిపల్ అబ్దుల్ గఫార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ వెంటనే శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, సిబ్బందితో కలిసి బోయపాలెంకు వెళ్లి స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోయపాలెంలో ఓ వైపు మాత్రమే డ్రైనేజీ కాలువ ఉండడంతో వర్షపు నీరు ప్రవహించే అవకాశం లేక ఇళ్లల్లోకి ప్రవహిస్తుందని, స్థానికంగా ఉన్న పెద్ద డ్రైనేజీ కాలువలో వర్షపు నీరు ప్రవహించే అవకాశం లేక అవి కూడా ఇళ్లలోకి చేరుతున్నాయని స్థానికులు మున్సిపల్ చైర్మన్‌కు వివరించారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, బోయపాలెంలో మరో వైపు కూడా డ్రైనేజీ కాలువ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా అక్కడ ప్రవహిస్తున్న మట్టి కాలువకు కూడా మరమ్మత్తులు చేపట్టి, ఐదు అడుగుల లోతు వరకు కాలువలో పూడిక తీత పనులు చేపడతామన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు.

## పాఠశాల విధానాల్లో విద్యా వ్యవస్థలకు వ్యతిరేకంగా ఏపీ టీచర్స్ ఫెడరేషన్ నిరసన




**కనిగిరి, మే 2, ప్రభాతవార్త**
ప్రాథమిక విద్యా వ్యవస్థలో అమలవుతున్న అన్యాయ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మే 5న ఉదయం 10గంటలకు కనిగిరి తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్, రాష్ట్ర ప్రతినిధి పి.రాజకుమార్ తెలిపారు. ఈ విషయాన్ని గురువారం సాయంత్రం కనిగిరి మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ప్రాథమిక పాఠశాలల్లో మొదటి తరగతి నుండి ఐదవ తరగతి వరకు నిర్వహించాల్సిందిగా, ప్రతి పాఠశాలలో కనీసం రెండు ఉపాధ్యాయులుండేలా చేయాలని కోరారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల పేరుతో తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కొనసాగించాలని, మొదటి నుంచి ఐదవ తరగతులు ఉన్న విద్యార్థులను ఉన్నత పాఠశాలలకు కలుపుతున్న ఆదేశాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్య నలభై దాటిన చోట రెండవ విభాగం ఏర్పాటు చేయాలని, ప్రతి ముప్పై ఐదు మందికి అదనపు విభాగాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు విడతల జీత భత్యాలను విడుదల చేయాలని, పదకొండవ జీత సవరణ బకాయిలను చెల్లించాలన్నారు. దీంతో పాటు పదకొండవ జీత సవరణ ప్రకటనను వెంటనే విడుదల చేయాలని, మధ్యంతర భృతి ముప్పై శాతం చెల్లించాలని, పింఛన్ వ్యవస్థలో జరుగుతున్న అన్యాయాలను సరి చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ జోన్‌కు చెందిన ఆరు మండలాల శాఖ ప్రతినిధులు, సభ్యులు, మద్దతు దారులు, మాజీ జిల్లా నాయకులు హాజరై ఉద్యమానికి బలం చేకూర్చాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు కేవీ సుబ్బయ్య, షేక్‌ఖాసిన్, కే.రామ్మోహన్, పి.మాలకొండయ్య, ఎస్‌వీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆయుష్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా డాక్టర్ గద్దె ఏడుకొండలు నియామకం

### - పలువురు ప్రశంసలు



**పామూరు, మే 2, ప్రభాతవార్త**
పామూరు మండలం కంభాలదిన్నె ఆయుర్వేద ప్రభుత్వ డాక్టర్ అయిన గద్దె ఏడుకొండలను జిల్లా ఆయుష్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. పామూరు పట్టణానికి చెందిన గద్దె ఏడుకొండలు కంభాలదిన్నెలో ప్రభుత్వ వైద్యుడిగా పని చేస్తూ ఆయుర్వేద అనుభవాలతో వైద్యశాలకు వచ్చే వారితో కలుపుగోలు తనంతో ఉండటమే కాకుండా ఎన్నో ఉచిత క్యాంపులు నిర్వహించి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. పామూరు గ్రామానికి చెందిన గద్దె ఏడుకొండలు చిన్నతనంలో నిరుపేద కుటుంబంలో పుట్టి లక్ష్యంతో ముందుకు సాగి ఆయుర్వేద వైద్యులుగా పేరు గాంచారు. తన ఇద్దరు కుమారులను ఎంబీబీఎస్‌లో చేర్పి పట్టా తీసుకోవడం జరిగింది. పామూరు లో కార్పొరేట్ వైద్యశాలను నిర్మించి ప్రజలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఉన్నట్లు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ తెలుగుదేశం పార్టీ ఫోర్ మెన్ కమిటీ మెంబరు ఉప్పలపాటి హరిబాబు, టీడీపీ నాయకులు బండ్లా నారాయణ, వాయినేని మాధవ, ఇర్రా సత్యనారాయణ శుక్రవారం నాడు ఏడుకొండలును సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు.

## స్వయం కృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

### - ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు




**పామూరు, మే 2, ప్రభాతవార్త**
పామూరు పరిసర గ్రామాల నుండి ప్రజలు వివిధ పనుల నిమిత్తం పామూరు వస్తుంటారు. వేసవి కాలం దృష్ట్యా వాళ్ళందరికి ఉచిత చల్లని మజ్జిగ ఇవ్వాలని ఉద్దేశంతో స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో స్థానిక సీఎస్‌పురం రోడ్డులో ఉచిత చల్లని మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు హాజరై మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు మాట్లాడుతూ డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ స్వయం కృషి సేవా సంస్థను స్థాపించి ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద ప్రజలకు అన్నదానాలు విద్యా సహాయ సహకారాలు అందిస్తూ మంచి ఉన్నతమైన ఆశయాలతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఇలాంటి వారికి మనందరం తోడుగా ఉండి సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో దూబగుంట సర్పంచ్ కందుల శ్రీనివాసులురెడ్డి, వగ్గంపల్లి సర్పంచ్ సుబ్బయ్య, పట్టణ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ హాజీ గౌస్, ఫత్తు మస్తాన్, ఫిష్ హజరతయ్య, ఖాజీ ఖాదర్ భాషా, సీపీఐ మండల కార్యదర్శి పోతుల ప్రభాకర్, వార్డు సభ్యులు పిడుగు శ్రీనివాసులు, రిటైర్డ్ ఆర్మీ నాగేశ్వరరావు, పవన్ కుమార్, పల్లా శివయ్య, శేషం మోషే, సంస్థ సభ్యులు సోమిశెట్టి సత్యనారాయణ, సయ్యద్ జిలానీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వేసవి బాస్కెట్ బాల్ శిక్షణా శిబిరం



**పామూరు, మే 2, ప్రభాతవార్త**
స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సెయింట్ మార్క్స్ ఇంగ్లీషన మీడియం స్కూల్ వేదికగా ఉచిత వేసవి శిక్షణా శిబిరం ప్రారంభమైంది. ఈ ప్రారంభ కార్యక్రమానికి ఒంగోలు నుండి హర్షిణి ఆంజనేయులు ముఖ్య అతిధిగా శిబిరంను ప్రారంభించారు. ఈ వేసవి శిబిరం ఈ నెల 2నుంచి 31వ తేదీ ఉదయం 6గంటల నుండి 8గంటల వరకు సాయంత్రం 5గంటల నుండి 7గంటల వరకు శిక్షణ ఇవ్వబడును. ఈ అవకాశంను విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సెయింట్ మార్క్స్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.జయకుమార్, ఏడుకొండలు, సెయింట్ మార్క్స్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## దాచూరి స్మారకోపన్యాస సభ



**దర్శి, మే 2, ప్రభాతవార్త**
స్థానిక పీజీఎస్ కళ్యాణ మండపం నందు ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఎస్‌కే అబ్దుల్ హై అధ్యక్షతన సభ ప్రారంభించబడింది. అంతకు ముందు పాత కోర్టు సెంటర్లో దర్శి యూటీఎఫ్ డివిజన్ ఆధ్వర్యంలో రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా చలి వేంద్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించి తదుపరి కళ్యాణ మండపం నందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు ద్వారా డి.రామిరెడ్డికి ఘనమైన నివాళులర్పించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నక్కా మాట్లాడుతూ ప్రభుత్వ బడులను రక్షించుకుందాం, ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచుకుందాం ఇది రామిరెడ్డి వారసులుగా మన బాధ్యత అని తెలియజేశారు. పోరాటమే హక్కుల సాధనకు మార్గమని అధ్యక్షులు తెలియజేశారు భారత రాజ్యాంగం యొక్క పీఠకను విద్యార్థులకు తెలియజేయాలని సమసమాజం స్థాపన కోసం యూటీఎఫ్ పని చేస్తుందని తెలియజేశారు. రాజుల కాలం నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వచ్చామని, ఈ ప్రజా స్వామ్యం రాజ్యాంగం ద్వారా మాత్రమే సాధ్యమని తెలియజేశారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా గడ్డపై నడియాడిన దాచురి ఆశయాల కోసం ప్రతి యూటీఎఫ్ కార్యకర్త పని చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ విద్యా రంగ పరిణామాలపై మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులకు రావాల్సిన 20 వేలకోట్లు విడుదల చేయాలని, పీఆర్సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ఎస్‌కే అబ్దుల్ మాట్లాడుతూ రామిరెడ్డి మానస పుత్రిక కుటుంబ సంక్షేమ పథకమని ఈ పథకంలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు, గౌరవ అధ్యక్షులు ఎస్ రవి, ఆడిట్ కమిటీ కన్వీనర్ రాము, జిల్లా సహా ధ్యక్షురాలు మీనిగ శ్రీను, టి.రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ జి.కోటేశ్వరరావు, కుటుంబ సంక్షేమ డైరక్టర్ జి.విజయ్ కుమార్, ఈ.రోశయ్య, దర్శి మండల అధ్యక్షులు కే.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.కాశీం, అన్నెం శ్రీనివాసరెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు, కే.సురేష్‌బాబు, ఎంవీ రమణారెడ్డి, మండల విద్యాశాఖారులు కే.రఘురామయ్య, బి.రమాదేవి, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## బూచేపల్లికి కృతజ్ఞతలు తెలిపిన కుమ్మిత అంజిరెడ్డి



**దర్శి, మే 2, ప్రభాతవార్త**
రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కుమ్మిత అంజిరెడ్డి. ఇంతటి పదవి రావడానికి నా మీద నమ్మకంతో నాకు సహకరించిన దర్శి ఎమ్మెల్యే వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలకి బూచేపల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వింగ్లో ఉన్న సమస్యలపై పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బత్తినేని వెంకటేశ్వర్లు, చింత శ్రీనివాసులరెడ్డి, సూదిదేవర అంజయ్య, వేమిరెడ్డి చెన్నారెడ్డి, మిల్లర్ బుజ్జి, తుళ్లూరి బాబురావు, అన్నపురెడ్డి బిక్షాల్‌రెడ్డి, అన్నవరపు రవి, ఉడుముల వెంకట్‌రెడ్డి, ఎనుముల నర్సారెడ్డి, సంఘన నాగేశ్వరరెడ్డి, పాలపోగు డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఆర్ఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి




**ముండ్లమూరు, మే 2, ప్రభాతవార్త**
ప్రజా ఉద్యమాల్లో త్యాగాలు చేస్తూ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న సీపీఎం పార్టీ నేతల పట్ల అధికార బలంతో అహంకారపూరితంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉండి శాసనసభ్యులు ఉపసభాపతి ఆర్ఆర్ఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఎం ముండ్లమూరు మండల కమిటీ వేంపాడులో నిరసన కార్యక్రమం చేసింది. పార్టీ మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే పాలకోడేరులో గత 40 వేలు గా నివసిస్తున్న 110 పేదల ఇళ్లను కూల్చివేసిన ఘటనపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు స్థలాలను సందర్శించి ఘటనపై పేదల పక్షాన నిలిచారన్నారు. దీనిపై ఆర్ఆర్ఆర్ తీవ్రమైన పదజాలంతో దూషించారని పేర్కొన్నారు. వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాలకోడేరులో ఇళ్ల కోల్పోయిన పేదలకు ప్రత్యామ్నాయాన్ని చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, సత్యం, ఎర్రయ్య, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, జాన్, మహేష్, హనుమయ్య, తిరుపతయ్య, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సభకి తరలివెళ్లిన నాయకులు, అధికారులు



**ముండ్లమూరు, మే 2, ప్రభాతవార్త**
అమరావతిలో జరుగుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు ముండ్లమూరు మండలం నుండి టీడీపీనాయకులు అధికారులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శికూకట్ల నాగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ మాడపాకుల శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు తిండి నారాయణరెడ్డి, ముండ్లమూరు మండల అధ్యక్షులు మందలపు వెంకట శేషయ్య, యదామనూరి శ్రీహరి, ముండ్లమూరు డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ జనార్ధన్, ఏపీవో వెంకటరావు, టీడీపీ నాయకులు కూరపాటి నారాయణస్వామి, వెంకటేశ్వరరెడ్డి, చౌదరి తదితరులు ఉన్నారు.

## రాజధాని అమరావతి సభకి హాజరైన

### టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు



**దర్శి, మే 2, ప్రభాతవార్త**
ఆంధ్రుల కలల రాజధాని అమరావతి పనుల ప్రారంభోత్సవ సభ శుక్రవారం అమరావతిలో జరగగా ఈ సభకి హాజరైన దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, జిల్లాలోని పలు ఎమ్మెల్యేలు, దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు. ఈ సభకి ముఖ్య అతిధిగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ హాజరై ప్రసంగించారు. అమరావతి రాజధాని అందరికి అనుకూలంగా ఉంటుందని శాశ్వతంగా ఇదే రాజధాని కొనసాగుతుందని ఆ విధంగా చట్టం కూడా తీసుకురావడం జరుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాలివానతో పొగాకు పాకలు నేలమట్టం

### - గిద్దలూరు మండలంలో రైతుల కన్నీరు



**గిద్దలూరు, మే 2, ప్రభాతవార్త**
గిద్దలూరు మండలంలో మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం ప్రభావంతో మండలంలోని అన్ని గ్రామాలలో పొగాకు పంట తీవ్రంగా నష్టపోయింది. ఇప్పటికే ఖర్చులతో సతమతమవుతున్న రైతులకు ఈ ప్రకృతి విపత్తు మరో ఘోర ఆర్థిక బాధను తెచ్చిపెట్టింది. వర్షానికి పొగాకు పాకలు నేలమట్టమయ్యాయి. పంట పూర్తిగా నాశనమైందని, ఆశలన్నీ చిదిమిపోయాయని రైతులు వాపోతున్నారు. పొగాకు వలన అప్పులు తీరుతాయనుకున్న తరుణంలో ఈ వర్షం మమ్మల్ని నట్టేట ముంచేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పరిస్థితిని గురించి నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని నష్టపోయిన పొగాకు రైతులు కోరుకుంటున్నారు. ఈ నష్ట పరిస్థితిపై ప్రభుత్వం వెంటనే సమీక్షించి అధికారులు గ్రామాల్ని సందర్శించి నష్టాని అంచనా వేయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## రాయవరంలో ఘనంగా కిషోర వికాసం సమ్మర్ క్యాంపు ప్రారంభం

### - బాలికలు అన్ని రంగాలలో అబివృద్ధి చెందాలనేదే ప్రధాన ఉద్దేశ్యం

### - ఏపిఎం పిచ్చయ్య



**మార్కాపురం రూరల్, మే 2, ప్రభాతవార్త**
మార్కాపురం ప్రాజెక్టు గజ్జలకొండ సెక్టార్ పరిధిలోని స్థానిక రాయవరం గ్రామం నందు శుక్రవారం కిషోర వికాసం సమ్మర్ క్యాంప్ కార్యక్రమం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ వారి ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన గజ్జలకొండ ప్రభుత్వ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయి చరణ్ తేజ మాట్లాడుతూ కౌమార దశ అంటే ఏమిటి, ఆ దశలో జరుగు మార్పులు, పోషక విలువలు కలిగిన ఆహారం ఉపయోగాలు, తదితర విషయాల గురించి వివరించారు. ఏపిఎం పిచ్చయ్య మాట్లాడురతూ కిషోర వికాసం సమ్మర్ క్యాంపు అనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాలికలకోసం నిర్వహించే ఒక కార్యక్రమం అని, దీని ప్రధాన ఉద్దేశ్యం బాలికలకు విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఆత్మరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన, జీవనోపాధి అవకాశాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఈఓ శ్రీకాంత్, నాగభూషణం, టి విమలమ్మ, సుస్మిత, ఐసిడిఎస్ సూపర్ వైజర్ పి లలిత, సలోమి, విఏఓ బి కావయ్య, అంగన్ వాడీ కార్యకర్తలు కె విజయకుమారి, కె ఎలిసమ్మ, టి నాగలక్ష్మి, ఆశావర్కర్స్ వి.మార్తమ్మ,బాలామణి, కిశోర బాలికలు,మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురంలో కిషోర వికాసం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



**మార్కాపురం రూరల్, మే 2, ప్రభాతవార్త**
పట్టణంలోని శ్రీవిద్య కోచింగ్ సెంటర్‌లో "కిషోర వికాసం" పేరుతో వేసవి సెలవుల ప్రత్యేక శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని జిల్లాన్యాయ అధికారి రత్నప్రసాద్, మార్కాపురం మండల విద్యాశాఖ అధికారి శర్వాణి, ఐసిడిఎస్ సిడిపిఓ సుశీల దేవిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ యూనిసెఫ్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం మే 2వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 నుంచి 18సంవత్సరాల వయసుగల బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, సంపూర్ణ ఆరోగ్యం, పౌష్టికాహారం, సెల్ఫ్ డిఫెన్స్, ఫోక్స్ చట్టం మరియు చిన్న వయస్సులో వివాహాల వలన కలిగే సమస్యలపై అవగాహన కల్పించబడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసులను కన్వీనర్లుగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ రమాదేవీ, శ్రీవిద్య ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ శ్రీధర్, అంగన్ వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఆశా కార్యకర్తలు, రిసోర్స్ పర్సన్లు మరియు బాలికలు పాల్గొన్నారు.

## చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం తెలియజేయండి

### - కట్టడి చేసేందుకు ప్రజలు సహకరించాలి

### - అవగాహన కల్పిస్తున్న ఎస్పై డాక్టర్ రాజమోహన్‌రావు



**మార్కాపురంరూరల్, మే 2, ప్రభాతవార్త**
ప్రకాశం పోలీసులు ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారం కోసం వినూత్న పద్ధతికి అంకురార్పణ చేశారు. జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లె, పట్టణ శివారులలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం మార్కాపురం పట్టణంలోని రాజ్యలక్ష్మి కాలనీ నందు డిఎస్‌పి యు నాగరాజు ఆధ్వర్యంలో సిఐ సుబ్బారావు సమన్వయంతో కాలనీ ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రజలతో మాట్లాడి తాజా పరిస్థితులపై ఆరాతీశారు. స్థానికంగా ఉన్న ప్రజల యొక్క సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు, ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి, రోడ్డు భద్రతా నియమాల గురించి హెల్మెట్ యొక్క ఆవశ్యకత గురించి, ప్రజలకు పోలీస్ అధికారులు అవగాహన కల్పించారు. స్థానికంగా ఉన్న సమస్యలను మా దృష్టికి తీసుకువస్తే వాటిని చట్టపరిధిలో పరిష్కరించడానికి కృషిచేస్తామని తెలిపారు. అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్న వారి గురించి సమాచారం తెలపాలని సూచించారు. చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు ప్రజలు తమవంతు సహాయ సహకారాలు పోలీస్ శాఖకు అందించాలని కోరారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరును గురించి ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకువచ్చే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. ద్విచక్రవాహనాలపై ప్రయాణించే ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాలని, ఇటీవల జరిగిన అనేక రోడ్డు ప్రమాదాలలో ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ లేని కారణంగా మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ దరిస్తే తల, మెడ భాగాలకు రక్షణ కల్పిస్తుందన్నారు. తద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఎవరైనా సైబర్ నేరాల బారీన పడితే 1930నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## మార్కాపురం డివిజన్‌లో పోలీస్ 30 యాక్ట్ అమలు



**మార్కాపురంరూరల్, మే 2, ప్రభాతవార్త**
మే నెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు పోలీస్ 30 యాక్ట్ అమలు మార్కాపురం డివిజన్ వ్యాప్తంగా పోలీస్ 30 యాక్ట్ అమలు చేస్తున్నట్లు డిఎస్‌పి యు నాగరాజు ఒక ప్రకటనలో విడుదల చేవారు. పోలీసుల అనుమతులు లేకుండా మార్కాపురం డివిజన్ పరిధిలో ఎలాంటి బహిరంగ సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు,రాస్తారోకోలు చేయడానికి వీలు లేదని ఆయన స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ ముందస్తు చర్యలలో భాగంగా 30పోలీస్ యాక్ట్ అమలుపరుస్తున్నట్లు ప్రజలు సహకరించాలని కోరారు.

## మట్టి నమూనాల సేకరణపై అవగాహన కార్యక్రమం చేపట్టిన ఏఓ మహమ్మద్



**అర్ధవీడు, మే 2 ,ప్రభాతవార్త**
భూసార పరీక్షలు - మట్టి నమూనాల సేకరణపై అర్ధవీడు మండల వ్యవసాయ శాఖాధికారి షేక్ మహమ్మద్ రైతు సేవా కేంద్రాల సిబ్బందికి, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ మాట్లాడుతూ మట్టి నమూనా సేకరణ విధానం పొలం అంతా ఒకేరకంగా ఉన్నప్పుడు 5ఎకరాలకు ఒక నమూనా తీయాలని, మట్టి నమూనా తీయవలసిన పొలంలో 10-12చోట్ల మట్టిని సేకరించాలని తెలిపారు. మట్టి స్వీకరించాల్సిన ప్రదేశంలో చెత్తాచెదారం తీసివేసి పారా లేదా పలుగుతో వి ఆకారంలో 15సెంటీమీటర్ల లోతు గుంత తీయాలన్నారు. ఇందులో పైనుండి దిగువకు ఒకే మందంలో మట్టి పొరను తీయాలన్నారు. ఇలా అన్నిచోట్లా సేకరించిన మట్టిని గోనె పట్టా లేదా పాలీథీన్ పట్టాపై వేసి మట్టినంతా బాగా కలిపి చతురస్రాకారంలో పరచి నాలుగు భాగాలుగా చేసి ఎదరు ఎదరు భాగాలు తీసివేయాలన్నారు. మిగిలిన రెండు భాగాలను కలిపి మరలా ఇదే విధంగా చేయాలని తెలిపారు. ఈ విధరంగా అరకిలో మట్టి వచ్చే వరకు చేస్తుందాలని, అరకిలో మట్టిని ఒక పాలిథీన్ కవర్‌లో వేసి రైతు వివరాలు సర్వే నెంబరు పంటలు, తదితర వివరాలతో పరీక్ష కేంద్రానికి పంపాలని తెలిపారు. ఈ విధంగా పంపిన మట్టిని భూసార పరీక్ష కేంద్రంలో 12 రకాల పరీక్షలు చేసి ఫలితాలను రైతులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అర్ధవీడు మండలానికి 668మట్టి నమూనాలను సేకరణ కొరకు లక్ష్యాన్ని నిర్ధేశించడం జరిగిందని తెలిపారు. మేనెల 15 లోపు లక్ష్యాలను పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు.

## పెహల్గామ్ ఉగ్రవాద దాడిని నిరసిస్తూ ముస్లింల కొవ్వొత్తుల ర్యాలీ




**యర్రగొండపాలెం రూరల్, మే 2 ,ప్రభాతవార్త**
ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి యర్రగొండపాలెం పట్టణంలోని ముస్లింలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. నిందితులను శిక్షించాలని, అదేవిధంగా పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలని కోరారు. జమ్మూకాశ్మీర్‌లో గత సోమవారం జరిగిన పహల్గామ్ దాడిని ఖండిస్తూ ముస్లిం మత పెద్దలు యర్రగొండపాలెం బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జామియా మసీదు, ఈ సందర్భంగా ఇమామ్ మౌలానా హిదయతుల్లా మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులనే కౄరులు నిండు మానవత్వం మరచి అమాయకమైన ప్రజల ప్రాణాలు తీస్తున్నారని, ఇలాంటి వారిని సమాజం నుంచి బహిష్కరించాలని, ఈ దుర్ఘటనను యావత్ సమాజం అన్నివర్గాలు ఈ రక్తపాతాన్ని ఖండించాలని కోరారు. దాడిలో మరణించిన వారందరికీ ప్రత్యేక దువా ద్వారా నివాళులర్పించారు. ఈ దారుణ దాడికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని, కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మౌలానా హిదయతుల్లాతోపాటు మౌలానా మహమ్మద్ హుస్సేన్, మౌలానా జుబేర్, మౌలానా మహమ్మద్ రఫి, ముఫ్తి మీరావలి, మౌలానా ఇలియాస్, మౌలానా ఉస్మాన్, మౌలానా రహంతుల్లా, హాఫీజ్, అబ్దుల్లాలతోపాటు వివిధ పార్టీల నాయకులు షేక్ ఇస్మాయిల్, షేక్ జిలాని, సయ్యద్ జబీల్, తదితరులు పాల్గొన్నారు.

3-5Pg5exJ.qxd:3-5Pg5exJ.qxd 01/01/01 9:14 AM Page 1



# సుంకాల విషయంలో నిజాయితీయే ముఖ్యం

## డొనాల్డ్ ట్రంప్ చర్చల ప్రతిపాదనపై చైనా



**బీజింగ్, మే 2:** అమెరికా, చైనాల మధ్య పరస్పర సుంకాల నేపథ్యంలో వాణిజ్య యుద్ధం నెలకొన్న విషయం తెలిసిందే. టారిఫ్‌లపై విస్తృతస్థాయిలో చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం చైనా అధికారులను సంప్రదించింది. తాజాగా ఈ విషయంపై బీజింగ్ స్పందిస్తూ.. వాషింగ్టన్ ఇటీవల తీసుకున్న వాణిజ్య విధాన నిర్ణయాలు, సుంకాల తగ్గింపు విషయమై అగ్రరాజ్యంతో చర్చలు జరపాలా? వద్దా అని యోచి స్తున్నట్లు వెల్లడించింది. 'టారిఫ్ సమస్యలపై బీజింగ్‌తో చర్చలు జరపాలనే ఆశను వ్యక్తంచేస్తూ అమెరికా సంబంధిత వర్గాల ద్వారా అనేకసార్లు సందేశాలను పంపింది. దీంతో చర్చల విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకో వాలనే విషయాన్ని అధికారులతో సంప్రదించి ఓ అంచనాకు వస్తాము' అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. అయితే తమపై టారిఫ్ విధిస్తూ వాణిజ్య యుద్ధాన్ని అమెరికా ఏకపక్షంగా ప్రారంభించిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి అన్నారు. ఇప్పుడు ఆ దేశం తమతో చర్చలు జరపాలంటే తమతో నిజాయితీగా ఉండాలని తెలిపారు. బీజింగ్‌తో వ్యవహరిస్తున్న తప్పుడు పద్ధతులను సరిదిద్దుకొని తమపై విధించిన ఏకపక్ష సుంకాలను ఎత్తివేయడానికి చర్చలు తీసుకోవాలన్నారు. అప్పుడే అమెరికాతో బీజింగ్ సానుకూల చర్చలు చేపడుతుందని తెలిపారు.

మరోవైపు చైనానే టారిఫ్‌లపై చర్చల కోసం తీవ్రస్థాయిలో యత్నిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. బుధ వారం కూడా ఆయన మాట్లాడుతూ డీల్ కుదు ర్చుకోవడానికి బలమైన అవకాశాలున్నాయని చెప్పారు. 'చర్చల్లో మా నిబంధనలకు లోబడే ఒప్పందం చేసుకో నున్నాం. అదే మంచిది' అని ఆయన న్యూస్‌నేషన్ టౌన్‌హాల్ కార్యక్రమంలో వెల్లడించారు. దాదాపు వారం రోజుల క్రితం ట్రంప్ ఇటువంటి ప్రకటనే చేయగా చైనా బహిరంగంగానే ఖండించింది. నాడు బీజింగ్ ప్రతినిధి గువో జియాకున్ మాట్లాడుతూ 'ఇరుదేశాల మధ్య సంప్రదింపులు ఏమీ జరగడం లేదు. వాణిజ్య ఒప్పందం కుదరలేదు' అని చెప్పారు. అయితే ఈ అంశంపై భవిష్యత్తులో చర్చలకు సిద్ధమే అని చెప్పడం విశేషం. అయితే తాము చేసిన కొత్త వాణిజ్య ఒప్పందాల గురించి తమతో చర్చించడానికి 75 కంటే ఎక్కువ దేశాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని వైట్‌హౌస్ పేర్కొంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చైనాపై టారిఫ్‌ల కొరడా విసురుతున్న ట్రంప్ బీజింగ్ నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై సుంకాన్ని 145 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా చైనా కూడా అగ్రరాజ్య ఉత్పత్తులపై 125 శాతం టారిఫ్‌లు ప్రకటించింది. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య విభేదాలు భగ్గుమన్నాయి.

# శశిథరూర్‌తో నాఫోటో చూసి కాంగ్రెస్‌కు నిద్రపట్టదు

## తిరువనంతపురంలో ప్రధాని మోడీ ఛలోక్తులు



**తిరువనంతపురం, మే 2:** దేశాభివృద్ధిలో ఓడరేవులద్వారా వాణిజ్యం ఇపుడు కీలకం అవుతున్నదని కేరళలోని ఒక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన ప్రధాని మోదీ ప్రతిపక్ష పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. శశిథరూర్‌తో కలిసి ఉన్న ఫోటో చాలామందికి నిద్రలేకుండా చేస్తుందని కాంగ్రెస్‌ను ఉద్దేశించి శశిథరూర్, విజయన్ ముందే మోదీ వ్యాఖ్యానించారు. ఈ రోజు శశి థరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ కార్యక్రమం కొందమందికి నిద్రలేని రాత్రిని మిగులుస్తుంది. సందేశం ఎక్కడి వెళ్లాలో అక్కడికి వెళ్లిపోయింది అని మోదీ చమత్కరించారు. అంతకు ముందు గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధానిని శశి థరూర్ వ్యక్తిగతంగా వెళ్లి స్వాగతించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల ఆలస్యంగా నడుస్తున్నప్పటికీ సమయానికి తిరువనంతపురం చేరుకోగలిగా. నా నియోజకవర్గానికి వచ్చిన ప్రధాని మోదీని సాదరంగా స్వాగతించా అని థరూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే, కాంగ్రెస్ అధినాయకత్వంతో ఎంపీ శశి థరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు విని పిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా థరూర్ తన సొంత పార్టీపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ మధ్య ఓ కేంద్రమంత్రితో ఆయన సెల్ఫీ దిగడంతో థరూర్ పార్టీ మారనున్నట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ పరిణామాల వేళ థరూర్ మోదీతో వేదిక పంచుకోవడం చర్చనీయాంశంగా మారింది. గడిచిన 10 ఏళ్లలో భారత ఓడరేవుల సామర్థ్యం రెట్టింపు అయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. పోర్టుల సామర్థ్యం గణనీయంగా మెరుగుపడిందని వివరించారు. నావికుల సంఖ్యలో ప్రపంచంలోని తొలి మూడు దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్న ప్రధాని, టర్నరౌండ్ సమయం 30శాతం తగ్గిందని తెలిపారు. ఇంతకుముందు 75 శాతం భారత షిప్‌మెంట్ కార్యకలాపాలు విదేశీ ఓడరేవులలో నిర్వహించడం వల్ల దేశం చాలా ఆదాయాన్ని నష్టపోయిందని తెలిపారు. తిరువనంతపురంలో రూ. 8వేల867 కోట్లతో నిర్మించిన విజింజం అంతర్జాతీయ ఓడరేవును పినరయి విజయన్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ సమక్షంలో మోదీ ప్రారంభించారు. అంతర్జాతీయ వాణిజ్యం, షిప్పింగ్‌ల కోసం భారతదేశానికి ఈ ఓడరేవు కీలకమవుతుందని ప్రధాని తెలిపారు. దేశాభివృద్ధిలో పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు. జి20 శిఖరాగ్ర సమావేశంలోనే మేము భారత్‌మధ్యప్రాచ్యంయూరప్ కారిడార్‌పై అనేక పెద్దదేశాలతో ఒప్పందాలు చేసుకున్నాము. ఓడరేవులకు సంబంధించి కేరళ చాలా ముఖ్య స్థానంలో ఉంది. విజింజం ఓడరేవు నుంచి కేరళ కూడా పెద్ద ఎత్తున ప్రయోజనం పొందబోతోంది. మన దేశంలోని సముద్ర రంగాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడంలో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని మోడీ అన్నారు.

# ఉగ్రవాదుల అంతానికి భారత్‌కు సహకరించండి

## పాక్‌కు యుఎస్ వైస్‌ప్రెసిడెంట్ జెడి వాన్స్ సూచన

**వాషింగ్టన్, మే 2:** పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ పరిణామాలపై తాజాగా అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ దాడి విషయంలో భారత్ ప్రతిస్పందన ప్రాంతీయ సంఘర్షణలకు దారి తీయకుండా ఉండాలని కోరారు. అంతేగాక, ఉగ్రవేటలో న్యూఢిల్లీకి పాక్ సహకరించాలని పిలుపునిచ్చారు. 'పర్యాటకులపై ఉగ్రదాడిపై ఘటన తీవ్ర దిగ్భ్రాంతికరం. అయితే, దీనికి భారత్ ప్రతిస్పందించడం సరైనదే. అయితే, అది విస్తృత ప్రాంతీయ సంఘర్షణలకు దారితీయని విధంగా ఉంటుందని మేం విశ్వసిస్తున్నాం. ఇక, పాకిస్థాన్ కూడా ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆశిస్తున్నాం. కొన్నిసార్లు పాక్ భూభాగం నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాదులను వేటాడటంలో భారత్ చేస్తున్న ప్రయత్నాలకు వారు సహకరించాలి' అని జెడి వాన్స్ ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో వెల్లడించారు.



జెడి వాన్స్ సతీసమేతంగా భారత పర్యటనలో ఉన్న సమయంలోనే పహల్గాం ఉగ్రదాడి ఘటన జరిగిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఈ దాడిని వాన్స్ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేసే పోరాటంలో అమెరికా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన భరోసానిచ్చారు. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా పలు అగ్రరాజ్య నేతలు ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ భారత్‌కు మద్దతుగా నిలిచారు. ఇదిలా ఉండగా.. భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో అలజడి కొనసాగుతూనే ఉంది. నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు పాల్పడింది. కుప్వారా, బారాముల్లా, పూంఛ్, నౌషెరా, అఖ్నూర్ సెక్టార్లలో దాయాది బల గాలు కాల్పులకు తెగబడ్డాయి. వీటిని భారత ఆర్మీ సమర్థంగా తిప్పికొట్టింది. సరిహద్దుల్లో పాక్ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడటం వరుసగా ఇది ఎనిమిదో సారి కావడం గమనార్హం. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# ఐదేళ్లలో 119 మంది వైద్యవిద్యార్థుల ఆత్మహత్య



**న్యూఢిల్లీ, మే 2:** దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో 119 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో 64 మంది ఎంబీబీఎస్ అండర్ గ్రాడ్యుయేట్లు, 55 మంది పీజీ మెడికల్ విద్యార్థులు. అలాగే గత ఐదేళ్లలో 1,116 మంది వైద్య విద్యార్థులు చదువును మధ్యలోనే వదిలేశారు. వీరిలో 160 మంది అండర్ గ్రాడ్యుయేట్లు, 956 మంది పీజీ విద్యార్థులు. యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ (యూడీఎఫ్) నుంచి సమాచార హక్కు (ఆర్టీఐ) ద్వారా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఈ సమాచారాన్ని సేకరించింది. యువ వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు, వైద్య విద్యను మధ్యలోనే వదిలేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కాగా, 2018 నుంచి 2022 వరకు 64 మంది ఎంబీబీఎస్, 58 మంది పీజీ విద్యార్థులు సూసైడ్ చేసుకున్నట్లు గత ఆర్టీఐ డాటా ద్వారా వెల్లడైంది. అలాగే 2020-2022 మధ్య 531 వైద్య కాలేజీల్లో సుమారు 68 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎన్ఎంసీ గతంలో నివేదించింది. మరోవైపు యువ వైద్యులపై విద్య, పరీక్షల ఒత్తిడి, తగినంత విశ్రాంతి లేకపోవడం, ప్రతికూల పని వాతావరణం, పని భారం, ఎక్కువ అంచనాలు, తీవ్రమైన మానసిక ఒత్తిడి వంటివి ఆత్మహత్యలు, డ్రాపవుట్‌కు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో పని గంటలు తగ్గించడం, వైద్య విద్యార్థులను పర్యవేక్షించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి చర్యలు చేపట్టాలని సీనియర్ వైద్యులు సూచించారు. కాగా, మెడికల్ కాలేజీల నిర్వహణ, నిర్లక్ష్యంపై ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్యార్థులు సుమారు 1680 ఫిర్యాదులు చేసినట్లుఈ సమాచారం ద్వారా వెలుగులోకి వచ్చింది. దీంతో మెడికల్ కాలేజీల్లో వేధింపులు, ర్యాగింగ్‌ను నిరోధించాల్సిన అవసరాన్ని ఇది స్పష్టం చేస్తున్నదని సీనియర్ డాక్టర్లు వెల్లడించారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా రాహుల్‌కు నోటీసులు

**న్యూఢిల్లీ, మే 2:** నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ కోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టు విచారణకు స్వీకరించింది. చార్జిషీట్‌కు సంబంధించిన కేసును విచారించడానికి నిందితులైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా ఇతర నిందితులు కోర్టుకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు తదుపరి విచారణను ఈ నెల 8వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 2025 ఏప్రిల్ 9న మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్లు 3మరియు 4 కింద చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో సోనియా గాంధీని ఏ1గా, రాహుల్ గాంధీని ఏ2గా ఈడీ చేర్చింది. కాంగ్రెస్ నాయకులు సామ్ పిట్రోడా, సుమన్ దూబే వంటి వారు కూడా నిందితులుగా ఉన్నారు. నేషనల్ హెరాల్డ్ అనేది 1938లో జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించిన చారిత్రక వార్తాపత్రిక. యంగ్ ఇండియన్ లిమిటెడ్ వైఐఎల్ ద్వారా ఏజేఎల్‌కుచెందిన రూ.2,000 కోట్ల విలువైన ఆస్తులను కేవలం రూ.50లక్షలకు సోనియా, రాహుల్‌గాంధీ కొనుగోలు చేశారని ఈడీ అభియోగాలు మోపింది. వైఐఎల్‌లో రాహుల్‌కు 38శాతం,



సోనియాకు 38శాతం షేర్లు ఉన్నాయి. ఏజేఎల్‌కు చెందిన 99శాతం షేర్లను యంగ్ ఇండియన్ లిమిటెడ్‌కు బదిలీచేశారు. ఈ లావాదేవీ మనీలాండరింగ్‌లో భాగమన్నది ఈడీ ప్రధాన ఆరోపణ.

# రెండునెలలపాటు ఆహారం నిల్వచేసుకోండి

## పీవోకే యంత్రాంగం ప్రజలకు సూచనలు



**ఇస్లామాబాద్, మే 2:** పహల్గాం ఉగ్రదాడితో భారత్ ఫాకిస్థాన్‌లమధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగారూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనంచేసుకోవాలని అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు సూచనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఆహారం నిల్వచేసుకోవాలంటూ స్థానికులను పీవోకే యంత్రాంగం అప్రమత్తంచేసింది. రెండునెలలకు సరిపగా ఆహారం నిల్వచేసుకోవాలని వాస్తవాధీన రేఖకు సమీపంలో ఉన్న 13 నియోజకవర్గాలప్రజలకు సూచనలు చేసామని చౌద్రీ అన్వర్ ఉల్‌హక్ స్థానిక అసెంబ్లీలో శుక్రవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వం రూ.100 కోట్లతో ఎమర్జెన్సీ ఫండ్‌ను ఏర్పాటుచేసింది. ఆహారం ఔషధాలు ఇతర కనీస అవసరాల సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండాచూసుకునేందుకు ఈమొత్తం కేటాయించినట్లు ఉల్‌హక్ తెలిపారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలోనే దొంగదెబ్బతో పీవోకేను తన నియంత్రణలోకి తీసుకున్న పాకిస్థాన్ ఆప్రాంత అభివృద్ధిని గాలికొదిలేసింది. ఇండియాపై విద్రోహచర్యలకు పాల్పడేందుకు ఉపయోగించే ప్రదేశంగానే పీవోకేను పాక్‌చూస్తోంది. పీవోకే ప్రధానమంత్రి పీఠం అధిరోహించినవారు ఇస్లామాబాద్ సర్కారు చేతుల్లో కీలుబొమ్మగానే మిగిలిపోతున్నారు. ఫలితంగా స్థానికుల హక్కులకు రక్షణ లేకపోతోంది. దివాలా అంచున ఉన్న పాకిస్థాన్‌ను స్థానిక తిరుగుబాట్లు, వరుస ఉగ్రదాడులు సతమతంచేస్తున్నాయి. ఈపరిస్థితుల్లో అక్కడ భారత్ అనుకూల వాదం పెరుగుతోంది. భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపి లార్డ్ మేఘనాథ్ ఇటీవల మాట్లాడుతూ కాశ్మీర్ వివాదం రూపుమాపాలంటే ఆక్రమిత కాశ్మీర్‌ను పూర్తిగా భారత్ స్వాధీనంచేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారం అన్నారు. ఉగ్రవాదులను శిక్షించేందుకు ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత్ కఠినంగా జవాబివ్వాలనికోరారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలాక్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేసారు. కశ్మీర్ వివాదంలో ఈఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తంచేసారు. ప్రధాని మోడీ నాయకత్వంలో భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్న ధీమా వ్యక్తం చేసారు.

# కేంద్ర మాజీ మంత్రి గిరిజా వ్యాస్ మృతి

## ఆమె లేని లోటు కాంగ్రెస్ పూడ్చుకోవడం కష్టం: టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్,మే 2,ప్రభాతవార్త:** రాజస్థాన్‌కి చెందిన కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు గిరిజా వ్యాస్ (79) గురువారం సాయంత్రం మృతి చెందారు. గత మార్చి 31న ఆమె నివాసంలో పూజా కార్యక్రమం నిర్వహిస్తుండగా దురదృష్టవశాత్తూ ఆమె చీరకు మంటలు అంటుకున్నాయి. మంటల్లో తీవ్రంగా గాయపడిన గిరిజా వ్యాస్‌ను అత్యవసరంగా అహ్మదాబాద్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుండి ఆమె చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా కాలిన గాయాల ప్రభావంతో ఆమె ప్రాణాలను కోల్పోయారు. ఆమె పివి నరసింహారావు మంత్రివర్గంలో కేంద్రమంత్రిగా సేవలందించారు. మహిళల హక్కుల కోసం, సామాజిక న్యాయ స్థిరీకరణ కోసం ఆమె ఎంతో కృషి చేశారు. ఆమె నిఖార్సైన నాయకత్వం, పార్లమెంటరీ విధానాలపై ఉన్న లోతైన అవగాహన రాజకీయ వర్గాల్లో విశేష గౌరవాన్ని పొందింది. గిరిజా వ్యాస్ రచయితగా కూడా ప్రసిద్ధి చెందారు, ఆమె రచనల ద్వారా సమాజంలో అభివృద్ధి, మార్పు సాధ్యమని నమ్మకం కలిగించారు. రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా సమర్థవంతంగా పనిచేసిన నాయకత్వం కలిగిన గిరిజవ్యాస్ మరణం కాంగ్రెస్ కటుబానికి తీరని లోటని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ గిరిజా వ్యాస్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ గిరిజా వ్యాస్ మరణం బాధాకరం డాక్టర్ గిరిజా వ్యాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా అని అన్నారు. 1985లో తొలి సారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆమె 1991, 1996, 1999లో ఉదయపూర్ నుంచి హ్యాట్రిక్ విజయాలతో లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారని గుర్తుచేసుకొన్నారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ హయాంలో ఆమె కేంద్ర మంత్రిగా బాధ్యతలను నిర్వహించారు. రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్‌గా పనిచేసి కాంగ్రెస్‌పార్టీ గెలుపునకు దోహదపడ్డారని కొనియాడారు.

# ఐదో తరగతి స్టూడెంట్‌తో టీచర్ జంప్,అరెస్టు

**సూరత్, మే 2:** నాలుగు రోజుల క్రితం 11 ఏళ్ల విద్యార్థితో పారిపోయిన మహిళా ఉపాధ్యాయురాలిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్‌లోని సూరత్‌లో ఉన్న పూనాగం ప్రాంతం నుంచి ఐదో తరగతి విద్యార్థితో పారిపోయిన సదరు ఉపాధ్యాయురాలిని రాజస్థాన్ సరిహద్దులోని షామ్లాజీ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థితో కలిసి బస్సులో వెళ్తుండగా అరెస్టు చేశారు. మొబైల్ టవర్ లొకేషన్ ఆధారంగా వారు ఉన్న స్థలాన్ని పోలీసులు గుర్తించారు. బాధిత విద్యార్థిని అతడి కుటుంబానికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టీచర్, విద్యార్థి కలిసి వడోదర, అహ్మదాబాద్, జైపూర్, దిల్లీ, బృందావన్ వంటి వివిధ ప్రదేశాల్లో తిరిగారు. వారిద్దరు దాదాపు 2,200 కిలోమీటర్లు మేర ప్రయాణించారు. ఈ ప్రయాణం చేసే క్రమంలో బాలుడిని సదరు ఉపాధ్యాయురాలు శారీరకంగా వేధించిందని పోలీసులు తెలిపారు. ఉపాధ్యాయురాలు తన వాంగ్మూలంలోనూ విద్యార్థిని శారీరకంగా వేధించినట్లు అంగీకరించిందని సూరత్ సిటీ డీసీపీ భగీరథ్ గర్వి చెప్పారు. ప్రయాణించే క్రమంలో ఉపాధ్యాయురాలు, టీచర్ కలిసి రెండుహోటళ్లలో రాత్రి బస చేశారని చెప్పారు. దీంతో ఆమెపై పోక్సో చట్టం, భారత న్యాయ సంహితలోని సెక్షన్ 127 కింద కేసు నమోదు చేశామన్నారు. ఇద్దరికీ వైద్య పరీక్షలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. సూరత్ నుంచి పారిపోయే క్రమంలో రైలు ఎక్కేముందు టీచర్ తన మొబైల్ ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసిందన్నారు. ఆ టీచర్‌కు చెందిన రెండో మొబైల్‌ను ట్రాక్‌చేయగా లొకేషన్ వివరాలు తెలిశాయని డీసీపీ పేర్కొన్నారు. ఈ టీచర్ సూరత్‌లోని పూనాగం ప్రాంతంలో ఉన్న ఒక హిందీ మీడియం పాఠశాలలో పనిచేసేది. ఈ క్రమంలోనే ఒక విద్యార్థికి ఆమె చేరువైంది. సదరు



విద్యార్థికి మూడు సంవత్సరాల పాటు ప్రైవేట్ ట్యూషన్ కూడా చెప్పింది. దీంతో ఇద్దరి మధ్య సంబంధం మరింత పెరిగిందని వెల్లడైంది. ఏప్రిల్ 25న మధ్యాహ్నం ఐదో తరగతి విద్యార్థి తన ఇంటి బయట ఆడుకుంటూ అకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలించగా అసలు విషయం బయట పడింది. ఈ విద్యార్థి అదృశ్యం కావడానికి కొన్ని క్షణాల ముందు, తనకు ట్యూషన్ చెప్పే ఉపాధ్యాయురాలితో మాట్లాడినట్లు వెల్లడైంది. దీనిపై అదే రోజున సూరత్‌లోని పూనా పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదైంది. సూరత్ రైల్వే స్టేషన్‌లో రికార్డయిన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు ప్రాథమిక ఆధారంగా సేకరించారు. మహిళా టీచర్, బాలుడు కలిసి అక్కడే రైలు ఎక్కినట్లు సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డయింది. బుక్ మై ట్రిప్ యాప్ ద్వారా ఉపాధ్యాయురాలు టూర్‌కు సంబంధించిన బుకింగ్స్ అన్నీ చేసినట్లు తేలింది.

# ఒడిశా కిట్‌లో విద్యార్థిని అనుమానాస్పద మృతి

**కటక్, మే 2:** ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ప్రతిష్ఠాత్మక కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కిట్)లో మరో విషాదం చోటుచేసుకుంది. యూనివర్సిటీకి చెందిన బాలికల హాస్టల్ గదిలో నేపాల్ విద్యార్థిని గురువారం సాయంత్రం విగతజీవిగా కనిపించింది. మూడు నెలల వ్యవధిలో ఇదే క్యాంపస్‌లో నేపాల్ విద్యార్థిని మృతి చెందడం ఇది రెండోసారి కావడంతో తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసుల కథనం ప్రకారం మృతురాలు కంప్యూటర్ సైన్స్ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె స్వస్థలం నేపాల్ రాజధాని కఠ్మాండుకు సుమారు 135 కిలోమీటర్ల దూరంలో ఉన్న బీర్‌గంజ్. గురువారం రాత్రి 8 గంటల సమయంలో బాలికల హాస్టల్‌లోని తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న స్థితిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే యూనివర్సిటీ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. భువనేశ్వర్‌కటక్ పోలీస్ కమిషనర్ సురేష్ దేవ్‌దత్తా సింగ్ మాట్లాడుతూ, 'కిట్ యూనివర్సిటీలో నేపాల్‌కు చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్టు మాకు సమాచారం అందింది. మేం సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించాం. శాస్త్రీయ బృందం వచ్చి అవసరమైన ఆధారాలు సేకరించింది. సమగ్ర విచారణ జరుపుతాం. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాం. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎయిమ్స్‌కు తరలించాం' అని తెలిపారు. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల స్పష్టమైన కారణాలు తెలుస్తాయని, ప్రస్తుతానికి దీనిని అనుమానాస్పద మృతి గా పరిగణిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గత మూడు నెలల్లో కిట్ యూనివర్సిటీలో నేపాల్



విద్యార్థిని మరణించడం ఇది రెండోసారి. ఫిబ్రవరి 16న బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ప్రకృతి లమ్సాల్ అనే నేపాల్ విద్యార్థిని కూడా ఇదే విధంగా హాస్టల్ గదిలో విగతజీవిగా కనిపించింది. ఆ సమయంలో సహచర విద్యార్థి ఒకరు తనను లైంగికంగా వేధించారని యూనివర్సిటీ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఆఫీస్ కు ఫిర్యాదు చేసినట్టు తర్వాత వెలుగులోకి వచ్చింది. అయితే, యూనివర్సిటీ యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోలేదని, ఇది 'తీవ్ర నిర్లక్ష్యం' అని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఎన్‌హెచ్ఆర్సీ వ్యాఖ్యానించింది. విద్యార్థి సంఘాలు, పౌర సమాజం తీవ్రంగా స్పందించడంతో, ఆమె మరణించిన మరుసటి రోజే నిందితుడిని అరెస్టు చేశారు. బీజేడీ నేత, మాజీ ఎంపీ అచ్యుత సమంత స్థాపించి, నిర్వహిస్తున్న ఈ యూనివర్సిటీపై అప్పట్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.నేపాల్ విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవ్బా ఈ ఘటనపై స్పందించారు. నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు భారత ప్రభుత్వం, ఒడిశా ప్రభుత్వం, ఢిల్లీలోని నేపాల్ రాయబార కార్యాలయ ఉన్నతాధికారుల ద్వారా దౌత్యపరమైన చర్యలు ప్రారంభించినట్టు సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా తెలిపారు. 'ప్రిసా సాహ్ మరణం మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని ఆమె పేర్కొన్నారు.

# నాక్కూడా బెదిరింపుకాల్స్ వస్తున్నాయ్..

## కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

**బెంగళూరు, మే 2:** తనకు కూడా బెదిరింపు కాల్స్ వస్తున్నాయని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. బెదిరింపులకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు చెప్పారు. స్పీకర్ యుటి ఖాదర్‌కు బెదిరింపు కాల్ వచ్చిందంటూ విలేకరుల ప్రశ్నకు సీఎం ఈ విధంగా స్పందించారు. నాకు కూడా బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. ఏం చేయాలి పోలీసులకు సమాచారం ఇచ్చాము. బెదిరింపు కాల్స్ చేస్తున్న వారిని కనుగొని వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాని సీఎం సిద్ధరామయ్య విలేకరులతో అన్నారు. అంతేకాదు, మంగళూరులో జరిగిన రౌడీషీటర్ సుహాస్ శెట్టి హత్య ఘటన నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి అరెస్టు



చేయాలని పోలీసులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మంగళూరులో రౌడీ షీటర్ సుహాస్ శెట్టి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఐదుగురు వ్యక్తులు కొడవళ్లు, కత్తులతో నడిరోడ్డుపై నరికి చంపేశారు. ఈ ఘటనతో మంగళూరులో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ప్రజలు గుమిగూడడాన్ని నిషేధించారు. ఊరేగింపులు, నినాదాలు చేయడం,ఆయుధాలను పట్టుకెళ్లడాన్ని నిషేధించారు. సుహాస్‌ను పథకం ప్రకారమే హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అయితే ఆమర్డర్ వెనుక ఉన్నకారణం ఇంకా తెలియరాలేదు.

# దేశరాజధానిలో వర్షబీభత్సం

**న్యూఢిల్లీ మే 2:** దేశ రాజధాని దిల్లీలో వర్షం బీభత్సం సృష్టించింది. శుక్రవారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రోజువారీ పనులకు ఆటంకం కలిగింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలయమం అయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షం కారణంగా దిల్లీలో విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సుమారు 100 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. మరో 3 విమానాలను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. రెండు విమానాలను జైపుర్‌కు, ఒకటి అహ్మదాబాద్‌కు దారి మళ్లించినట్లు తెలిపారు. ఉత్తర భారతంలోని పలు ప్రాంతాల్లో కూడా విమాన సేవలకు అంతరాయం కలిగిందని ఎయిర్ ఇండియా వెల్లడించింది.రానున్న కొన్ని గంటల్లో దిల్లీలో ఉరుములు మెరుపులతో కూడిన అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. రాజధాని ప్రాంతానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇప్పటివరకూ నలుగురు మృతి చెందినట్లు తేలింది. బలమైన ఈ దురుగాలులతో దిల్లీలో చెట్లు నేలకొరిగాయి. ద్వారకలోని ఖర్ఖరి



కెనాల్ గ్రామంలోని పొలంలో నిర్మించిన ట్యూబ్‌వెల్ గదిపై చెట్లు విరిగి పడిన ఘటనలో నలుగురు మృతిచెందారు. ఒకరు గాయపడ్డారు. మృతులను 26 ఏళ్ల జ్యోతి, ఆమె ముగ్గురు పిల్లలుగా గుర్తించారు. ఆమె భర్త అజయ్ స్వల్ప గాయాలతో బయట పడినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.

3-5Pg6exHMNWJQE.qxd:3-5Pg6exHMNWJQE.qxd 01/01/01 10:23 AM Page 1



# వైసిపి కార్యకర్తలకు జెసి ప్రభాకర్ రెడ్డి వార్నింగ్

**అనంతపురం, మే 2 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం జిల్లా మాజీ ఎమ్మెల్యే, తాడపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తనదైన శైలిలో వైసీపీ కార్యకర్తలకు మాస్ వార్నింగ్ ఇచ్చారు. పెద్దవడుగూరు మండల కేంద్రంలో శుక్రవారం టిడిపి కార్యకర్తలతో సమావేశం సందర్భంగా వైసీపీ కార్యకర్తలను ఉద్దేశించి చేసి వ్యాఖ్యలు చేయడం చర్చినీయాంశంగా మారింది. తాడపత్రి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటించవచ్చని, ఐదు వాహనాలకు మించకుండా వాహనాల్లో తిరగవచ్చని రాష్ట్ర హైకోర్టు గురువారం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టిడిపి నేత, తాడపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి వైసీపీ కార్యకర్తలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. జేసీ ప్రభాకర్ రెడ్డి పెద్దవడుగురులో ఏమన్నాడంటే... మా వాళ్లకు చెప్తున్నాను వాళ్ల వాళ్లకు చెబుతున్నాను. ఇది మంచి పద్ధతి కాదు. రాజకీయంగా దూరమైన పెద్దవడుగూరులో అందరూ నా వాళ్లే. నాకు, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సరిపోదు. నేను అంటే ఆయన సరిపోదు. ఆయన అంటే నాకు సరిపోదు. శనివారము, ఆదివారము మోటార్ సైకిల్ పై మాజీ ఎమ్మెల్యే వస్తాడని చెప్పుకుంటున్నారు. ఎట్లా రాణిస్తారు డిన్నర్ ఎందుకు ఇస్తారు, కొంతమంది కీ తిప్పి డిన్నర్లకు సిద్ధం చేస్తున్నారు. పెద్దవడుగూరు మండలంలోకి తిప్పి డిన్నర్లు ఇప్పించే వారు సూర్యనారాయణ రెడ్డి, గౌడు, శరభారెడ్డి, రామచంద్ర లాంటి వారు ఉన్నారు.. ముందు వాళ్లు డిన్నర్ ఇచ్చి చూడాలని జేసీ ప్రభాకర్ రెడ్డి తనదైన శైలిలో హెచ్చరికలు చేశారు.

# బెట్టింగ్‌కు పాల్పడుతున్న 11 మంది అరెస్టు

### రూ.14.02 లక్షలు స్వాధీనం, ఒక కారు, ల్యాప్‌టాప్, మొబైల్స్ సీజ్: ఎస్‌పి వకుల్ జిందల్

**విజయనగరం, మే 2 ప్రభాతవార్త ప్రతినిధి :** విజయనగరం జిల్లా బొబ్బిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని శివరాంపురం గ్రామ శివారు మామిడి తోటలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. శివరాంపురం గ్రామ శివారులోని మామిడితోటలో క్రికెట బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని విచారణ చేయగా, బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టయిందని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ముషిడిపల్లి దివాకర్ ప్రధాన నిందితుడని, ఆయన క్రికెట్ బెట్టంగ్‌లకు పాల్పడుతూ నగదు సంపాదించాలనే లక్ష్యంతో బెంగళూరుకు చెందిన నిరంజన్ రెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి రాధే ఎక్చేంజ్ అనే బెట్టింగ్ యాప్ అడ్మిన్ తీసుకుని యువతను ఆకర్షించేందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ పట్నం జిల్లాల్లో కమీషన్ ఇస్తూ ఒక్కో ప్రాంతానికి ఒక్కో ఏజెంట్‌ను నియమించుకున్నాడని తెలిపారు. దివాకర్ పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గుండాల నవీన్, ఈదుబిల్లి సంతోషలతో కలిసి నేషనల్ ఎక్చేంజ్ అనే మరో బెట్టింగ్ యాప్ అడ్మిన్ ఐడి తీసుకున్నట్లుగా విచారణలో వెల్లడయిందని అన్నారు ఈ కేసులో ప్రధాన నిందితుడు ముషిడిపల్లి దివాకర్‌తో పాటు అంబటి రామ్మోహన్, మహంతి గణేష్, సామిరెడ్డి వాసు, కొట్టంగి మోహనరావు, మూడడ్ల పైడిరాజు, తాటి శంకరరావు, గేదెల శ్రీనివాస్, శీరపు నారాయణరావు, తెర్లి మోహన్‌రావు లను అరెస్టు చేసినట్లు వివరించారు. వీరి వద్ద నుంచి 14 లక్షల 2 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఒక కారు, ఒక ల్యాప్‌టాప్, 13 మొబైల్ ఫోన్‌లను సీజ్ చేసినట్లు వివరించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిరంజన్‌రెడ్డి, ఈదురపల్లి సంతోష్ ,కార్తీక్, నవీన్ ల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు ముషిడిపలి దివాకర్ తన ఏజెంట్లకు 3 శాతం కమీషన్ ఇవ్వడంతో పాటు పోగొట్టుకున్న వ్యక్తుల నగదులో 50 శాతం సొమ్మును ఏజెంట్లకు ఇచ్చి , వారిని బెట్టింగ్‌యాప్ ప్రమోట్ చేసేందుకు ప్రోత్సహించేవాడని ఎస్‌పి వకుల్ జిందల్ వివరించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ల జోలికి యువత పోవద్దని ఆయన సూచించారు. ఈ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు చేయడంలో కీలకంగా పనిచేసిన బొబ్బిలి డిఎస్‌పి భవ్యారెడ్డి, బొబ్బిలి సిఐ కె.సతీష్‌కుమార్,

ఎస్ఐ ఆర్.రమేష్, కానిస్టేబుళ్లు ఎన్ సత్యనారాయణ, పి.సతీష్‌కుమార్, కె,ఎర్రంనాయుడు,

పి.అప్పారావులను ఎస్‌పి అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సమావేశంలో డిఎస్‌పి భవ్యరెడ్డి, సిఐలు కె.సతీష్‌కుమార్, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, ఎస్ఐ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందల్

## అమరావతిపై జగన్‌కు అదే అక్కసు : యామినీ శర్మ

**విజయవాడ,ఏప్రిల్ 2,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాని మోడీ సహకారంతో కూటమి ప్రభుత్వ హయాంలో అమరావతి సహా రాష్ట్రం మొత్తం సమగ్రంగా అభివృద్ధి చెందనుందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ పేర్కొన్నారు. పిఎం మోడీ శుక్రవారం రూ.లక్ష కోట్ల విలువైన ప్రాజెక్ట్ పనుల ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపన కోసం అమరావతి వస్తున్నారు. గత ఐదేళ్ళలో జగన్ పాలనలో రాజధాని లేకుండా చేశారు. ఇప్పుడు జరుగుతున్న కార్యక్రమం మీద కూడ ఆయన అక్కసు వెళ్ళగక్కుతున్నారు అని ఒక ప్రకటనలో మండిపడ్డారు.



ప్రధాని మోడీకి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

## కులగణన నిర్ణయంపై హర్షం

**విజయవాడ, మే 2, ప్రభాతవార్త :** జనగణనతో పాటు కులగణన చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయం తీసుకోవడంపై ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం హర్షం వ్యక్తం చేసింది. విజయవాడలో సంఘం కార్యాలయంలో శుక్రవారం సంఘ రాష్ట్ర అధ్యక్షులు డా ఎన్ మారేష్ ఆధ్వర్యంలో బిజెపి ఎంపి ఆర్ కృష్ణయ్య ప్రదాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధానితో పాటు ఆర్ఎస్ఎస్ ఛీఫ్ మోహన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఐదు దశాబ్దాలుగా తాము చేస్తున్న ఉద్యమం ఫలించిందన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టులో వేసిన కేసును వెనక్కి తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా డా ఎన్ మారేష్ మాట్లాడుతూ విజయవాడ, విశాఖ, తిరుపతిల్లో సంఘం ఆధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు యార్లగడ్డ సందీప్, ఎల్లబాబు, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## లవ్ జీహాదీకి పాల్పడితే నిందితులకు స్టెరిలైజేషన్!

### బిజెపి ఎంపి అలోక్‌శర్మ సంచలన వ్యాఖ్యలు

**భోపాల్, మే 2:** హిందూ విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న 'లవ్ జీహాద్' అకృత్యాలపై భోపాల్ బిజెపి ఎంపి అలోక్‌శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. 'లవ్ జీహాద్' నిందితులకు సంతానోత్పత్తి కలుగకుండా శస్త్రచికిత్స జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక బహిరంగ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన విడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

## వడగాడ్పులపై ఎపి,తెలంగాణకు ఎన్‌హెచ్‌ఆర్‌సి లేఖ

### - దుర్బల వర్గాల రక్షణకు చర్యలు తీసుకోవాలని 11 రాష్ట్రాలకు ఆదేశం

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** వడగాలుల నుండి నిరుపేదలు, ఎండలో పనిచేసే కార్మికులు, వృద్ధులు, పిల్లలు, ఇల్లులేని వారిని రక్షించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమీషన్(ఎన్‌హెచ్ ఆర్‌సి) ఏపీ, తెలంగాణ సహా మొత్తం 11 రాష్ట్రాలను కోరింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలతో పాటు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్కండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, మహారాష్ట్ర, రాజస్థాన్‌ల ప్రభుత్వ ప్రధాన కార్యాదర్శులకు లేఖలు రాసింది. ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం 2018 నుండి 2022 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా వడగాలులకు 3,798 మంది చనిపోయిన విషయాన్ని గుర్తు చేస్తూ ప్రభుత్వాలు ముందస్తుగా అప్రమత్తం కావాలంది. ఏండవేడిమి కారణంగా తలెత్తే అనారోగ్య సమస్యలు, అందుకందించే చికిత్సకు సంబంధించిన ప్రోటోకాల్స్ విషయంలో ప్రామాణిక నిబంధనలనున అమలు చేయాలి. జాతీయ ప్రకృతి వైపరీత్య నిర్వహణ ప్రాధికార సంస్థ జారీ చేసిన ప్రామాణిక నిర్వహణ నిబంధనలు(ఎన్‌ఓసి)లకు అనుగుణంగా దుర్బల వర్గాలను వడగాలుల నుండి రక్షించడానికి తీసుకున్న ముందస్తు చర్యలపై కార్యాచరణ నివేదికను సమర్పించాలని అని కేంద్రం ఆదేశించింది.

## చంద్రబాబు,పవన్ ప్రత్యేక శ్రద్ధతో క్షిపణి పరీక్ష కేంద్రం : బుద్ధప్రసాద్

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణాజిల్లా నాగాయలంక మండలం గుల్లలమోదలో ఏర్పాటు చేయనున్న క్షిపణి పరీక్ష కేంద్రంతో ఈ ప్రాంత ఆర్థిక పరిస్థితులు గణనీయంగా మెరుగవుతాయని అవనిగడ్డ ఎంఎల్ఏ మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. గురువారం అవనిగడ్డ లోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్రాభివృద్ధికి మైలురాయి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేసి ఈ ప్రాజెక్ట్‌ను సాధించారని, వారికి కృతజ్ఞతలని బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. సుమారు రూ.20వేల కోట్ల అంచనా వ్యయంతో ఈ క్షిపణి పరీక్షా కేంద్రాన్ని

డీఆర్‌డీఓ నిర్మించనుందని చెప్పారు. క్షిపణి కేంద్రం పనులకు వర్చువల్‌గా శంఖుస్థాపన చేయడంతో పాటు, అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవానికి వస్తున్న ప్రధాని మోడీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## రాజధాని పునఃప్రారంభోత్సవం ప్రాంగణంలో 'ఐరన్'శిల్పాలు

**విజయవాడ,మే 2,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత హంగామా సాగింది. రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుండి ప్రజలు రాజధాని ప్రాంతానికి చేరుకున్నారు. సభావేదిక వద్ద ఏర్పాటు చేసిన శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బుద్ధుడు, కాలచక్రం, ఎన్టీఆర్, ప్రధాని నరేంద్రమోడీ విగ్రహాలతో పాటు మేక్ ఇన్ ఇండియా లోగో ఆకట్టుకుంటున్నాయి. దీంతో పాటు 'అమరావతి'అక్షరాలను రూపొందించారు. వీటిని ఐరన్ స్క్రాప్‌తో శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు తీర్చిదిద్దారు. అమరావతి పునఃప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంలో అనేక కళాత్మక దృశ్యాల సందర్శించారు. అమరావతి గత చరిత్ర వివరించే అనేక అంశాలు ఏర్పాటు చేసారు.


## మండే ఎండలతో వేసవి సెలవులు పొడిగింపు

చెన్నై, మే 2: దేశంలో ఎండలు మండిపోతుండటంతో వేసవి సెలవులను పొడిగించేందుకు కొన్ని రాష్ట్రాలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే దేశంలోని రాష్ట్రాలు విద్యా సంస్థలకు వేసవి సెలవులను ప్రకటించాయి. ఈ ఏడాది ఎండలు, వడగాలులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వేసవి సేలవులను పొడిగించే యోచనలో ఉన్నట్లు గురువారం తమిళనాడు పాఠశాల విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేష్ పేర్కొన్నారు. తమిళనాడులో వేసవి సెలవుల తర్వాత జూన్ 2న చాలా పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉంది. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సెలవులను పొడిగించే విషయంపై ముఖ్యమంత్రిని కూడా సంప్రదిస్తామని ఆయన అన్నారు. మంత్రి ప్రకటనతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మేడే సందర్భంగా అన్బిల్ మహేష్ తిరుచ్చిలోని టీవీఎస్ టోల్‌గేట్ వద్ద కరుణానిధి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. తమిళనాడులో ఎండలు మండిపోతున్నాయి. ఈ వేడి మరింత పెరుగుతుందని వాతావరణ కేంద్రం కూడా హెచ్చరించింది. వేడి ఎక్కువగా ఉంటే పాఠశాలల ప్రారంభం వాయిదా పడవచ్చు. ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల ఫీజులు, డ్రాపౌట్స్ పై కూడా మంత్రి కీలక కామెంట్స్ చేశారు. తమిళనాడు ప్రస్తుతం స్కూల్ డ్రాపౌట్ లేని రాష్ట్రమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం పేరుతో ఆ డ్రాపౌట్ రేటును పెంచడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. 1 నుంచి 8వ తరగతి వరకు ఎవరినీ ఫెయిల్ చేయకూడదనే విధానాన్ని తాము అనుసరిస్తున్నట్లు చెప్పారు. కానీ జాతీయ విద్యా విధానంలో 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ఉన్నాయి. దీని వల్ల పిల్లల డ్రాపౌట్ రేటు పెరిగే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేయడం సరికాదన్నారు. నిర్దేశించిన ఫీజు కంటే ఎక్కువ వసూలు చేస్తే సంబంధిత పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.

# తెల్లవారుఝామున ఈదురు గాలులు - పిడుగుల విధ్వంసం

### - జగ్గయ్యపేటలో ప్రకృతి బీభత్సం - నష్టాలను పరిశీలించి సహాయక చర్యలకు ఆదేశించిన ఎమ్మెల్యే

**జగ్గయ్యపేట, మే 2, ప్రభాతవార్త :** వేసవి వడగాల్పులతో ఆలస్యంగా నిద్రలోకి జారుతున్న ప్రజానీకం ఒక్కసారిగా ప్రాణభయంతో ఉక్కిరి బిక్కిరైంది. హఠాత్తుగా కన్నెర్రజేసిన ప్రకృతి బీభత్సం నష్టాలను మిగిల్చి కరుమరుగైపోయింది. ఇంటి కప్పులు లేచిపోయి, చెట్ల కొమ్మలు విరిగి ఇండ్లను ధ్వంసం చేస్తూ, నిద్రిస్తున్న వారిని గాయాలపాల్జేయటం, పిడుగు పాటుతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధం కావటం, విద్యుత్ సరఫరా 8 గంటలపాటు నిలిచిపోవటం, మామిడి తోటల్లో రాలిపడిన కాయలు, దెబ్బతిన్న పలు రకాల పంటలు వెరసి భయానక పరిస్థితులతో ప్రజలు భీతావహులయ్యారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుఝామున ఈదురు గాలులతో మొదలైన వర్షం ఉరుములు-మెరుపులు-పిడుగుల విధ్వంసం సృష్టించింది. కరెంటు స్తంబాలు కూలిపోవటం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవటం, జగ్గయ్యపేట మండల పరిధిలోని పలు గ్రామాలతోపాటు వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల పరిధిలోని గ్రామాల్లో కూడా మామిడి తోటలు పూర్తిగా కాయలు రాలిపోయి రైతుల కంట కన్నీటిని నింపాయి. రేకుల ఇండ్లలో నివసిస్తున్న ప్రజలు నిద్ర నుండి లేచేలోపుగానే ఇంటికప్పుగా వున్న రేకులు ఈదురు గాలులకు ఎగిరిపోయాయి. నిద్రిస్తున్న వారి మంచాలపై చెట్ల కొమ్మలు విరిగిపడటంతో క్షతగాత్రులైన వారిని ప్రభుత్వవైద్యశాలకు తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. జగ్గయ్యపేట శివారులోని కోదాడ రోడ్‌లో నిరూద్యోగ యువత ఏర్పాటుచేసుకున్న క్రికెట్ శిక్షణా శిబిరంలోని సామగ్రి కూలిపోయింది. దాదాపు రూ.10 లక్షల మేరకు వీరికి నష్టం వాటిల్లినట్లు యువత ఫిర్యాదు చేశారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ధూళిపాళ లక్ష్మణరావు పలు ప్రాంతాలు పర్యటించి విద్యుత్ పునరుద్ధరించి సకాలంలో కరెంటు సరఫరా చెయ్యాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందించేందుకు తన వంతు కృషిచేస్తానని ఎంఎల్ఏ రాజగోపాల్ హామీ ఇచ్చారు. సిపిఎం నాయకులు కూడా ఈదురు గాలులకు నష్టపోయిన రైతులను, ప్రజలను కలుసుకుని ఈమేరకు బాధితులకు న్యాయం చెయ్యాలని కోరారు.



## ఎస్సీ హోదా కోల్పోతుందని హైకోర్టు ఇచ్చిన తీర్పు దురదృష్టకరం

**విజయవాడ.మే2,ప్రభాతవార్తప్రతినిధి:** దళితులు క్రిస్టియన్ మతంలోకి మారిన మరుక్షణం ఎస్సీ హోదా కోల్పోతుందని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు దురదృష్టకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఏ మతంలోకి మారినా దళితులు అంటరానితనానికి, వివక్షతకు గురవుతూనే ఉన్నారని తెలిపారు. క్రిస్టియానిటీ కులాన్ని గుర్తించకపోయినా కుల వివక్ష కొనసాగుతున్నదని అనేక నివేదికలు వెల్లడించాయన్నారు. మన దేశంలో కులం మతంపై ఆధారపడిలేదని, వ్యవస్థీకృతమై ఉందని పేర్కొన్నారు. కులం పునాదుల్ని తొలగించడానికి అవసరమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక చర్యల్ని తీసుకోవాలని కోరారు. కాబట్టి దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలన్నారు. అందుకు అవసరమైన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఇక ప్రధాని చేసిన ప్రసంగం రాష్ట్రాభివృద్ధిపై ఏమాత్రం విశ్వాసం కలిగించేదిగా లేదని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లల్లో అమరావతి నిర్మాణానికి సహకరించానని చెప్పడం ఎంతటి దగానో ప్రజలందరికీ తెలుసునని పేర్కొన్నారు. అమరావతిలో కేంద్రప్రభుత్వ కార్యాలయం ఒక్కదానిని కూడా నిర్మించలేదని విమర్శించారు. ఈ పదేళ్లల్లో పూర్తికాని అమరావతి నిర్మాణం మూడేళ్లల్లో పూర్తిచేయాలంటే కేంద్రం ఎంత నిధులు ఇస్తుందో చెప్పలేదని వెల్లడించారు. రాష్ట్రంలో రూ.60వేల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశానని చెప్పిన ప్రధాని రాజధాని నిర్మాణానికి ఎంత ఇస్తున్నారో చెప్పలేదని పేర్కొన్నారు. అప్పులు తెచ్చి రాజధాని నిర్మిస్తే ఆ భారం తిరిగి ప్రజలపైనే పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి మనకు హక్కుగా రావాల్సిన నిధుల్ని రాబట్టడానికి రాష్ట్రప్రభుత్వం అఖిలపక్షం వేయాలని కోరారు.

## పిల్లల కోసం ఆధార్ ప్రత్యేక శిబిరాలు

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఈ నెల 5 నుండి 8 వరకు తిరిగి 12 నుండి 15 వరకు రెండు దశల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 0-6 ఏళ్ళ లోపు పిల్లల కోసం ప్రత్యేకంగా వీటిని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. చిన్నారుల జనన ధృవీకరణ ఒరిజనల్ పత్రాలను తల్లిదండ్రులు ప్రత్యేక శిబిరాల్లో చూపించి ఆధార్ నమోదు చేయించాలని సూచించారు.

రాష్ట్ర వ్యాప్తంగా జనన ధృవీకరణ పత్రం పొందిన 1,07,358 మంది చిన్నారులు ఆధార్ నమోదు చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. ఆధార్ ఇప్పటికే నమోదు చేయించుకుంటే అదే విషయాన్ని తెలియచేసి గ్రామ, వార్డు, సచివాలయాల్లోని రికార్డుల్లో నమోదు చేయించుకోవాలని అధికారులు సూచించారు.

# రాజధాని అమరావతి మీదుగా నిర్మిస్తున్న రైల్వే లైన్‌కు ఎర్రుపాలెం, నంబూరు సంబంధించి భూసేకరణ

**విజయవాడ.,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి మీదుగా నిర్మిస్తున్న రైల్వే లైన్‌కు ఎర్రుపాలెం నుంచి నంబూరు సంబంధించి భూసేకరణ ప్రక్రియ శరవేగంగా చేయనున్నారు. ఇప్పటికే 12 గ్రామాల పరిధిలో పెగ్ మార్కింగ్ అంటే రైల్వే లైన్ వెంబడి వేసే మార్కింగ్‌ను అధికారులు పూర్తిచేశారు. తొలుత ఎన్టీఆర్ జిల్లా పరిధితోపాటు తెలంగాణలోని ఎర్రుపాలెం మండల పరిధిలో భూసేకరణ పూర్తిచేయనున్నారు. అనంతరం ఎర్రుపాలెం నుంచి అమరావతి వరకు 27 కిలో మీటర్ల మేర మొదటి దశ పనులు చేపట్టనున్నారు. మొత్తం 56.53 కిలో మీటర్ల మేర ఉన్న ఈ రైల్వే లైన్ కోసం 8 మండలాల్లోని 22 గ్రామాల్లో భూమిని సేకరిస్తున్నారు. ఈ జిల్లాల్లో ఎక్కువ భూములు సేకరణ: తెలంగాణలోని ఖమ్మం పరిధి ఎర్రుపాలెం మండలంలో 24.24 ఎకరాలు, ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లాలో 334.62 ఎకరాలు, పల్నాడు జిల్లాలో 333.95 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 199.43 ఎకరాల భూములను సేకరిస్తున్నారు. అమరావతి రైల్వేలైన్ ప్రాజెక్టుకు అవసరమైన భూమిలో ప్రైవేటు భూములు 741.8 ఎకరాలు, ప్రభుత్వ భూములు 98.2 ఎకరాలు, ఇనాం భూములు 52.01 ఎకరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఏయే మండలాల్లో భూసేకరణ కొలిక్కి వస్తే, వాటికి సంబంధించి డబ్బులను రైల్వేశాఖ త్వరలోనే డిపాజిట్ చేయనుంది. అమరావతి, తుళ్లూరు, తాడికొండ, పెదకాకాని మండలాల్లోని కొన్ని గ్రామాల్లో రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతుండటంతో ఇంకా పెగ్ మార్కింగ్ జరగలేదు. రెవెన్యూ అధికారుల చర్చలు కొలిక్కి వచ్చిన తరువాత అక్కడ కూడా పెగ్ మార్కింగ్ పూర్తి చేయనున్నారు. మొత్తంగా ఈ ప్రాజెక్టుకు కేంద్రం 2,047 కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. రైల్వే లైన్ వెళ్లే మండలాలు అందులోని గ్రామాలు తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని కేసిరెడ్డిపల్లి, ఎర్రుపాలెం ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలోని గూడెం మాధవరం, పెద్దాపురం, అల్లూరు, జుజ్జూరు, నరసింహారావుపాలెం, చెన్నారావుపాలెం కంచికచర్ల మండలంలోని పరిటాల, గొట్టుముక్కల. ఇబ్రహీంపట్నం మండలంలోని దాములూరు, చిలుకూరు. పల్నాడు జిల్లాలోని అమరావతి మండలంలో ఎండ్రాయి, కర్లపూడి, వైకుంఠపురం. తుళ్లూరు మండలంలోని మోతడక, వడ్డమాను. తాడికొండ మండలంలోని తాడికొండ, కంతేరు, పెదపరిమి పెదకాకాని మండలంలోని పెదకాకాని, కొప్పురావూరు. రైలులూను అందు బటులోకియ వస్తుంది.

## ఆలయ మాఢవీధుల్లో భూసమేత మలయప్ప,భాష్యకార్ల ఊరేగింపు

**తిరుమల,మే 2ప్రభాతవార్తప్రతినిధి:** భగవద్ రామానుజులు జన్మించిన వైశాఖమాస ఆరుద్రనక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు తిరుమల ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం భాష్యకార్లను ఆలయ నాలుగుమాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆ తరువాత నడకదారిలోని భాష్యకార్లసన్నిధిలో వైభవంగా అభిషేకం చేశారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఒక తిరుచ్చిపై, భాష్యకార్లను మరో తిరుచ్చిపై ఆలయ మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో విమానప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేశారు. రాత్రి 7.30గంటల నుండి 9.30గంటల వరకు భాష్యకార్లసన్నిధిలో సాత్తుమొర నిర్వహించారు.

ప్రత్యేక ఆభరణాలతో సళ్ళింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.



# ఉగ్రవాదులతో సంబంధాలు నిజమే: భిలావల్ భుట్టో

**లాహోర్, మే 2:** ప్రపంచదేశాలను, అంతర్జాతీయ సంస్థలను నమ్మిస్తూ ఇన్ని రోజులు ఉగ్రవాదులకు తమకు సంబంధం లేదన్న పాకిస్థాన్ ఇప్పుడు స్వరం మార్చింది. ఉగ్రమూకలతో సంబంధాలు ఉన్నాయని బహిరంగాగానే ఒప్పుకుంటోంది. పాక్ అసలు నిజం ఇప్పుడు బయటపడుతోంది. పాకిస్థాన్ ఉగ్రమూకలను పోషించినట్లు,

దాదాపు 30 ఏళ్లుగా ఆ పని అమెరికా కోసం చేసినట్లు ఇటీవల ఆ దేశ రక్షణ మంత్రి క్వాజా ఆసిఫ్ వెల్లడించారు. తాజాగా పాక్ మాజీ విదేశాంగ మంత్రి కూడా అదే బాటలో నడిచారు. గతంలో ఉగ్రవాదులతో తమకు సంబంధాలు ఉండేవని నిజం ఒప్పుకున్నారు. దాని వల్ల దేశం చాలా కోల్పోయిందని చెప్పారు.

ఈ మేరకు ఓ టీవీ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో భుట్టో వెల్లడించారు. మా చరిత్రలో అదో దురదృష్టం రక్షణ మంత్రి క్వాజా ఆసిఫ్ చెప్పిన దాని ప్రకారం, పాకిస్థాన్‌కు గతంలోఉగ్రవాదులతో సంబంధాలు ఉందనే విషయం రహస్యమని నేను భావించడం లేదు. దాని కారణంగా మనం, పాకిస్థాన్ బాధపడింది. మనం ఉగ్రవాదం, అతివాదాలను ఎదుర్కొన్నాం. కానీ మనం అనుభవించిన దాని ఫలితంగా, పాఠాలు కూడా నేర్చుకున్నాం. ఈ సమస్యను పరిష్కరించడానికి అంతర్గత సంస్కరణలు చేపట్టాం. పాకిస్థాన్ చరిత్ర చూసుకుంటే, అప్పుడు చేసిన తప్పు మనం ఇప్పుడు చేయడం లేదు. అది మన చరిత్రలో ఒక దురదృష్టకర భాగం అనేది నిజం అని అన్నారు. అయితే, ఇంతకుముందు గురువారం మీర్పుర్‌ఖాస్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడిన భుట్టో మరోసారి శాంతి వచనాలు వల్లెవేశారు.

పాకిస్థాన్ శాంతిని కోరుకుంటుందని, కానీ భారత్ తమను రెచ్చగొడితే యూద్ధానికి సిద్ధంగా ఉందని మేకపోతు గాంభీర్య ప్రదర్శించారు. పాకిస్తాన్ శాంతియుత దేశం, ఇస్లాం శాంతియుత మతం. మేము యుద్ధం కోరుకోము. కానీ ఎవరైనా మన సింధుపై దాడి చేస్తే,

వారు యుద్ధానికి సిద్ధంగా ఉండాలి. మేము యుద్ధ ఢంకా మోగించము. కానీ రెచ్చగొడితే, పాకిస్థాన్ అంతా ఒక్కటై గర్జిస్తే మీరు తట్టుకోలేరు" అని భుట్టో బీరాలు పోయారు.


## నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలసి న గౌరవ వందనం చేసిన గుంటూరు జిల్లా ఎస్పీ శ్రీ సతీష్ కుమార్ . జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

**గుంటూరు ప్రభాతవార్త ప్రతినిధి :** అమరావతి రాజధాని పనుల పునః ప్రారంభానికి విచ్చేసిన గౌరవనీయులైన భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ని మర్యాదపూర్వకంగా కలసి పోలీస్ గౌరవ వందనం చేసిన గుంటూరు జిల్లా ఎస్పీ శ్రీ సతీష్ కుమార్ . జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.



## అమరావతికి గుంటూరు నుండి భారీగా తరలివెళ్లిన ప్రజలు

**గుంటూరుతూర్పు,మే2,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహా సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి పునర్నిర్మాణానికి నాంది పలుకుతున్న ఈ మహత్తర ఘట్టానికి మేము సైతం అంటూ గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి వందలాది బస్సుల్లో కదిలిన ప్రజానీకం..శుక్రవారం గుంటూరు ఆటోనగర్ లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ జండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రుల భవితకు భరోసా సంకేతం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ ఇంచార్జి మేయర్ సజిల, కార్పొరేటర్లు వివిధ హోదాలో నాయకులు పాల్గొన్నారు



## జీవో నెంబర్ 77ను రద్దుచేయకుంటే ఐసెట్ పరీక్ష అడ్డుకుంటాం : ఏబివిపి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మే 2,ప్రభాతవార్త :** గత ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన జివో నెం 77ప్రైవేట్ కళాశాలలో పిజీ విద్యను అభ్యసించాలి అనుకునే పేద విద్యార్థుల



పాలిట శాపంగా తయారైందని యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ హేమంత్‌రామ్ అన్నారు. ఎలక్షన్‌కి ముందు నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తమ ప్రభుత్వంలోకి వచ్చిన వెంటనే జివో నె 77రద్దుచేస్తామని యువగళం పాదయాత్రలో చాలాసార్లు ప్రస్తావించారని ప్రభుత్వం వచ్చి 332 రోజులు గడిచినా ఇంకా జివో నెం 77 గురించి ప్రట్టించుకోకపోవడం వారికి విద్యార్థులు మీద ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుంది.ఏపిలో మే 7న ఐసిఈటి ప్రవేశ పరీక్షలు జరగబోతున్నాయి.ఈ ఒక్క జివో నెం 77రద్దు చేయకుండా ఐసిఈటి పరీక్షలు నిర్వహిస్తే ప్రైవేట్ కళాశాలలో ఎంబిఏ,ఎంసిఏ చదవాలనుకునే పేద విద్యార్థుల పరిస్థితి ఏంటని నేడు ప్రభుత్వాన్ని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిలదీస్తుందని ప్రశ్నించారు.ఐసెట్ పరీక్షలకు ముందే జీవో నెం.77ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రద్దుచేస్తున్నట్లు ప్రకటించకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్ని ఉద్యమాలను చేయడానికి అయినా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వెనకడుగు వేయ్యదని స్పష్టంచేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జివో నెం 77ను రద్దుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో యూనివర్సిటీ సెక్రటరీ వంశీ,లీలామోహన్,వెంకటేష్ పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం

**బాపట్ల,మే02,ప్రభాతవార్త:** మండల పరిధిలోని చెరువు జమ్ములపాలెం గ్రామం శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి త్రిశక్తి దేవాలయంలో తిరునాళ్ళ మహోత్సవాలు శుక్రవారం నుండి ఆదివారం వరకు జరుగుతాయని శ్రీ త్రీశక్తి దేవాలయ ఆహ్వాన సంఘం కమిటి సభ్యులు తెలిపారు.తిరునాళ్ళ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం తోరణ పాకు అలంకరణ, విఘ్నేశ్వర పూజ, శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ వారి శాంతి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.రాత్రికిగ్రామోత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం అమ్మవార్లకు విశేష పూజ, అర్చనలు, పూల అలంకరణ సాయంత్రం ఐదు గంటలకు కొల్లా వారి ఇంటి నుండి పసుపు కుంకుమ బళ్ళు గ్రామంలో ఊరేగించి అమ్మవారికి సమర్పించనున్నారు.శనివారం సాయంత్రం కోదండరామ కోలాట సమాజం పిల్లలచే కోలాట ప్రదర్శన నిర్వహించబడుతుందన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి విశేష పూజలు, పూలతో అలంకరణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పొంగళ్ల నైవేద్యం, సాయంత్రం విద్యుత్ ప్రభ ఊరేగింపు, కనకతప్పట్లతో మేల తాళాలతో విచిత్ర వేషధారణలతో విద్యుత్ వెలుగులతో గోవిందా గోవిందా అను నామస్మరణలతో సాగే అమ్మ ఇష్టమైన సిరులు కురిపించే విద్యుత్ ప్రభను మహిళలచే లాగించడం జరుగుతుందని శ్రీ త్రీశక్తి దేవాలయ ఆహ్వాన సంఘం కమిటి సభ్యులు తెలిపారు.



## నాదెండ్ల మండలం నుండి అమరావతి సభకు తరలివెళ్లిన కూటమి నాయకులు

**నాదెండ్ల,మే2,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామం నుండి, చుట్టు ప్రక్కల గ్రామాలనుండి అమరావతి పునఃప్రారంభ పనులు ప్రారంభానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీ సభ జరగనున్న అమరావతికి శుక్రవారం భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండలంలోని అమీన్ సాహెబ్ పాలెం నుండి తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగపూర్ణచంద్రరావు, పూనాటి కోటేశ్వరరావు, గుర్రం రామారావు, సుధీర్‌కుమార్ కొండ్రగుంట జనార్దన్, కోమటినేని కోటేశ్వరరావు, మరియు 150మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మహిళలు, పెద్ద ఎత్తున తరలివెళ్లారు.



## కనీస వేతనాలు ఇవ్వాలని కలెక్టరేట్ వద్ద నిరసన

**నరసరావుపేట, మే 2 ప్రభాతవార్త :** కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు షేక్.శిలార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏ మాత్రం అమలు చేయడం లేదన్నారు. ఔట్ సోర్సింగ్ డ్రైవర్లకు రూ.18,500లు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సంస్థ చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రమాదంలో గాయపడితే ఆరోగ్య భీమా, ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ సౌకర్యాలు, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. అలాగే వాహనాలకు మరమ్మత్తులు చేపట్టాలన్నారు. వారాంతపు, పండుగ సెలవులు, ఇంక్రిమెంట్లు, పిఎఫ్ ఇవ్వాలన్నారు. ఏడాది కాలం గడుస్తున్నా కనీసం తమ సమస్యను పట్టించుకోకపోవడం దారుణంగా ఉందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

## ప్రధాని, ముఖ్యమంత్రి సభకు తరలివెళ్ళిన జనసేన నాయకులు

**నరసరావుపేట టౌన్, మే 2 ప్రభాతవార్త :** జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి సయ్యద్ జిలానీ ఆదేశాల మేరకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం అమరావతికి తరలివెళ్ళారు. పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాలకు పార్టీ జెండాను ఊపి జిలానీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో రాజధాని పునర్ నిర్మాణానికి జనసేన శ్రేణులు తరలివెళ్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ రాష్ట్రంలో జరుగుతున్నటువంటి అద్భుతమైన పాలన, ప్రజా సంక్షేమానికి మద్దతుగా నిలవడం గొప్ప విషయమన్నారు. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ కృషి మేరకు రాష్ట్రానికి వివిధ పథకాల ద్వారా లక్షల కోట్ల రూపాయల సహాయం అందుతుందన్నారు. అదే విధంగా రాష్ట్రానికి రాజధానే లేకుండా చేసిన వైఎస్సార్‌సీపీని ప్రజలు ఎన్నికల్లో తిరస్కరించారని గుర్తు చేశారు. చారిత్రాత్మక వేడుకకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావడం సంతోషంగా ఉందని సయ్యద్ జిలానీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, పట్టణ అధ్యక్షులు జి.వి.ఎస్.ప్రసాద్, షేక్.అష్రూఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కుడి కాలువ ఆయకట్టు చివరి భూములు నీరు ఇవ్వాలి : సిపిఐ

**నరసరావుపేట టౌన్, మే 2 ప్రభాతవార్త :** ఈ ఏడాది అయినా నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్యలతో కలిసి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలువలలో పూడికతీతలు జరగకపోవడంతో నీరు ఎక్కడికక్కడ ఆగిపోతుందన్నారు. షట్టర్లను బాగు చేసే పరిస్థితి లేదన్నారు. జెంగిల్ క్లియరెన్స్‌ను తక్షణమే చేపట్టాలన్నారు. ఈ ఏడాది చివరి భూములకు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయాయని గుర్తు చేశారు. ఎన్నిమార్లు రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ప్రభుత్వానికి పంటలు ఎండిపోతున్నాయని మొత్తుకున్నా పట్టించుకోలేదన్నారు.

# గర్వించదగ్గ ఘట్టం : కేంద్రమంత్రి పెమ్మసాని

**గుంటూరుతూర్పు,మే2,ప్రభాతవార్త :** "రాజధాని అమరావతి పునః ప్రారంభ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులతో కలిసి పాల్గొనడం ఒక గొప్ప గౌరవంగా, గర్వించదగ్గ ఘట్టంగా భావిస్తున్నాను." అని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం అమరావతిలో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర విమానయాన శాఖ రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, , పురపాలక శాఖ మంత్రి నారాయణ తదితరులతో కలిసి పెమ్మసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున, ముఖ్యంగా గుంటూరు జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. మోదీ మద్దతుతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో కళ్యాణ్ నిరంతర కృషితో, అమరావతి ప్రపంచస్థాయిలో నిలవబోతున్న ప్రదేశంగా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లా అధికారులకు పెమ్మసాని అభినందనలు... అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం నిర్వహణ నిమిత్తం గడిచిన 15 రోజులుగా అవిశ్రాంతంగా శ్రమిస్తూ సభ నిర్వహణ కార్యక్రమాలను చేపట్టిన జిల్లా ఉన్నతాధికారులకు కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అభినందనలు తెలియజేశారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తోపాటు అతిరథ మహారథులైన నాయకులు పాల్గొన్నటువంటి ఈ కార్యక్రమంలో ఇలాంటి అసౌకర్యాలు కలగకుండా, సంపూర్ణ శ్రద్ధసక్తులతో పనిచేసే రాష్ట్ర ప్రభుత్వ గౌరవాన్ని నిలబెట్టిన కలెక్టర్ నాగలక్ష్మికి, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజకి, ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాటికి, ఎస్పీ సతీష్ కుమార్ కి తదితరులకు ఈ సందర్భంగా పెమ్మసాని ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



## అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతం : బాపట్ల జిల్లా కలెక్టరు

**బాపట్ల,మే02,ప్రభాతవార్త:** అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమమును విజయవంతంగా నిర్వహించినందుకు అధికారులకు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అభినందనలు తెలిపారు.భారత ప్రధానమంత్రి నరేంద్ర మోధీ అమరావతి



పునర్నిర్మాణ కార్యక్రమంకు విచ్చేయుచున్న సందర్భంగా జిల్లా నుంచి తరలి వెళ్తున్న ప్రజల కొరకు ఏర్పాటు చేసిన బస్సుల యొక్క కదలికలను తెలుసుకొనుటకు కలెక్టర్ కార్యాలయం వీక్షణ సమావేశం మందిరంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైనది జిల్లా కలెక్టర్ తెలిపారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ రూమ్ లో బస్సు కదలికలను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుండి 380 బస్సులను ఏర్పాటు చేయడమైనదని అన్నారు. అద్దంకి నియోజకవర్గం నుండి 71 బస్సులను ఏర్పాటు చేయడమైనది అందులో 3 వేల మంది, బాపట్ల నియోజకవర్గం నుండి 68 బస్సులలో 2750 మంది, రేపల్లె నియోజకవర్గం నుండి 58 బస్సులలో 2500 మంది, వేమూరు నియోజకవర్గం నుండి 52 బస్సులలో 2250 మంది, పర్చూరు నియోజకవర్గం నుండి 72 బస్సులలో 3 వేల మంది, చీరాల నియోజకవర్గం నుండి 59 బస్సులలో 2500 మంది మొత్తం జిల్లా నుండి 16 వేల మంది అమరావతి పునర్ నిర్మాణ కార్యక్రమానికి హాజరయ్యారని ఆయన తెలిపారు. బాపట్ల నియోజకవర్గం నుండి వెళ్లే బస్సులకు పొన్నూరు ఆర్టీసీ బస్టాండ్ లో ఏర్పాటుచేసిన భోజన స్టాల్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి భోజనం ఏర్పాటును పరిశీలించారు. బస్సులోని ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించారా అని వారిని అడిగి తెలుసుకున్నారు.నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన నాలుగు భోజన స్టాల్స్ నుండి ప్రయాణికులందరికీ భోజనం అందించామన్నారు. కార్యక్రమం అనంతరము రాత్రి భోజన సదుపాయాలు కల్పించామని ఆయన అన్నారు. అన్ని బస్సులు వారి గమ్యస్థానానికి చేరేవరకు కమాండ్ కంట్రోల్ లోని సిబ్బంది ఆ బస్సులలోని అధికారులతో నిరంతరము పర్యవేక్షణలో ఉంటారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, కమాండ్ కంట్రోల్ నందు విధులు కేటాయించిన సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి పునఃప్రారంభ వేడుకకు వెళ్లే బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,మే2,ప్రభాతవార్త:** రాజధానిలో నేడు అంగరంగా వైభవంగా జరగనున్న అమరావతి పునఃనిర్మాణ పనులు ప్రారంభ వేడుకకు పట్టణంలోని అనేక కూడళ్ల నుండి ప్రజలను తీసుకెళుతున్న బస్సులను శుక్రవారం మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ బస్‌లలో వెళ్లే కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆహారం,తాగునీరు అందించాలని మార్గమధ్యంలో బాగా నీడ ఉన్న చోట బస్సులను ఆపి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. బస్సులలో వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచాలని అదికారులకు సూచించారు. రాజధాని సభను విజయవంతం చేసి సంతోషంగా తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం సభకు వెళ్లేవారికి ఇబ్బందులు లేకుండా బస్సులలో చేసిన ఏర్పాట్లను ప్రత్తిపాటి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు, సిఐ రమేష్, టిడిపి నాయకులు షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, గంగా శ్రీనివాసరావు, మద్దుమాల రవి, గట్టినేని రమేష్, తూబాటి శ్రీహరి, వెంకటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.



## నిధుల కోసం అమరావతిలో హాలీవుడ్ సెట్టింగ్ : కాంగ్రెస్ ఇన్‌ఛార్జి


**మాచర్ల, మే 2, ప్రభాతవార్త:** అమరావతి, పోలవరం, విభజన హామీల నిధుల విడుదల కోసం అమరావతిలో హాలీవుడ్ సెట్టింగ్ చంద్రబాబు ఏర్పాటు చేసినట్లు మాచర్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి యరమల రామచంద్రారెడ్డి ఎద్దేవ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో బీజేపీకి మెజారిటీ రాలేదు. వచ్చి ఉంటే అసలు మన రాష్ట్రం వైపు కూడా మోడీ చూసేవాడు కాదన్నారు. ఈ అవకాశాన్ని చంద్రబాబు సామ, దాన, బేధ, దండోపాయాల ద్వారా రాష్ట్రానికి నిధులను విడుదలకు ప్రయత్నిస్తున్నారన్నారు. 2014లో బీజేపీకి కేంద్రంలో మెజార్టీ రాబట్టే ఇలాంటి సభ అమరావతిలో పెట్టించి దారుణంగా మోసం చేశారన్నారు. 2029లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అన్నారు. కార్యక్రమంలో మండలాల పార్టీ అధ్యక్షులు గాదె పుల్లారెడ్డి, వంగపాటి నాగరాజు, కొమ్ము కోటేశ్వరరావు, షేక్ బాబు, నాజర్‌వలి పాల్గొన్నారు.

## రోడ్ల వెంట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించండి : మున్సిపల్ కమిషనర్

**మాచర్ల, మే 2 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలో రోడ్ల వెంట ఏర్పాటు చేసిన పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు అన్నారు. వీటివల్ల ప్రజాభద్రత, ట్రాఫిక్, వాహన రద్దీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఎవరైతే వాటిని ఏర్పాటు చేశారో వారే ఫ్లెక్సీలను, బ్యానర్లను, పోస్టర్లను తొలగించాలని లేకుంటే ఎలాంటి సమాచారం లేకుండానే మున్సిపల్ సిబ్బంది చేత వాటిని తొలగిస్తామని చెప్పారు.

## అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి కొల్లూరు నుండి తరలి వెళ్ళిన బస్సులు

**కొల్లూరు, మే 2 (ప్రభాతవార్త) :** కొల్లూరు మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి శుక్రవారం మాజీ మంత్రి, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ఆదేశాల మేరకు అమరావతి పునర్మిర్మాణ శంఖుస్థాపన కార్యక్రమానికి కొల్లూరు మండలం నుండి బయలుదేరిన 50వాహనాలు వీటికి జెండా ఊపి ప్రారంభించిన వారిలో కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ కొల్లూరు ఎంపీడీవో ఎన్.నరసింహారావు, ఏపిఎం రాము ఉన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, మండల పరిధిలోని గ్రామాలు ప్రజలు తరలి వెళ్ళారు.



## భరతమాత అన్నప్రసాద వితరణ

**సత్తెనపల్లి, మే 2 ప్రభాతవార్త :** భరతమాత అన్నప్రసాద వితరణ పథకం 689వ రోజు శుక్రవారం నిర్వహించారు. పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద కీర్తిశేషులు మాధురి ఆత్మకు శాంతికలగాలని వారి కుటుంబసభ్యులకు ఉచితంగా 140 మంది పేదలకు భోజన ప్యాకెట్లను అందించారు. న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనాటి దాతలకు, వారి కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రుచికరమైనటువంటి భోజనాన్ని తక్కువ ధరకు అందించిన కొండలుకు అభినందనలు తెలిపారు. అన్నప్రసాద కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## బిజెపి రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రధాని సభకు భారీగా తరలి వెళ్లిన నాయకులు, కార్యకర్తలు

చిలకలూరిపేట,మే2,ప్రభాతవార్త: అమరావతి పునఃప్రారంభ పనులను ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభిస్తున్న సందర్భంగా అమరావతిలో జరిగే సభకు బిజెపి రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలోబిజెపి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ సభకు వెళ్లే నాయకులు, కార్యకర్తలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దడబడ పుల్లయ్య,అడుసుమల్లి వెంకటేశ్వరరావు, పోతవరం సుభాని, పంచుమర్తి, పూర్ణచంద్రరావు, సుభాని, అన్నపురెడ్డి లక్ష్మణ్, నలమాల పేరయ్య, ధ్రువకుమార్, పఠాన్ నబీ తదితర నాయకులు తరలివెళ్లారు.



## ఘనంగా మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల విగ్రహావిష్కరణ

**నరసరావుపేట, మే 2 ప్రభాతవార్త :** పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం ఘనంగా మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ కోడెల జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎం.పి.లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, ప్రత్తిపాటి పుల్లారావు, ప్రభుత్వ చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు, జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు,



యువ నాయకులు డాక్టర్ కోడెల శివరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ కోడెల ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన నాటి నుండి తెలుగుదేశంపార్టీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారని తెలియజేశారు. అదే విధంగా అనేక పథకాలను రాష్ట్రంతో పాటు కేంద్రం నుండి సైతం తీసుకువచ్చారని తెలిపారు. శాసనసభ్యునిగా, మంత్రిగా, సభాపతిగా ఆదర్శంగా నిలిచారన్నారు. కోడెల చేసిన అభివృద్ధి నేటి ప్రజా ప్రతినిధులకు మార్గదర్శకం అన్నారు. కోటప్పకొండ అంటే గుర్తుకు వచ్చేది కోడెల అని తెలిపారు. నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాలలో పోటీ చేసి విజయం సాధించడంతో పాటు ఆయా నియోజకవర్గ ప్రజలకు అందించిన సేవలు కలకాలం గుర్తుంటాయన్నారు. అదే విధంగా మండలంలోని అల్లూరివారిపాలెం గ్రామంలో తెలుగుయువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, పట్టణ ప్రముఖులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా పాల్గొన్నారు.

## ప్రధాని, ముఖ్యమంత్రి సభ విజయవంతం : నాగోతు శౌరయ్య

నకరికల్లు, మే 2 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రజల స్వప్నమైన అమరావతి నిర్మాణం బహిరంగ సభ శుక్రవారం విజయవంతమైందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నకరికల్లు మండలం నుండి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్ళారని తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధికి, ప్రధాని నరేంద్రమోడీ అందిస్తున్న చేయూత గొప్పదని తెలియజేశారు. చరిత్రలో నిలిచే విధంగా అమరావతి సభ విజయవంతమైందన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అమరావతి నుండే ప్రణాళికలు అమలవుతాయన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవానికి రాజధాని అద్దం పడుతుందన్నారు. గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమంతో పాటు అద్భుతమైనటువంటి అభివృద్ధిని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాజధాని ప్రాంతంలో అత్యవసరమైనటువంటి మంత్రులు, న్యాయమూర్తుల బంగ్లాలు, ఐకానిక్ అసెంబ్లీ, ఐకానిక్ హైకోర్టు, ప్రిన్సిపాల్ సెక్రటరీలు, ఐఏఎస్ బంగ్లాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా సచివాలయాల టవర్స్ అద్భుతంగా నిర్మించే కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అమరావతి రాజధానికి అనుబంధంగా 11 కీలక ప్రాజెక్ట్‌లకు ప్రధాని నరేంద్రమోడీ శంఖుస్థాపన చేయడం జరిగిందన్నారు. రూ.75 వేల కోట్ల పనుల ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వ ం సిద్ధం చేసిందని ఈ సందర్భంగా తెలియజేశారు. రాజధానికి సంబంధించి వివిధ ప్రాంతాలతో అనుబంధంగా హైవే రోడ్లు, రైల్వేలైన్లు ఏర్పడటం వలన రాష్ట్ర ప్రగతి అద్భుతంగా ముందుకుపోతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య వివరించారు.



## అమరావతి పునఃప్రారంభ కార్యక్రమ సభకు వెళ్లే 20వేలమంది ప్రయాణీకులకు మంచినీరు, ఆహారపదార్థాలు అందించిన రెవెన్యూ సిబ్బంది

**యడ్లపాడు,మే2,ప్రభాతవార్త:** రాజధాని అమరావతి పునఃప్రారంభ కార్యక్రమానికి తరలివెళ్లే బస్సులలోని ప్రయాణీకులకు 16వ నెంబర్ జాతీయ రహదారిపై యడ్లపాడు వద్ద రెవెన్యూ సిబ్బంది ఆహారపదార్థాలు అందచేశారు. షుమారు 20వేలమందికి పులిహోర, అరటిపండ్లు, మంచినీటి సీసాలు అందచేశారు. అంచనాలకు మించి బస్సులు రావడంతో మధ్యాహ్నం 2గంటల తరువాత ఆహారపదార్ధాల కొరత ఏర్పడింది. రాజధానిలో సభ ముగిసిన అనంతరం తిరుగు ప్రయాణంలో బస్సుల్లోని వారికి ఆహారపదార్థాలు అందించడానికి ఏర్పాట్లుచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కామినేని సాయిబాబు, మద్దూరి వీరారెడ్డి, కందిమళ్ల రఘురామారావు, మద్దినేని సుబ్బారావు, పోపూరి వెంకయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ఐ శివరామకృష్ణ శాంతి భద్రతలు పర్యవేక్షించారు.



## కోడెల అభివృద్ధి ఫలితాలు నేటికి ప్రజలు అనుభవిస్తున్నారు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,మే2,ప్రభాతవార్త:** పల్నాడు పులిగా ప్రజల హృదయాలలో నిలిచిన గొప్ప వ్యక్తి కోడేల శివప్రసాదరావు అని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో దివంగత నేత కోడెల శివప్రసాద్ విగ్రహవిష్కరణ కార్యక్రమంలో ప్రత్తిపాటి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీలో, ప్రభుత్వంలో అనేక పదవులు చేపట్టి ఉమ్మడి రాష్ట్రంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న గొప్ప వ్యక్తి కోడేల శివప్రసాద్ అని అన్నారు. పల్నాడు జిల్లా అభివృద్ధిలో కోడెల చెరగని ముద్ర వేశారని, కోటప్పకొండ పుణ్యక్షేత్రాన్ని తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్,యంపి లావు శ్రీకృష్ణదేవ రాయలుతో కలసి కోడెల శివప్రసాద్ విగ్రహన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవింద్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, కోడెల శివరాం, గోనుగుంట్ల కోటేశ్వరరావు, టిడిపి నాయకులు షేక్ కరిముల్లా, గంగా శ్రీనివాసరావు, గట్టినేని రమేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మర్రి రాజశేఖర్

**చిలకలూరిపేటటౌన్,మే2,ప్రభాతవార్త:** పట్టణంలోని 9వ వార్డులో వేంచేసియున్న శ్రీ ఈశాన్య ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన ధశమ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలలో శుక్రవారం శాసనసమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు మర్రి రాజశేఖర్‌కు స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించి తీర్ధప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో యర్రం శ్రీనివాసరెడ్డి, దండు కృష్ణారెడ్డి, నగరికంటి శ్రీకాంత్, తియ్యగూర ఈశ్వర్‌రెడ్డి, తియ్యగూర నరేంద్రరెడ్డి, ఒంటిపులి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

3-5pg10exW.qxd:3-5pg10exW.qxd 01/01/01 9:19 AM Page 1



# డెన్‌లో డాన్‌గా ముంబై



## కిందకి పడిపోయిన ఆర్సీబీ

## ప్లే ఆఫ్ బెర్త్ కోసం పోటీ

## మాజీ ఛాంపియన్లు ఎలిమినేట్స్

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2025 పాయింట్స్ టేబుల్‌లో ముంబై ఇండియన్స్ తొలిసారి టాప్ ప్లేస్‌కు చేరుకుంది. ఐపిఎల్ ప్లే ఆఫ్స్‌కు దగ్గరవుతున్న కొద్దీ ముంబై ఇండియన్స్ తన తడాఖాతో పాయింట్స్ టేబుల్ టాప్‌లో తొడగొట్టింది. సీజన్ ఆరంభంలో అట్టడుగు స్థానాలతో పోటీపడిన ముంబై ఇండియన్స్ ఇప్పుడు టాప్ ప్లేస్‌లో కింగ్‌లా కూర్చుంది. మొదటి ఐదు మ్యాచ్‌లలో కేవలం ఒక్కటే గెలిచి హార్దిక్ సేన, ఆ తర్వాత వరుసగా ఆరు విజయాలతో ముంబై ఈజ్ బ్యాక్ అని చాటిచెప్పింది. ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడిన ముంబై ఇండియన్స్ ఏడు విజయాలతో టేబుల్ టాప్‌లో నిలిచింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కంటే నెట్ రన్‌రేట్ ఎక్కువ ఉండటంతో ముంబై ఫస్ట్ ప్లేస్‌కి చేరుకుంది. వరుసగా ఆరు మ్యాచ్‌లలో విజయం సాధించిన ముంబై ఇండియన్స్ 14 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచింది. ఆర్సీబీకి కూడా 14 పాయింట్లు ఉన్నప్పటికీ నెట్ రన్‌రేట్ కారణంగా రెండో స్థానానికి వెళ్లాల్సి వచ్చింది. పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో జట్లు ప్లేఆఫ్ బెర్త్ కోసం పోటీ పడుతున్నాయి. సీఎస్కే, రాజస్థాన్ టోర్నీ నుంచి ఎలిమినేట్ అయ్యాయి. ఇక ఢిల్లీ క్యాపిటల్స్‌తో మొదలుపెట్టి వరుసగా సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్‌పై ముంబై ఇండియన్స్ వరుసగా ఆరు మ్యాచ్‌లు గెలిచింది. 14 పాయింట్లతో 1.274 నెట్ రన్‌రేట్‌తో టాప్ ప్లేస్‌లో నిలిచింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పది మ్యాచ్‌లలో ఏడు గెలిచి 0.521 రన్‌రేట్‌తో రెండో స్థానంలో కొనసాగుతోంది. మరో పక్క పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ప్లే ఆఫ్ బెర్త్ కోసం పోటీపడుతున్నాయి. పంజాబ్ కింగ్స్ పది మ్యాచ్‌లలో ఆరు గెలిచి, మరో మ్యాచ్ డ్రా కావడంతో 13పాయింట్లతో 0.199 రన్‌రేట్‌తో మూడో స్థానంలో ఉంది. గుజరాత్ టైటాన్స్ తొమ్మిది మ్యాచ్‌లలో 12 పాయింట్లతో 0.748 నెట్ రన్‌రేట్‌తో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్ కూడా పది మ్యాచ్‌లు ఆడి 12 పాయింట్లతో 0.362 రన్‌రేట్‌తో ఐదో స్థానంలో ఉండగా, లక్నో పది పాయింట్లతో 0.325 రన్‌రేట్‌తో ఆరో స్థానానికి పడిపోయింది. కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లకు దాదాపు ప్లే ఆఫ్ ఆశలు లేనట్టే అని చెప్పొచ్చు. భారీ అద్భుతం జరిగితే తప్ప ఈ రెండు జట్లు ప్లే ఆఫ్‌కు చేరుకోలేవు. కేకేఆర్ తొమ్మిది పాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతుండగా, సన్‌రైజర్స్ ఆరు పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉంది. మాజీ ఛాంపియన్లు ఎలిమినేట్ ఐపీఎల్‌లో ఐదు ట్రోఫీలు గెలుచుకున్న చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ నుంచి ఫస్ట్ ఎలిమినేట్ అయినజట్టుగా నిలవగా, ముంబైపై ఓటమి తర్వాత రాజస్థాన్ కూడా ఎలిమినేట్ అయింది. రాజస్థాన్ రాయల్స్ ఆరు పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉండగా, సీఎస్కే నాలుగు పాయింట్లతో అట్టడుగున పదో స్థానంలో ఉంది.



## ఫైనల్లో మలేషియా ఆశలు గల్లంతు

### భారత్‌కు ఓదార్పు విజయం

**న్యూఢిల్లీ:** క్వార్టర్ ఫైనల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాచేతిలో 0-3తేడాతో ఓడిపోవడంతో మలేషియా సుదిర్మాన్ కప్ ప్రచారం ముగిసింది. మొదటి సర్వ్‌కు ముందే, జియామెన్‌లోని ఫెంగ్‌హువాంగ్ జిమ్నాసియంలో 13 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన మలేషియాతో తలపడటం చైనాకు పెద్ద సవాల్ అయినా, చివరకు దాన్ని అధిగమించింది. మిక్స్‌డ్ డబుల్స్ జోడీ చెన్ టాంగ్ జీతో ఈ వీ మలేషియాకు సానుకూల ఆరంభాన్ని అందించే ప్రయత్నంలో తమ సర్వస్వం అందించారు, కానీ ఫెంగ్ యాంజెహు వాంగ్ డాంగ్‌పింగ్‌ను నిర్వహించడం చాలా కష్టంగా అనిపించింది. ఎంత కష్టపడినా, టాంగ్ జీ మరియు ఈ వీ 49 నిమిషాల్లో 17-21, 17-21 తేడాతో ఓడిపోయారు. గ్రూప్ దశలో ప్రపంచ 8వ ర్యాంకర్ కోడై నరోకాను అద్భుతంగా ప్రదర్శించిన తర్వాత ఊపందుకున్న పురుషుల సింగిల్స్ షట్లర్ లియోంగ్ జున్ హావో, ప్రపంచ 1వ ర్యాంకర్ షి యుకిపై అదే ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయాడు. జున్ హావో అసాధారణంగా కనిపించాడు మరియు యుకికి సరితూగలేకపోయాడు, చైనా తన రెండవ పాయింట్‌ను 38 నిమిషాల్లో 6-21, 14-21 తేడాతో ఓడిపోయింది. మలేషియా ఫైనల్ ఆశాకిరణం కె. లెట్షానా కూడా టోక్యో 2020 ఒలింపిక్ బంగారు పతక విజేత చెన్ యుఫీపై కఠినంగా వ్యవహరించినా ఫలితం లేకపోయింది. కేవలం 30 నిమిషాల్లో 8-21, 7-21 తేడాతో ఓడిపోయింది. గత రెండు ఎడిషన్లలో వంటా (2021) మరియు సుజౌ (2023)లలో చేసినట్లుగా, కనీసం పతకంతో తిరిగి రావాలనే మలేషియా ఆశలకు ఈ ఓటమి ముగింపు పలికింది. ఇక ప్రతిష్టాత్మక సుదిర్మన్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించిన భారత జట్టుకు ఓదార్పు విజయం. గ్రూప్ దశలో భాగంగా జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్.. 32తో ఇంగ్లండ్‌ను ఓడించింది. మహిళల సింగిల్స్‌లో అనుపమ 21-12, 21-16తో మియులిన్‌ను ఓడించి ఆరంభంలోనే ఆధిక్యం అందించింది. కరుణాకరన్ 18-21, 22-20, 21-13తో హ్యారీను చిత్తు చేశాడు.

## ఉమెన్స్ వన్డే ప్రపంచ కప్‌కు

# భారత్ ఆతిథ్యం

**న్యూఢిల్లీ:** భారత్‌లో జరిగే వన్డే ప్రపంచకప్-2025కి అర్హత సాధించిన పాకిస్తాన్‌తో హైబ్రిడ్ మోడ్‌లో టోర్నమెంట్ జరగనుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఐసీసీ ఉమెన్స్ వన్డే ప్రపంచకప్ మెగా టోర్నీ జరగనుంది. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 26 వరకు జరిగే ఈ మెగా టోర్నమెంట్‌కు భారతదేశం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మెగాటోర్నీకి ఫాతిమా సనా నేతృత్వంలోని పాకిస్తాన్ జట్టు అర్హత సాధించింది. ఇక పాక్ జట్టు వన్డే ప్రపంచ కప్ 2025 క్వాలిఫై కావడంతో ఈ మెగా టోర్నీని హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించనున్నారు. పాక్ ఆడే మ్యాచ్‌లను ఏ దేశంలో నిర్వహిస్తారు అన్న దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ మెగా టోర్నీలో ఆతిథ్య హోదాలో భారత్ ఆడనుండగా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, న్యూజిలాండ్ ర్యాంకింగ్స్‌లో తొలి ఆరు స్థానాల్లో నిలిచి అర్హత సాధించాయి. క్వాలిఫయర్స్‌లో ఆడి పాక్ అర్హత సాధించగా మరో స్థానం బంగ్లాదేశ్ సంపాదించింది. ఈ ఏడాది జరిగిన మెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీ-2025కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇచ్చింది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా భారత జట్టును పాక్‌కు పంపలేమని బిసిసిఐ ఐసిసికి తెలియజేసింది. ఈ క్రమంలో ఐసిసి సమక్షంలో బిసిసిఐ, పిసిబి బోర్డుల మధ్య హైబ్రిడ్ మోడ్‌కు అంగీకారం కుదిరింది. ఛాంపియన్స్ 2025తో పాటు భవిష్యత్తులో జరగనున్న అన్ని టోర్నీల్లో భారత్, పాక్ జట్లు తటస్థ వేదికల్లోనే ఆడతాయి.

## మాడ్రిడ్ ఓపెన్ టైటిల్ సెమీస్‌లో..

# కోకో గౌఫ్ సంచలన విజయం

### వరల్డ్ ఛాంపియన్ స్వియాటెక్ ఘోర పరాజయం



**న్యూఢిల్లీ:** పోలిష్ ప్రపంచ నంబర్ టూ మరియు ఐదు సార్లు గ్రాండ్ స్లామ్ విజేత, రెండవ ర్యాంక్‌లో ఉన్న ఇగా స్వియాటెక్ ఒక్క బ్రేక్ పాయింట్‌ను కూడా సాధించలేక పోయింది మరియు ఆమె ఎదుర్కొన్న ఏడు బ్రేక్ పాయింట్ లలో రెండింటిని ఒక గంటా ఆరు నిమిషా ల్లోనే కాపాడుకుంది. జరిగిన సెమీఫైనల్లో ప్రస్తుత ఛాంపియన్ ఇగా స్వియాటెక్ కోకో గౌఫ్ చేతిలో 6-1, 6-1 తేడాతో ఘోర పరాజయం పాలైంది. అమెరికన్ క్రీడాకారిణి మాడ్రిడ్ ఓపెన్ టైటిల్ కోసం ప్రపంచ నంబర్ వన్ అరినా సబలెంకాను ఎదుర్కోనుంది. సెమీఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన తర్వాత అమెరికాకు చెందిన కోకో గౌఫ్ సంబరాలు చేసుకుంటున్నారు. రెండవ ర్యాంకర్ స్వియాటెక్ గౌఫ్‌పై ఐదుసార్లు సర్వీస్‌ను వదులుకుంది. సాధారణంగా క్లే కోర్ట్ మీద అద్భుతంగాఉండే స్వియాటెక్, మాడ్రిడ్ టైటిల్ డిఫెన్స్ సమయంలో ఇబ్బంది పడింది. ఆమె అలెగ్జాండ్రా ఈలా మరియు డయానా ష్నైడర్‌లపై సెట్‌లను కోల్పోయింది, ఆపై కేవలం 24 నిమిషాల్లో మాడిసన్ కీస్ చేతిలో బాగెల్‌ను ఎదుర్కొంది. అయితే, 23ఏళ్ల పోల్ అమెరికన్‌ను ఓడించడా నికి బలంగా పుంజుకుని మొదటిసారి స్వియా టెక్‌ను ఓడించాడు. ఈ తాజా ఓటమితో, మేనెలలో తన ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను కాపాడుకునే ముందు, స్వియాటెక్‌కు రాబోయే ఇటాలియన్ ఓపెన్ మాత్రమే విజయాల బాటలో తిరిగి రావడానికి సహాయపడుతుంది.

## చెస్ టోర్నీలో ప్రజ్ఞకు మూడో ప్లేస్



**న్యూఢిల్లీ:** ఇండియా గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద (20.5 పాయింట్లు) సూపర్బెట్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో మూడో స్థానంలో నిలిచాడు. పోలెండ్‌లోని వార్సా వేదికగా జరిగిన ఫైనల్ రౌండ్లో ప్రజ్ఞా తొలి ఐదు గేమ్‌ల్లో ఒక్క పాయింట్ మాత్రమే సాధించాడు. కానీ సెకండాఫ్‌లో ఇండియన్ మాస్టర్ వరుసగా డుడా, తపలోవ్, అరవింద్, గావ్రిలెసెక్‌ను ఓడించాడు. దీంతో తొమ్మిది గేమ్‌ల్లో ఐదు పాయింట్లను సాధించడంతో మూడో ప్లేస్ ఖాయమైంది. వ్లాదిమిర్ ఫడోసీవ్ (స్లోవేనియా) 26.5 పాయింట్లతో టైటిల్‌ను గెలుచుకోగా, మ్యాక్సీమ్ వాచిర్ లాగ్రేవ్ (ఫ్రాన్స్) 21.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఇండియాకు చెందిన అరవింద్ చిదంబరం 17 పాయింట్లతో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ నెల 7 నుంచి మొదలయ్యే క్లాసికల్ ఈవెంట్లో ప్రజ్ఞానందతో పాటు గుకేశ్ బరిలోకి దిగనున్నాడు. అమెరికన్ ద్వయం కరువానా, వెస్లీ సో, నోడిర్బెక్ అబ్దుసత్తారోవ్ (ఉజ్బెకిస్తాన్) పోటీలో ఉన్నారు. రొమేనియా రాజధాని బుకారెస్ట్లో ఈ టోర్నీ జరగనుంది.

# ఎయిరిండియాకు రూ.5వేల కోట్ల నష్టం!

**న్యూఢిల్లీ, మే 2:** పహల్గాం ఉగ్ర దాడితో తలెత్తిన ఉద్రిక్తతల వల్ల పాక్ గగనతలం ఏడాది పాటు మూసివేతతో ఎయిర్ ఇండియా సంస్థకు రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లనుంది. ఈ విషయాన్ని ఆంగ్ల వార్తా సంస్థ పీటీఐ వెల్లడించింది. పాక్ పై భారత్ తీసుకొన్న దౌత్యపరమైన చర్యలకు ప్రతిగా వారు ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఎయిర్ ఇండియా సహా, ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు తాజాగా సూచనలు, సలహాలను పౌర వైమానిక శాఖకు తెలియజేశాయి. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించి తగిన పరిష్కారం వెతికే పనిలో ఆ శాఖ తలమునకలైంది. ఈ క్రమంలో ఏడాదిపాటు పాక్ గగనతలం మూసివేస్తే తమకు సుమారు 600 మిలియన్ డాలర్లు (రూ.5 వేల కోట్లు) నష్టం వాటిల్లుతుందని ఎయిర్ ఇండియా పేర్కొంది. ఈనేపథ్యంలో ఆ వైమానిక సంస్థ పలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టింది. ఈ విషయంపై ఆ సంస్థ నుంచి ఎటువంటి అధికారిక వ్యాఖ్యలు వెలువడలేదు. మనదేశంలో ఎయిర్ ఇండియా, ఎయిర్ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశా ఎయిర్ అంతర్జాతీయ సర్వీసులను నడుపుతున్నాయి. ఈ మేరకు ఏప్రిల్ 28న పౌర విమాన యాన శాఖ మంత్రి కె.




రామ్మోహన్ నాయుడు మన విమానయాన సంస్థలతో కలిసి ప్రత్యామ్నాయాలపై కసరత్తు చేస్తున్నారు. పాక్ నిర్ణయం ప్రభావం ఉత్తర భారత్‌లోని నగరాల నుంచి నడిచే సర్వీసులపై పడుతుంది. మన వైమానిక సంస్థలకు వారానికి రూ.77 కోట్ల అదనపు భారం పడొచ్చని అంచనా. ఇక భారత్ కూడా గత బుధవారం నుంచి పాకిస్థాన్ విమానాలకు మే 23వ తేదీ వరకు గగనతలం మూసివేసింది.

# టాటా ఆల్ట్రోజ్‌కు ఫేస్‌లిఫ్ట్

**ముంబై, మే 2:** ఆటోమొబైల్ ఇండస్ట్రీలో మే నెలలో సందడి వాతావరణం కనిపించనుంది. కొత్తగా అప్‌డేట్‌లు ఏవీ లేకపోవడంతో ఏప్రిల్ నెల చప్పగా సాగిపోయింది. ఈ నెలలో మాత్రం కార్లకు సంబంధించిన కొన్ని అప్‌డేట్స్ వాహన ప్రియులను అలరించనున్నాయి. ఆ వివరాలు ఇవీ..టాటా మోటార్స్‌కు చెందిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ టాటా ఆల్ట్రోజ్ ఫేస్ లిఫ్ట్ ఈ నెల రాబోతోంది. ఎక్స్‌టీరియర్ పరంగా బంపర్లు, అలాయ్ వీల్స్ వంటి చిన్నచిన్న మార్పులతో రాబోతున్న ఈ కారులో ఇంటీరియర్ పరంగా చాలావరకు మార్పులు చేయనున్నట్లు సమాచారం. సీఎన్‌జీ, పెట్రోల్, టర్బో పెట్రోల్, డీజిల్ ఇంజిన్లతో లభించబోతోంది. మే 21న కొత్త ఫేస్‌లిఫ్ట్‌ను లాంచ్ చేసే అవకాశం ఉంది. కియా కరెన్స్ ఫేస్‌లిఫ్ట్ క్లావిస్‌గా మార్కెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనుంది. మే 8న దీన్ని ఆన్‌లైన్‌లో ఆవిష్కరించనున్నారు. జూన్ 2న ధర వెల్లడి కానుంది. 360 డిగ్రీల కెమెరా, ఆరు ఎయిర్ బ్యాగులతో పాటు లెవల్2 అడాస్ ఫీచర్లతో ఈ కారు రాబోతోంది. పనోరమిక్ సన్‌రూఫ్, 12.3 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌తో వస్తోంది. పెట్రోల్, టర్బో పెట్రోల్, డీజిల్ ఇంజిన్ ఆప్షన్లతో ఈ ఎంపీవీ లభించనుంది. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ తన విండ్‌సోర్ ఈవీని మరింత బిగ్ బ్యాటరీతో తీసుకురాబోతోంది. ప్రస్తుతం 38కెడబ్ల్యూహెచ్ బ్యాటరీతో లభిస్తున్న ఈ కారులో కొత్తగా 50.6 కెడబ్ల్యూహెచ్ సామర్థ్యం కలిగిన బ్యాటరీ ఇవ్వనున్నారు. దీంతో ఆ మేర రేంజ్ పెరగనుంది. ఎంజీ మాతృ సంస్థ సియాక్‌కు చెందిన వులింగ్ క్లౌడ్ ఈవీకి అనుగుణంగా బిగ్‌బ్యాటరీతో విండ్‌సోర్ కారును తీసుకురానున్నారు. ఇది మే నెలలోనే రాబోతున్నప్పటికీ.. తేదీ మాత్రం ఇంకా వెల్లడికాలేదు. జర్మన్ కార్ల తయారీ సంస్థ గోల్ఫ్ జీటీఐ మోడల్‌ను ఇదే నెలలో లాంచ్ చేయనుంది. పోలో జీటీఐ తర్వాత జీటీఐ బ్యాడ్జ్‌తో వస్తున్న రెండో మోడల్ ఇది. దీన్ని నేరుగా దిగుమతి చేసి దేశీయంగా విక్రయించనున్నారు. 2 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో వస్తున్న ఈ కారు 261 బీహెచ్‌పీ పవర్‌ను, 370 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. వీటితో పాటు మెర్సిడెస్‌బెంజ్, ఆడి, బీఎండబ్ల్యూ నుంచి కూడా అప్‌డేట్స్ ఉండొచ్చని ఆటోమొబైల్ వర్గాలు చెబుతున్నాయి.



## అలెంబిక్ జనరిక్‌కు యుఎస్ఎఫ్‌డిఎ ఆమోదం

**వాషింగ్టన్, మే 2:** గుండెపోటు, స్ట్రోక్ నివారణకు జనరిక్‌ఔషధాన్ని మార్కెట్ చేయడానికి యూఎస్ హెల్త్ రెగ్యులేటర్ నుంచి ఆమోదం లభించిందని అలెంబిక్ ఫార్మా శుక్రవారం తెలిపింది. టికాగ్రెలర్ టాబ్లెట్లు..90 ఎంజి, 60ఎంజి కొత్త ఔషధ అప్లికేషన్(ఎఎన్‌డిఎ) కోసం కంపెనీ యుఎస్ఎఫ్‌డిఎ నుంచి తుది ఆమోదం పొందిందని అలెంబిక్ ఫార్మా ఒక ప్రకటనలో తెలిపింది. కంపెనీ ఆమోదించిన ఆస్ట్రాజెన్ కా ఫార్మాకు సంబంధించిన బ్రిలింటా టాబ్లెట్లు 60ఎంజి, 90 ఎంజిలకు చికిత్సాపరంగా సమానం అని అలెంబిక్ ఫార్మా పేర్కొంది. టికాగ్రెలర్ మాత్రలు తీవ్రమైన కరోనరీ సిండ్రోమ్ ఉన్న రోగులలో కార్డియోవాస్కులర్ మరణం, మయోకార్డియల్ ఇన్ఫార్‌క్షన్(ఎంఐ), స్ట్రోక్ నుంచి ప్రమాదాన్ని తగ్గించడానికి సూచించబడుతుంటాయి. ఐక్యూవిఐఎ ప్రకారం, 2025, మార్చితో ముగిసిన పన్నెండు నెలలకు టికాగ్రెలర్ ఔషధాలు(90 ఎంజి)..1,062 మిలియన్ డాలర్ల(రూ.8,920 కోట్ల) మార్కెట్ పరిమాణాన్ని కలిగి ఉన్నట్లు అంచనా. టికాగ్రెలర్ ఔషధాలు(60ఎంజి)..2025, మార్చితో ముగిసిన పన్నెండు నెలలకు 242 మిలియన్ డాలర్ల(రూ.2,032 కోట్ల) మార్కెట్ పరిమాణాన్ని కలిగి ఉన్నట్లు అంచనా.




# వాణిజ్యం

## టారిఫ్‌లతో ఆపిల్‌పై 900 మిలియన్ డాలర్ల ప్రభావం!

**వాషింగ్టన్, మే 2:** ఐఫోన్ తయారీ కంపెనీ ఆపిల్ ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. విశ్లేషకులు ఊహించిన దానికంటే మెరుగైన ఫలితాల్ని నమోదు చేసింది. అయితే రానున్న త్రైమాసికంలో అమెరికా సుంకాల కారణంగా కంపెనీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపింది. తమ సప్లై చెయిన్‌ను ఇది దెబ్బతీసే అవకాశం ఉందని వెల్లడించింది. సుంకాల వల్ల కంపెనీపై 900 మిలియన్ డాలర్ల మేర ప్రభావం పడనున్నట్లు కంపెనీ సీఈఓ టిమ్ కుక్ తెలిపారు. అమెరికా, చైనా భారీస్థాయిలో పరస్పర సుంకాలు విధించుకోవడంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య యుద్ధం రాజుకుంది. ఈ క్రమంలోనే టారిఫ్‌ల నుంచి తప్పించుకునేందుకు దిగ్గజ సంస్థ యాపిల్ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. అయితే ప్రతీకార సుంకాల నుంచి ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, సెమీ కండక్టర్లను మినహాయించారు. ఈ నేపథ్యంలో యాపిల్ ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటూ భారత్‌లో ఉత్పత్తిని పెంచింది. రానున్న రోజుల్లో సుంకాలపై ఎలాంటి చర్యలు తీసుకొనే అవకాశం ఉందో తెలియదు. దీంతో సుంకాల ప్రభావాన్ని కచ్చితంగా అంచనా వేయలేకపోతున్నాం. ప్రస్తుత సుంకాల రేట్లు, విధానాలు మారకపోతే ఆపిల్‌పై 900 మిలియన్ డాలర్లు అధిక భారం పడే అవకాశం ఉంది అని టిమ్ కుక్ అన్నారు. భారత్‌లో ఉత్పత్తిని మరింత విస్తరించాలని చూస్తున్నట్లు కంపెనీ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. ఐప్యాడ్, మ్యాక్, ఆపిల్ వాచ్, ఎయిర్‌పాడ్ వంటి ఉత్పత్తులు దాదాపుగా వియత్నాంలో ఉత్పత్తి అవుతున్నాయని కుక్ తెలిపారు.



అమెరికా వెలుపలి మార్కెట్ కోసం చైనా ఇప్పటికీ ప్రధాన ఉత్పత్తి కేంద్రంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇక ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఐఫోన్ విక్రయాలు జోరందుకున్నాయి. దీంతో ఆపిల్ 95.4 బిలియన్ డాలర్లఆదాయం నమోదు చేసింది. ఇందులో చైనా నుంచే 17 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఇక కంపెనీ లాభం 24.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 2:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నేడు ఒడుదొడుకులు ఎదుర్కొన్నాయి. ఆరంభంలో భారీ లాభాల్లో దూసుకెళ్లిన సూచీలు, ఇంట్రాడేలో ఆ లాభాలను కోల్పోయాయి. ముఖ్యంగా మెటల్, ఫార్మా షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ ఓ మోస్తరు లాభాల్లో ముగియగా, నిఫ్టీ 24,300 ఎగువన ఫ్లాట్‌గా స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 80,300.19 పాయింట్ల వద్ద (లాభాల్లో ప్రారంభమై, ఇంట్రాడేలో దాదాపు 900 పాయింట్లకు పైగా లాభపడి 81,177.93



వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 259.75 పాయింట్ల లాభంతో 80,501.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 12.50 పాయింట్ల లాభంతో 24,346.70 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.50గా ఉంది. అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, ఇండస్ ఇండ్ బ్యాంక్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. నెస్లే ఇండియా, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టైటాన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3270 డాలర్ల వద్ద కొనసాగింది.

## ఇంకా చలామణిలోనే రూ.2వేల నోట్లు

**న్యూఢిల్లీ, మే 2:** పెద్ద నోట్లు రద్దు తర్వాత తీసుకొచ్చిన రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుని దాదాపు రెండేళ్లవుతున్నా.. రూ.6266 కోట్ల విలువైన నోట్లు ఇంకా చలామణీలో ఉన్నాయి. ఇప్పటి వరకు 98.24 శాతం నోట్లు వెనక్కి వచ్చాయని.. మిగిలినవి ఇంకా రావాల్సి ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. నోట్లను వెనక్కి తీసుకున్నప్పటికీ.. అవి లీగల్ టెండర్ (చెల్లుబాటు)గా కొనసాగుతాయని తెలిపింది. 2023 మే 19 చలామణీలో ఉన్న రూ.2 వేల నోట్లను ఆర్‌బీఐ వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ప్రకటించే నాటికి రూ.3.56 లక్షల కోట్లు విలువైన నోట్లు చలామణీలో ఉన్నాయి. నోట్ల ఉపసంహరణ తర్వాత 2023 అక్టోబర్ 7 వరకు బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు పౌరులకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. ఆపై రిజర్వ్ బ్యాంక్‌కు చెందిన 19 ప్రాంతీయ కార్యాలయాల్లో డిపాజిట్ చేసే వెసులుబాటు కల్పిస్తోంది. అలా ఏప్రిల్ 30 నాటికి రూ.6,266 కోట్లు విలువైన నోట్లు ఇంకా వెనక్కి రాలేదని ఆర్‌బీఐ పేర్కొంది. ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాలకు వెళ్లలేని వారు పోస్టాఫీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించింది. తమ వద్ద ఉన్న నోట్లను ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాలకు పంపిస్తే.. అందుకు సమానమైన మొత్తం బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps